వనిత

జనవరి పదిహేను : 1977

విడి ప్రతి ఒక రూపాయి



పండుగ ఆనందపు అంచునకు
రంగుల మయమైన వస్త్రాల పంట కో-ఆప్టెక్స్

ప్రతి పండుగ సమయాలకు, ఆ సందర్భానికి అనుకూలంగా ఎప్పుడూ కో-ఆప్టెక్స్ నిలబడుతుంది. మళ్లీ ఈ సంక్రాంతికని ప్రత్యేకత ఏంలేదు! ఆనందపరిచే రంగుల్లో, డిజైన్లలో సరికొత్త తయారీ విడుదలలు! ఒక రంగురంగుల డిజైనుల వస్త్రాల పంట కో-ఆప్టెక్స్ దగ్గర మీకోసం ఎదురుచూస్తూవుంది.

చీరెలు — యమున, అజంతా మరియు శాముండి. అద్దకాల చీరలు, కాంచీపురం, ఆరణి, కుంభకోణం నుంచి అసలు సిసలైన పట్టుచీరలు, వొరయూర్, కొయంబత్తూర్, సేలం, పరమక్కుడి, మధురై నుండి చేనేత చీరలు, సుగంది అద్దకాలు మరియు చిన్నాళపట్టి చీరలు.

పంచెలు. తువ్వాళ్లు—టర్కిష్ మరియు సాదావి, మెత్తగావుండేవి మరియూ బాగా తడిని పీల్చుకొనేవి!

పరుపు దుప్పట్లు—సరికొత్త విధానాల్లో అతి సున్నితంగా నేసినవి. తలగడ గలేబులు కూడా!

లుంగీలు—డిజైన్లు లేనివి, వున్నవి. ఇంట్లో పర్నిచర్ సామగ్రికి మరియు మీ బట్టలకు వస్త్రాలు......

ఎప్పుడూ మామూలుగా ఉండే అరువు సదుపాయం
నెలసరి జీతాలు తెచ్చుకొనేవారికి!

20 - 1 - 1977 వరకు

సంక్రాంతికి
ప్రత్యేక తగ్గింపు
నూలువాటికి **10%**
పట్టువాటికి **15%**

Butterfly is handloom

శలవు రోజుల్లోనూ, ఆదివారాల్లోనూ తెరిచేవుంటాయి 20-1-77 వరకు.

కో-ఆప్టెక్స్ ఎంపోరియం, గోదావ్రి, స్టేషన్ రోడ్, సికిందరాబాద్



సంక్రాంతి
పండుగ
మైలాపూర్
వాణీ సిల్క్స్
పట్టు చీరెలు ధరించి ఆనందించండి
కాంచీపురం, ఆరణి, ధర్మావరం
పట్టు చీరెలు ఉత్పత్తి ధరలకే లభిస్తాయి
వాణీ సిల్క్స్ 'ఏర్‌కండిషన్డ్ షో రూమ్'
132, రాయపేట హైరోడ్డు (జిమ్మి బిల్డింగ్ దగ్గర)
మైలాపూరు, మద్రాసు-600 004
మా ఆదాయ పొదుపు పథకంలో చేరి లాభం పొందండి.
Phone: 76359

వనిత

స్త్రీ జన పక్ష పత్రిక

సంపుటి: 2 సంచిక: 14

జనవరి పదిహేను: 1977

విడి ప్రతి: ఒక రూపాయి

సం॥ర చందా: ఇరవైనాలుగు రూపాయిలు

శ్రీలంక: 1.15 రూ

మలేసియా: 65 సెంట్స్

చిరునామా:

చందమామ బిల్డింగ్స్

మద్రాసు-600 026

వచ్చే సంచికలో

ముఖచిత్రం:

గ్వాలియర్ యువరాణి

యశోధర

ఒక కథ:

బొట్టు

(జ్యోతిర్మయి)

గోష్ఠి:

ప్రముఖ రచయిత్రి

ఆచంట శారదాదేవితో

వంటలు:

టీ వేళ టిఫిన్లు

(వర్ణచిత్రాలతో)

1976వ సంవత్సరంలో 'వనిత' బాగానే ముందంజవేసిందని నా అభిప్రాయం. పాఠకులు కోరిన కొత్త శీర్షికలు ఆరంభించడం, మరికొన్ని కొత్తవి ఆరంభించడం జరిగినా – అందమైన పాదరక్షలు, కర్ణాభరణాలు – వేసవి విశుదులు– వంటి వర్ణచిత్రాలు వెయ్యడం మానలేదు. వాటివల్ల పెద్ద ఉపయోగం ఎవరికీ లేదు! ప్రారంభించిన శీర్షికలలో ప్రథమ చికిత్స, పండ్లు కూరగాయల పెంపకంపై జవాబులు, ఐసో మెట్రిక్స్ విధానంలో తేలిక వ్యాయామం – మొదలైనవి నిజంగా ఉపయోగకరమైనవి. డాక్టర్ పద్మాసినిగారి 'అనుమానం పెనుభూతం' ఎందుకు వేశారో అర్థం కాలేదు! అది–అంతకుముందు ఆమె చెప్పిన కేస్‌హిస్టరీల కోవలో లేదు. ఈ సంవత్సరంలో మీరు వేసిన కథలు బాగానే వున్నా–మంచి కథగా గుర్తుపెట్టుకోవలసిందేదీ కనిపించలేదు. 'సూడోసయిసిస్' వంటి కథల అవసరం ఎంతైనా వుందనిపిస్తుంది. ఆ జబ్బును రచయిత్రి కథారూపంలో వ్రాయడం బాగుంది. పెద్ద కథగా వేసిన "అమ్మ" బాగుంది. కవర్ పేజీలలో నాకు నచ్చినది – యద్దనపూడి సులోచనరాణిని వెయ్యడం. అలా మీరు రచయిత్రులను కవర్లలో వేస్తూవుంటే – మాకు ఆనందంగా వుంటుంది. ఉగాది వ్యాస రచనల పోటీ, వరకట్నం ఎందుకివ్వాలి? కుటుంబనియంత్రణ– మొదలైన పాఠకుల శీర్షికలు బాగున్నాయి; ఉపయుక్తంగా వున్నాయి. 'కాంటీన్లు నిర్వహించే వికలాంగ వనితలు' లాంటి వ్యాసాల అవసరం ఎంతైనా వుందనిపిస్తుంది. వేసిన 'వార్తల్లో వనితలు' అన్నీ బాగున్నాయి. ఒక సంచికలో 'పిల్లల పెంపకం' గురించి వేసినదీ, కొన్ని సంచికల్లో వేసిన 'లిబియాడైరీ' – ఉత్సాహకరంగా వున్నాయి. ఆగస్టు 15వ తేదీ సంచికమీద వేసిన ఝాన్సీ లక్ష్మీబాయి, ఆ సంచికలో వేసిన స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వనితల గురించిన వ్యాసాలూ – మెచ్చుకోదగ్గవి. దీపావళి ప్రత్యేక సంచిక మాత్రం ఏమీ బాగులేదని చెప్పడానికి చింతిస్తున్నాను. పైగా దాని వెలకూడా ఎక్కువగా పెట్టారు. అందులో అంత పెద్ద విశేషాలు కనిపించలేదు. మొత్తం మీద ఈ సంచిక మాత్రం సంతృప్తి కలిగించలేదు.

—వల్లభజోశ్యుల వైదేహి, విశాఖపట్నం

ఛాయా ఆర్య 'లండన్ విశేషాలు' క్లుప్తంగా వివరించారు. 'పొరపాటు'లాంటి మినీ కథలు ప్రచురిస్తే బావుంటుంది. మీరు ప్రవేశ పెట్టిన 'వార్తల్లో వనిత' శీర్షిక చాలా బావుంటోంది. మేము ఎన్నాళ్ళనుంచో తెలుసుకుందామనుకున్న వనిత 'చియాంగ్ చింగ్' గురించి మాకు తెలిపినందుకు ఎంతో కృతజ్ఞురాలను. ఇకపోతే 'ఐసో మెట్రిక్స్' స్త్రీలకు ఎంతో ఉపయోగకరమైనది. ఆ విధంగానే, చిన్న చిన్న ఆత్మ రక్షణ పద్ధతులు (అంటే "ఒంటరిగా ఒక స్త్రీ ఆపదలో ఉంటే తన్ను తాను రక్షించుకోవాలంటే ఏం చేయాలి?") తెలియబరచండి.

—డి. రాధారాణి, చిలకలూరిపేట

ఎనిమిదవ పేజీలోని 'కార్టూనిస్టు — కాలేజీ అమ్మాయిలూ' వ్యంగ్య కథ రాసిన ఎమ్. బాల సరస్వతి – కుమారి. ఆమె పుట్టిందీ, పెరిగిందీ, చదివిందీ–అంతా మండపేటలోనే.

"సాహితీలోకంలో అ ఆ లు దిద్దటం ప్రారంభించి, అమ్మ శారదమ్మ చెయ్యి పుచ్చుకుని వేసినవి–ఇప్పటికి ఆరు తప్పటడుగులు" అన్నారామె తమ రచనల విషయమై తెలియజేస్తూ. ఆ ఆరూ వివిధ పత్రికల్లోనూ వచ్చినవి.

"ఈ ఆరు అడుగుల అనుబంధాన్ని వూతగా పుచ్చుకుని ఏడవ మెట్టు మీద నించుని సుదూరాన చుక్కలా మెరుస్తూ మారిపోతోన్న గమ్యాన్ని చూస్తూంటే కలం పట్టిన ప్రతి ప్రాణీ ఆ తారని అందుకోడానికి ఎన్నివందల మెట్లు ప్రయాణం చెయ్యాలో, అందుకు ఎంత శ్రమా, శక్తీ, తపస్సూ కావాలో తెలుస్తోంది" అంటారు బాల సరస్వతీదేవి.

సంక్రాంతి

సంక్రాంతి—మనకి పెద్ద పండుగ; విశిష్టమైన పండుగ; మూడు రోజుల పండుగ. మొదటి రోజు భోగి, రెండో రోజు సంక్రాంతి, మూడో రోజున కనుమ—అని పండుగలు జరుపుకుంటాము.

కొన్ని పండుగలు ప్రతి సంవత్సరమూ ఒక్కరోజునే వస్తాయి. సంక్రాంతి మాత్రం అలారాదు. ఎంచేతంటే సూర్యుని సంచారాన్ని బట్టి, ఈ పండుగ ఏర్పడుతుంది. సూర్యుడు ఆరుమాసాలపాటు దక్షిణాయనంలో వుండి, తర్వాత ఉత్తరాయణంలోకి వెళ్తాడు. ఆసందర్భంగా ఈ పండుగ జరుపుకుంటాము.

సంక్రమణం—పెద్ద పండుగ అన్నట్టే పెద్దల పండుగ. ఈ రోజున ఉపవాసాలు వుండి, పితరులకు తిలోదకాలు విడుస్తారు. సంక్రాంతి నెలరోజులుందనగానే పండుగ ప్రారంభమవుతుంది. ఇళ్ళముందు రకరకాల ముగ్గులు వెయ్యడం, గొబ్బి పెట్టడం, ఇళ్ళను అలంకరించడం జరుగుతాయి. సంక్రాంతినాడు తలకు స్నానాలు చేపి, విధిగా కొత్త బట్టలు కట్టుకుంటారు; అన్ని విధాల కూరలనూ కలిపి వండుకుని తినే ఆచారం వున్నది. బ్రాహ్మణులకు కూరగాయలు, ధాన్యం, దక్షిణలూ ఇస్తారు. అలాగే, స్త్రీలు—తక్కిన స్త్రీలకు పసుపు కుంకుమలూ, పువ్వులూ ఇస్తారు.

సూర్యుడు ఒక్కొక్క మాసం ఒక్కో రాశిలో వుంటాడు—సంక్రాంతినాడు మకర రాశిలో వుంటాడు గనక, దీన్ని 'మకర సంక్రాంతి' అంటాము. కర్కాటకం నుంచి, మకరసంక్రాంతి వరకు సూర్యుడు దక్షిణాభిముఖంగా ప్రయాణిస్తాడుగనక, ఈ కాలాన్ని దక్షిణాయనమనీ; తర్వాత మకరసంక్రాంతి నుంచి, కర్కాటక సంక్రాంతి వరకూ ఉత్తరంవేపు వెళ్తాడుగనక, దాన్ని ఉత్తరాయణం అనీ అంటారు.

ఉత్తరాయణం దేవతలకు ముఖ్యమైనదనీ, దక్షిణాయనం పితృదేవతలకు ముఖ్యమనీ—పెద్దలు చెబుతారు. అంచేత ఉత్తరాయణం మంచి కాలమనీ, దక్షిణాయనం కీడు కాలం అనీ మనం నమ్ముతాము. దక్షిణాయనకాలంలో మరణిస్తే ఉత్తమ గతులు ఉండవన్న నమ్మకం కూడా వున్నది. అందుకనే కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముడు దక్షిణాయనంలో పడిపోయినా, ఉత్తమగతికోసమే ఉత్తరాయణకాలం వరకూ ప్రాణాలు నిలుపుకున్నాడన్న కథ—అందరికీ తెలిపిన కథే.

వనిత అభిమానులందరికీ
వనిత
సంక్రాంతి శుభాకాంక్షలు

ఆభరణాలు

1

నగలు రాతికి పెట్టినా అందం వస్తుందట! మరి నాతి సంగతి చెప్పాలా? అందుకే పురాతన లక్షణకారులు-వనిత ఎంత సంపన్నురాలు అయినా, ఎంతటి సులక్షణ అయినా భూషణాలు లేకపోతే భాసించదు - అన్నారు. దానికి తోడు సహజంగా స్త్రీలో ఒక మౌలిక ప్రవృత్తి ఉంది-అందంగా కనిపించాలన్న తాపత్రయం. అందుకని మొదట మొదట పుష్పాలూ-ఆకులూ ఆభరణాలుగా ధరించ మొదలిడిన స్త్రీ, క్రమంగా నాగరికత పెరగడంతో శారీరిక శోభను పెంపొందించుకోవడానికి లోహపు ఆభరణాలను ఉపయోగించడం మొదలు పెట్టింది.

ఈ ఆభరణాల బేతాళానికి బంగారమే అనాదిగా ప్రియమైన లోహం. దాని యీ ప్రాచుర్యానికి కారణం తక్కిన లోహాల్లో లేని మనోహరమైన మిసిమి. స్వర్ణం లోహరాజము. లోహాలకే చక్రవర్తి అయిన ఆ పసిడితో చేయబడ్డ ఆభరణాలు ధరిస్తే, తమ సౌందర్యం ఇంకా ఎంతో పెరిగిపోతుందనే భావనతో కాబోలు, సుందరీమణులు బంగారు నగలకై పరితపిస్తుంటారు. అంతేగాక బంగారానికి విలువ కూడా తక్కువ కాదుగా! మనిషిని చూసి కాకపోయినా, ఒంటినున్న బంగారాన్ని చూసి విలువ యిచ్చే వాళ్ళ సంఖ్యే సమాజంలో ఎక్కువ.

ఇన్ని కారణాలచేత స్త్రీలు ఆభరణాలు కోరుకుంటారు. ముఖ్యమైన కారణాన్ని సౌందర్యంతోనే ముడిపెట్టవచ్చు. అందం కావాలి - అందుకు ఆభరణం కావాలి.

ఆ ఆభరణం ఏ లోహానిదైతేనేం? అందం రాదా?

వచ్చేస్తుంది. కానీ, ఆ అందానికి వెల తక్కువగా ఉంటుందేమో! మరి, పసిడికున్న మిసిమి ఇత్తడికీ, రాగికీ ఏదీ? అదీకాక, ఆభరణాలు లేని అందాన్ని కూడా కల్గించేవిగా ఉండాలిగా! అలాగైతే మరి, ఆ ఆభరణం ఏదైనా—బంగారు లేదా వెండితోనే చేసి ఉండాలి!

బంగారు నగల కాంతి చాలాకాలం ఉంటుంది.

అది మన్నికైన లోహం. చాలా గట్టిది.

అరుగుదల కూడా తక్కువే.

ఈ గుణాలన్నీ ఏ యితర లోహాల్లో ఉన్నాయి? వెండి కొంతవరకూ కాంతిగల లోహమే. కానీ, అది మన్నికైంది కాదు. అరుగుదల చాలా ఎక్కువ. అంతేకాక, తెలుపురంగుది కాబట్టి తొందరగా మాసిపోతుంది. బంగారం? అందుకనే, ఆభరణాలు చేయిస్తే లోహరాజన్య చక్రవర్తి బంగారంతోనే చేయించాలి.

పి. కేశవరత్నమ్మ, గుండుగల్లు

2

స్త్రీలు ఆకర్షణీయంగా ఉండడానికి అలంకారాలు తోడ్పడుతాయి-ఆభరణాలు తోడ్పడుతాయి. ఆభరణాలు అలంకారాల్లోకే వస్తాయి. పూర్వకాలంలో స్త్రీలు గాజుతో చేసిన పూసలు ఇత్యాదులు ఆభరణాలుగా ధరించేవారు. బంగారం వాడుకలోకి వచ్చిన తరువాత, ఆభరణాలు బంగారంతో చేయించుకోవడం మొదలయి యీ నాటివరకూ కొనసాగుతోంది. దానికి కారణం బంగారం విలువైన లోహమనడం మొదటిది.

మిగిలిన కారణాల్లో, మన సమాజంలో స్త్రీల స్థానం—తరతరాలుగా పాతుకొనిపోయిన ఆచారాలు, స్త్రీల ఆర్థిక అస్వాతంత్ర్యం, విద్య నేర్చుకొనే అర్హత లేకపోవడం అనేవి పరోక్షంగా స్త్రీలకు బంగారపు ఆభరణాల మీద మోజును ఎక్కువ చేశాయి. ఆరోగ్యరీత్యా శరీరం మీద ధరించడానికి బంగారం శ్రేష్ఠమని భావించడం కూడా ఒక కారణమే.

మన సమాజంలో స్త్రీని మాతృదేవత, అర్ధాంగిగా గుర్తించి గౌరవించారు. కాని స్వాతంత్ర్య విషయంలో స్త్రీకి అర్హతలేదని కొట్టి పారవేశారు. వివాహ సమయంలో స్త్రీలకు పసుపు కుంకుమ నిమిత్తం యిచ్చిన ఆస్తులు, ఆభరణాలు తప్ప, స్త్రీలు తమ తండ్రుల ఆస్తుల పంపకంలో సహోదరులతో వాటా పొందడానికి యీ మధ్యవరకు అర్హతలేదు. వివాహ సమయంలో పెట్టిన ఆభరణాలనే "బాల తొడుగు" అంటారు. బహుశా వార్ధక్యంలో స్త్రీల సాంఘిక భద్రతను గుర్తించి అయి ఉండవచ్చు. ఈపసుపు కుంకుమల నిమిత్తం యిచ్చిన ఆస్తులు, ఆభరణాల మీద హక్కు మాత్రం స్త్రీలకే వదలి వేశారు. ఇక చదువు విషయాలలోనూ అంత మాత్రంగానే ఉండేది. "బట్టల పద్దు" రాసే చదువు స్త్రీలకు చాలని మన పెద్దల అభిప్రాయం.

ఇటువంటి ఛాందస వాతావరణంలో పెరిగి విద్యాసంపదకు నోచుకోని స్త్రీలు బంగారపు ఆభరణాలు తమ ఆస్తులుగా, వార్ధక్యంలో తమ పాలిటి పెన్నిధిగా భావించి వాటిపై మోజు పెంచుకొన్నారంటే ఆశ్చర్యపడ నవసరం లేదు.

కాని పరిస్థితులు మారాయి. ప్రజలలో చైతన్యం వచ్చింది. ఛాందసమైన ఆచారాలు చాలవరకు అడుగంటాయి. చాలావరకు స్త్రీలు మగవారితో సమానంగా విద్య నేర్చుకొంటున్నారు. బాధ్యతగల ఉద్యోగాలు నిర్వహిస్తూ, ఆర్థిక స్వాతంత్ర్యం కూడా పొంది ఉన్నారు. భవిష్యత్తు గురించి జాగ్రత్త తీసుకొనేటందుకు ఉద్యోగంలో ఉన్న వాళ్ళకయితే ప్రావిడెంటుఫండులు - ఇతరులకు బ్యాంకులు, ఇన్స్యూరెన్సు పాలసీలు ఉన్నాయి. పూర్వం వలె భవిష్యత్తుకొరకు బంగారం రూపంలోనే సొమ్ము నిలవ చేయనవసరం లేదు. దేశరక్షణ విషయంలో అవసరమయితే తమ ఆభరణాల నిచ్చి స్త్రీలు ముందడుగు వేయవలసిన సమయమిది.

పప్పు సత్యవాణి, బొంబాయి-61

3

ఆ నాడు సత్యభామ ఏడు వారాల నగలు ధరించేదట. నేటి భామ ఒక్క వారం నగలు కూడా ధరించలేని స్థితికి వచ్చింది. ఆ ఆశ మాత్రం ప్రతి స్త్రీలోను మాసిపోలేదు. నిజమే, బంగారు ఆభరణాలు స్త్రీకి వుండటం

బంగారంతోనే

పాఠకుల శీర్షిక

చేయించుకోవలసిన అవసరం వున్నదా?

అవసరం. నేటి నాగరికతను అనుసరించుతూ రకరకాల ఆభరణాలు చేయించుకోవడం ఫాషనుగా మారింది.

స్త్రీకి అత్యున్నతమైన, మిక్కిలి ప్రధానమైన ఆభరణమైన మంగళ సూత్రం కూడా బంగారుతోనే చేయించడం మొదలు పెట్టారు మన పూర్వీకులు. ఏ యితర లోహాలను ఎన్నుకోలేదు. కారణం బంగారం పచ్చగా, కళకళ లాడుతూ వుండటమే కాక తక్కిన వాటికన్నా విలువైనది. ఆ వధువు సంసార జీవితం కూడా పచ్చగా కళకళలాడుతూ సంఘంలో విలువైనదిగా వుండాలని వారి ఆశయం. బంగారు ఆభరణాలు ధరించిన ప్రతి స్త్రీ కళగా, అందంగా కనబడుతుంది. కేవలం నగలు అందానికే కాదు, అత్యవసరానికి కూడా ఆదుకుంటాయి. వాస్తవాన్ని పరిశీలిస్తే నా విషయంలోనే – మేము కొత్తగా కట్టించుకొంటున్న ఇంటి పనికి డబ్బు అవసరం కల్గింది. ఇక ఎక్కడైనా అప్పు తీసుకుని రావలసిన పరిస్థితి ఏర్పడింది. కాని మా అమ్మగారివి, నావి–నగలు బ్యాంకులో పెట్టి తద్వారా వచ్చిన డబ్బుతో ఆ లోటు పూర్తి చేయగలిగాము. నిదానంగా ఆ నగలు విడిపించుకొన్నా మనుకోండి. కాని ఒకరి దగ్గర చేయిచాపనవసరం లేకుండా ఎంత హుందాగా ఎంత గొప్పగా సహకరించాయో ఈ నగలు చూచారా! అందుకే పుట్టింటి వారు వరకట్నం కన్నా, ఆభరణాలు చేయించడానికి ఇష్టపడతారు. కారణం డబ్బైతే త్వరగా ఖర్చు పెట్టుకుంటారని, నగలైతే గుప్త ధనంలా ఇమిడి వుంటాయని. ఇక విధి వక్రించి ఆ యిల్లాలి కుటుంబ పరిస్థితి బజారుపాలు కావలసిన స్థితిలో ఆ ఆభరణాలు ఎంతో సహాయపడి వారికి జీవితంపై ఆశ రేకెత్తిస్తాయని వారి ముఖ్యోద్దేశం. కేవలం స్వార్థానికేకాదు దేశ సౌభాగ్యం కాపాడేందుకు కూడా అత్యవసర పరిస్థితులలో ఆ ఆభరణాలు ఎలా సహకరించింది మనకు తెలిసిన విషయమే. కనుక ఆభరణాలు బంగారుతో చేయించుకోవడంలో ఎన్ని మేళ్ళు వున్నాయో వేరేగా చెప్పనవసరం లేదు.

బలపనూరు శమంతకమణి, ఉదయగిరి

4

సామాన్య వనితలు ఈనాడు కలలో కూడా తలచకూడని వస్తువుగా పరిగణింపబడుతోంది బంగారం. 'ఇంతింతై, వటుడింతయై' అన్నట్లు శుక్లపక్ష చంద్రునిలాగా దినదిన ప్రవర్ధమాన మవటమే కాని, దాని ధర తగ్గు ముఖం పట్టే ఛాయలే కన్పించడం లేదు. అయినా అందని పండులా ఆకాశంలో ఉండి అందరినీ ఊరిస్తుంది ఈ బంగారం. ఈనాటి వెలనుబట్టి బంగారంతో ఆభరణాలు చేయించుకోవటం అందరికీ అసాధ్యమేమో అని అనిపించినా, అవసరం మాటకొస్తే సాధ్యమైనంత వరకే, శక్తికొలది బంగారంతోనే చేయించుకోవాలని నా అభిప్రాయం. ఈ కాలంలో అనేక రకాలైన గిల్టు నగలు చూస్తున్నాం. కాని వాటి ఉపయోగం మాత్రం స్వల్ప కాలమే. తడి తగలగానే పాడయిపోయేవి కొన్నైతే, చేయి తగలగానే మెరుగుపోయేవి కొన్ని. క్రొత్తల్లో అవి అందంగా, అసలైన బంగారం లాగా కనిపించినా, వాడే కొద్దీ వాటి అసలు రంగు బయటపడుతుంది. ఇటువంటి తాత్కాలికమైన వస్తువుల కొరకు ధనాన్ని వ్యయపరిచే బదులు, ధర అధికమైనా, ఒక బంగారు వస్తువు చేయించుకుంటే, క్రొత్తదైనా, పాతదైనా దాని విలువ శాశ్వతంగా ఉండిపోతుంది. శరీర తత్వాలను బట్టి ఈ గిల్టు నగలు కొందరికి పడక, అనేక రకాలైన ఇబ్బందులకు, రోగాలకు దారి తీసే అవకాశం కూడా ఉన్నది. అదే బంగారమైతే, ఆరోగ్యరీత్యా మేలు చేస్తుందని, పెట్టుకున్న నగల మీద పడ్డ నీళ్ళు శరీరం మీద పడితే, ఎంతో మంచిదని పెద్దలన్నమాట.

ఒకవేళ పరిస్థితుల ప్రభావం వలన ఒక కుటుంబం చితికిపోతే, బంగారం వస్తు రూపంలో ఇంట్లో ఉంటే ఆర్థికంగా ఆదుకునే వీలు కూడా ఉన్నది. ఎవరికైనా తాకట్టు పెట్టడానికి బంగారు వస్తువులనైతే ఒప్పుకుంటారు కాని నకిలీ బంగారాన్ని తీసుకోరు. 'ఎప్పుడో అవసరమొస్తుందని అంత ధరపెట్టి కొనాలా'? అన్న సందేహం రావచ్చు. 'కీడెంచి మేలెంచ' మన్నారు కనుక ఆపదలో ఆదుకుంటుంది కాబట్టి పరిస్థితులు అనుకూలించినప్పుడే బంగారాన్ని ఆభరణ రూపంలో ఇంట్లో ఉంచుకుంటే నష్టం ఉండదు.

ఆడపిల్ల వివాహ సందర్భంలో ఎవరైనా అడిగే మొట్ట మొదటి ప్రశ్న: 'అమ్మాయికి ఏం నగలు పెట్టారు?' అని. ఆ సమయంలో ఏవో రోల్డ్ గోల్డ్‌వి పెట్టామని చెప్పుకుంటే ఎంత హాస్యాస్పదంగా ఉంటుంది? అందుకనే ప్రతి ఒక్కరు పేద, గొప్ప తేడాలు లేక తమ శక్తికొలది కుమార్తెలకు బంగారు నగలు పెట్టడానికే ప్రయత్నిస్తారు. ఒక్కసారి మొత్తం ధనాన్ని కట్టి, బంగారు ఆభరణాలు కొననక్కర లేకుండా ఇప్పుడు 'ఇన్‌స్టాల్‌మెంట్'ల మీద కూడా నగలు కొనుక్కోవచ్చు. ఇటువంటి సదవకాశాన్ని మధ్య తరగతి కుటుంబీకులు వినియోగించుకుంటే సువర్ణం అందని పండూ కాదు; ఆకాశంలోని జాబిల్లి కాదు.

డబ్బు చేతిలో ఉన్నప్పుడు చిల్లరమల్లరగా ఖర్చుచేస్తే, దాని గుర్తింపు ఉండదు. ఆ డబ్బుతోనే ఒక బంగారు ఆభరణం చేయించుకుంటే, ధనమే వస్తు రూపంలో మనదగ్గరే ఉన్నదన్న తృప్తి కూడా ఉంటుంది.

ఆర్. రాజ్యలక్ష్మి, మద్రాసు

[వచ్చే సంచికలో మరికొన్ని వ్యాసాలు]



యమ్. బాలసరస్వతీదేవి

రాంబాబు తన నూరో కార్టూను పత్రికలో పడ్డ శుభ సమయాన్ని పురస్కరించుకుని హోటల్లో కూచుని ఉల్లిపాయ పకోడీలు తింటున్నాడు.

రెండు ప్లేట్లు తిని, మూడోరౌండు మిరపకాయ బజ్జీ మొదలు పెట్టబోతుంటే — "నమస్కారమండీ!" అన్న కోకిల కంఠం వినిపించింది.

నోట్లో పెట్టబోతున్న బజ్జీ చెయ్యి అలాగే వుంచి రాంబాబు తలెత్తి చూసేడు.

దాదాపు రెండడుగుల దూరంలో సన్నగా తీగలావున్న ఓ యువతి, గాలికి రేగి నుదుటిమీద పడుతోన్న వుంగరాల జుత్తును ఎడం చేత్తో వెనక్కి తోసుకుంటూ, బుగ్గలు సొట్టపడేలా నవ్వుతూ టేబుల్ అంచుకు కొంచెం దూరంలో నిలబడి తనకేసి చూస్తోంది.

రాంబాబు అనుమానంతో .... జేబులోనించి కళ్ళద్దాలు తీసి పెట్టుకుని చూసేడు.

అమ్మాయే!

"అమ్మబాబోయ్!" అనుకున్నాడు రాంబాబు.

అమాంతం బజ్జీ ప్లేట్లో పారేసి, లేచి నించుని అపర శివుడి పోజులో—"బాలా! ఏమి నీకోరిక?" అని అడగాలన్నంత ఉషారు పుట్టుకొచ్చింది. కాని, అసలే అమాయకంగా....నోట్లో చాక్లెట్ పెడితే తినలేని దానిలా వున్న యీ అమ్మడు, పాపం—సూదిముక్కు కూడా వుంది—జడుసుకుంటుందేమో అని జాలేసి, బజ్జీ చెయ్యి ముందుకు చాపి—"కూచోండీ" అంటూ మర్యాద చేసేడు.

కూచుని, తెల్లపవిట భుజాలచుట్టూ తిప్పుకుని—"నాపేరు సత్యభామ. మీ కార్టూన్లంటే చెవి కోసుకుంటాను" అంది చిన్నగా నవ్వుతూ.

రాంబాబు నవ్వేడు. "అబద్ధాలు. మీ చెవులు బాగానే వున్నాయి."

"మళ్ళీ అతికించేసుకుంటానుగా" అని నవ్వి—"మిమ్మల్ని చూడాలని ఎన్నాళ్ళుగానో కోరిక. మీ కార్టూన్లన్నీ బైండు చేయించుకుని దాచుకున్నాను కూడా. మీది యీ వూరే అన్న సంగతి ఇంతవరకు నాకు తెలీదు."

"నా కార్టూన్లు బైండు చేయించుకుని దాచుకునే అందమైన పాఠకురాలు యీ వూళ్ళోనే వున్నది అన్న సంగతి ఇంతవరకు నాకూ తెలీదు...."

సత్యభామ నవ్వేసింది.

రాంబాబు "బజ్జీ తింటారా?" అని సత్యభామని అడగబోయి, చేతిలోవున్న ఒక్క బజ్జీ తను సగం తిన్నది అన్న సంగతి జ్ఞాపకం వచ్చి—ఎంగిలి తింటుందో, తినదో...అన్న అనుమానంతో మిగిలిన బజ్జీ ముక్క కొంచెమూ తినేసి, మంచి నీళ్ళు తాగి ఎడం చేత్తో క్రాపు సవరించుకుంటూ టేబుల్ మీదకు వంగి—

"ఇఫ్ అయాం నాట్ మిస్టేకెన్ మీరు స్టూడెంట్ కదూ?"

"బాబోయ్! ఎలా కనిపెట్టేసేరు?" అంది సత్యభామ ఆశ్చర్యంగా.

"అది రహస్యం!" అని నవ్వి—"ఏం చదువుతున్నారు?" అని అడిగాడు.

"బి. ఎ. ఫైనల్."

"ఏ కాలేజి?"

చెప్పింది.

"ఉమెన్స్ కాలేజి అన్నమాట!" అంటూ ఉత్సాహంగా ముందుకు వంగి—"మీ అమ్మాయిలు నన్ను తిట్టుకుంటారటగా?" అన్నాడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

సత్యభామ ముఖం ఎర్రబడింది. "ఎవరు చెప్పేరు మీకు అమ్మాయిలు మిమ్మల్ని తిట్టుకుంటారని?" అంది కోపంగా.

"తిట్టుకోరా అయితే?" అన్నాడు రాంబాబు దిగులుగా.

"ఉహూ. అయినా, నేను అభిమానించే వ్యక్తిని తిట్టుకునే వాళ్ళ స్నేహం నేను చస్తే చెయ్యను. ఐ హేట్ దట్—"

"మంచినీళ్ళు తాగండి" అంటూ రాంబాబు గ్లాసుతో నీళ్ళు అందించేడు. సత్యభామ సిగ్గుపడి గ్లాసు పుచ్చుకుని ప్రక్కన పెట్టేసింది.

"నా కోపం చూస్తే మీకు నవ్వొస్తోందికదూ?" అంది వుడుక్కుంటూ.

"ఉహూ. ప్రేమొస్తోంది" అందామనుకున్నాడు. హుం! ఈ మల్లెమొగ్గకి యీ మాత్రం రొమాన్సు కూడా తెలుస్తుందా?



"బాధపడుతున్నారా....? టేకిట్ ఈజీ రాం బాబుగారూ!"

"అబ్బే...." అన్నాడు రాంబాబు అమాయకంగా.

సత్యభామ నవ్వింది. రాంబాబు కూడా నవ్వి-"మీలాటి అభిమాని దొరకటం నా అదృష్టం. మీ పరిచయం కలిగిన యీ శుభ సమయంలో మంచి బాదంఖీర్ తాగుదాం ఉండండి!" అంటూ బెల్ కొట్టి, సత్యభామ వారిస్తున్నా వినకుండా రెండు బాదంఖీర్ తెప్పించి "ప్లీజ్. నా కోసం" అంటూ ఓ గ్లాసు ఆమె కేసి జరిపాడు.

"బాదంఖీర్ అన్నా, బాతాఖానీ అన్నా నాకు యిష్టం. మీకో?"

"నాకు మా బామ్మ అంటే ఇష్టం. బాదంఖీర్ చెయ్యడంలో, బాతాఖానీలో ఆవిడ ఫస్టు!"

సత్యభామ నవ్వేసింది. ఇద్దరూ బాదంఖీర్ దగ్గిరికి తీస్కుని 'తినటం' మొదలు పెట్టేరు. సత్యభామ జీడిపప్పు ముక్కలు తింటూ మెల్లగా అతని కార్టూన్లంటే తనకు ఎంత అభిమానమో, అతని తరఫున తను అమ్మాయి లందరితోనూ ఎలా పోట్లాడుతుందో, తన ప్రాణస్నేహితురాలు ఒకామె ఓసారి అతను గీసిన అప్పడాల కర్ర కార్టూను చూసి తిట్టిందని తను ఆమె స్నేహానికి శాశ్వతంగా ఎలా 'గుడ్‌బై' చెప్పిందో చెబుతోంది.

"ఎవరా ఫ్రెండు?" అన్నాడు కుతూహలంగా ముందుకు వంగి.

"వెంకట తాయారని రెండొందల పౌన్లుంటుంది. రెండుజెళ్ళు వేస్తుంది. ముందు పళ్ళు కొంచెం ఎత్తు."

రాంబాబు గబగబా గ్లాసెడు నీళ్ళు తాగి-"మీ చీర బావుంది!" అన్నాడు గబుక్కున.

"చీరా?"

"చీర!"

సత్యభామ నవ్వి-"బాంబేనించి మా భయ్యా పంపేడు. ఈ పింక్ కలర్ అంటే నాకు ఎంతో యిష్టం"

"నాక్కూడా పింక్ కలర్ అంటే యిష్టం."

"ఓ షర్టు కుట్టించుకోండి. పింక్ మీకు బావుంటుంది!"

"ఓ. కె!" అన్నాడు రాంబాబు, సత్యభామ వెంకటతాయారు గురించి మర్చిపోయినందుకు హాయిగా వూపిరి పీల్చుకుంటూ.



"నేను మిమ్మల్ని ఒకటి అడుగుతాను. దానికి కూడా మీరు ఓ. కే. అనాలి మరి...."

"ఓ. కె. అనాలంటున్నారుగా. అడిగేసేయండి మరి" అన్నాడు నవ్వుతూ. ఏ మడుగుతుందబ్బా? అప్పు కావాలంటుందా? ఆ మధ్య చదివిన కథలో ఇలాగే సూదిముక్కు వున్న ఓ అమ్మడు ఓ అబ్బాయితో మాటలు వేసుకుని కాసిని కబుర్లూ గట్రా చెప్పి నవ్వించి-ఆనక-"ఓ పాతిక అప్పివ్వరూ, ప్లీజ్...."అంటుంది. ఆడపిల్ల అలా 'ప్లీజ్' అంటే అప్పివ్వని మగాడు ఎప్పుడు పుట్టేడు?

"మేమంతా రూఫ్‌లో చిన్న పార్టీ చేసుకుంటున్నాం మీరు గెస్టుగా, సర్దాగా రావాలి...."

"అమ్మాయిలేనా?" అన్నాడు రాంబాబు ఆత్రంగా.

"పదిమందీ అమ్మాయిలే!" అంది.

రాంబాబు పన్నెండు సెకండ్లలో బాదంఖీర్ తాగేసి, ఎడంచేత్తో క్రాపు సర్దుకుంటూ లేచి నిలబడి-"పదండి" అంటూ బయలుదేరేడు.

సత్యభామ టేబుల్ మీద పెట్టిన బేగ్ తీసుకుంది.

"ఒన్ మినిట్!" అంటూ రాంబాబు టాయిలెట్ రూం లోకి పరుగెత్తి తలుపు మూసుకున్నాడు. జేబులోనుంచి దువ్వెన తీసి జుట్టు ఒంకులొంకులుగా దువ్వుకున్నాడు. మినీ పౌడరు డబ్బాలోనించి పౌడరు ఒంపుకుని ముఖానికి రాసుకుని అద్దంలో ముఖం చూసుకున్నాడు. "ఇడియట్. ఇవాళ లేచి ఎవరి ముఖం చూసేనో అమ్మాయిల మధ్య అక్కినేనిలా వెలిగిపోయే యోగం పడుతోంది" అని బుగ్గమీద చిటికేసుకుని, దువ్వెనా, పౌడరు పెట్టే జేబులో పెట్టేసుకుని ఇవతలికి వచ్చి.... "పదండి!" అన్నాడు నవ్వుతూ.

సత్యభామ నవ్వి—"మెడ దగ్గిర పౌడరు కొంచెం ఎక్కువయింది. తుడుచుకోండి" అంటూ పర్సులోనించి రుమాలు తీసి అందించింది.

రాంబాబు పౌడరు తుడుచుకుని, రుమాలు తిరిగి ఇచ్చేసేడు. సత్యభామ పర్సులో పెట్టుకుంది.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ మెల్లగా మెట్లెక్కడం ప్రారంభించేరు.



"మావాళ్ళు కొంచెం కోతులు. ఏవన్నా అల్లరి చేస్తే ఏవీ అనుకోవద్దు ప్లీజ్" అంది.

"నేను కార్టూనిస్టునని మర్చిపోకండి. అల్లరి మా వూపిరి!"

"సారీ!" అని నవ్వేసింది సత్యభామ. ఇద్దరూ మెట్లెక్కి పైకి చేరుకున్నారు. ఏదో మంత్రశక్తితో అమ్మాయిలుగా మారిపోయిన రంగుల పూలగుత్తుల్లా వున్న పదిమంది అమ్మాయిలు రకరకాల దుస్తుల్లో హుషారుగా అటూ ఇటూ తిరుగుతూ కేరింతలు కొడుతున్నారు. పిట్ట గోడ మీద యువరాణి పోజులో కూచున్న ఓ ఎర్ర చీర యువతి ఇద్దర్నీ చూసి పాట ఆపేసి– "సర్వర్ని తీసుకొస్తానని అప్పుడనగాపోయి ఇప్పుడా రావటం దుర్మార్గురాలా!" అంటూ కోప్పడింది.

"ఈయన రాంబాబుగారు. ఎమ్మే" అంది సత్యభామ ముఖం ఎర్రగా చేసుకుంటూ.

"సారీ!" అంది ఎర్ర చీర యువతి నాలిక్కొరుచుకుని. అమ్మాయిలంతా వెనక్కి తిరిగి చూచి – "హాయ్" అంటూ పరిగెట్టుకుంటూ– ఇద్దర్నీ చుట్టు ముట్టేరు.

"హాయ్...." అన్నాడు రాంబాబు పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుని, చిరునవ్వు నవ్వుతూ! కళ్ళజోడు కమల రాంబాబు పక్కన చేరింది.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది. ఎక్కడ?" అంటూ కళ్ళజోడు మీద చూపుడు వేలుతో సుతారంగా కొట్టుకోవటం మొదలు పెట్టింది.

"ఫొటో చూసుంటారు" అన్నాడు రాంబాబు గొప్పగా.

"అదే అయుంటుంది. ఇంట్లోనించి ఎందుకు పారిపోయేరు పాపం?" అంది జాలిగా.

"ఆయనేం ఇంట్లోనించి పారిపోలేదు. ఇంట్లోనే కూచుని, ఒక్కోసారి వీధిలో కూడా కూచుని కార్టూన్లు గీస్తారు. కదండీ?"

"కొంపతీసి, యీయన మన రాంబాబుగారు కాదుకదా?"

"ఆయనే!" అంది సత్యభామ గర్వంగా.

అమ్మాయిలంతా ఆనందంతో కెవ్వున కేక వేసేరు. ఇంతసేపూ చెప్పనందుకు సత్యభామని గిల్లేసి–పరుగెత్తుకెళ్ళి ఓ కుర్చీ పట్టుకొచ్చి మధ్యలో వేసి రాంబాబుని కూచోబెట్టేరు. తామంతా గోపికల పోజులో చుట్టూ కూచున్నారు.

ఈ మధ్య ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ వారు బాలల దినోత్సవ సందర్భంగా గుంటూరు జిల్లాలో నిర్వహించిన కూచిపూడి (జూనియర్స్) నాట్యం పోటీలలో-జొన్నలగడ్డ అనూరాధ ప్రథమ స్థానంలో వచ్చింది. ఎనిమిది సంవత్సరాల ఈ అమ్మాయి గుంటూర్లోని సెయింట్ జోసఫ్ గర్ల్స్ హైస్కూలులో నాలుగవ తరగతి చదువుతున్నది. హైద్రాబాదులో మొదట్లో వేదాంతం జగన్నాధశర్మగారి దగ్గర నాట్యం నేర్చుకుని, ఇప్పుడు సుబ్బలక్ష్మి ముకుంద బాబు దగ్గర గుంటూర్లోనే-నాట్యం అభ్యసిస్తున్నది.

"ఇన్నాళ్ళూ మీ కార్టూన్లు చూసేం. ఇవాళ మిమ్మల్ని చూడగలుగుతున్నాం. ఈ రోజు ఎంత మంచి రోజు" అంది ఎర్ర చీర అమ్మాయి అరమోడ్పు కళ్ళతో. ఎర్ర చీర అమ్మాయి పేరు కోకిల.

"ఈ రోజు సత్యభామ పుట్టినరోజు" అంది శుభలేఖ.

"అవునండీ. ఇవాళ నా బర్త్ డే" అంది సత్యభామ.

"అన్యాయం. ఇంతవరకూ చెప్పకండా దాచుకున్నారు కదూ?" అని సత్యభామకి 'హేపీ బర్త్ డే' చెప్పి – "బైదిబై, మీకు భర్త వున్నాడా?"

"హాయ్....హాయ్...." అంటూ నవ్వేసేరంతా.

"మీ కార్టూన్లంత తియ్యగా వుంటాయండీ మీ కబుర్లు కూడా...."

"ఐతే ఇకనించి కాఫీలో నేను పంచదార వేసుకో నక్కర్లేదన్నమాట. కార్టూన్లు వేసుకుంటే సరిపోతుంది."

"ట్రైచేసి చూద్దామా?" అంది మీరా.

"కాఫీలు ఇంకా రాలేదు. అందాకా కబుర్లు చెప్పండి. ఆనక ట్రైచేద్దాం" అంది కళ్ళజోడు కమల.

"కబుర్లు–కమల లోచనలవంతు" అన్నాడు రాంబాబు.

కమల, సులోచనాలను సవరించుకుని కబుర్లు చెప్పడానికి ట్రైచేసి, "లాభం లేదు. కళ్ళజోళ్ళతో కబుర్లు చెప్పలేం. కంఠంతో చెప్పగలం" అని తేల్చేసింది.

"కళ్ళతో కూడా!" అని కలిపింది దేవి.

సర్వర్లు ట్రేలతో పదిరకాల స్వీట్లూ, ఐదారు రకాల హాట్లూ మోసుకొచ్చేరు. అమ్మాయిలంతా నడుం చుట్టూ కొంగు బిగించుకుని ఒకళ్ళ ప్లేట్లలో ఒకళ్ళు అన్నీ సర్దేసి–అంతా కలిసి రాంబాబు ప్లేటులో తలోరకం వేసేసేరు.

"అమ్మ బాబోయ్! ఏవిటిదంతా?" అన్నాడు గాభరాగా.

"అమ్మాయిలు పెట్టినవి పారేస్తే పాపమండీ. ఎలాగో తినేసేయాలి."

"నిజంగా పాపమే నంటారా?" అన్నాడు రాంబాబు దిగులుగా.

"ఘోర పాపం. వచ్చే జన్మలో ఇక ఏ అమ్మాయి చేత్తోనూ ఏవీ తినే అదృష్టం వుండదు. తర్వాత మీ ఇష్టం."

"ఎలాగో తినేస్తాను లెండి" అంటూ రాంబాబు చొక్కాచేతులు పైకి లాక్కుని ప్లేటు దగ్గిరికి లాక్కున్నాడు. అమ్మాయిలంతా కబుర్లు చెప్పుకుంటూ, జోకు లేసుకుంటూ తినటం మొదలుపెట్టేరు.

"పేరులోనే వున్నది పెన్నిధి. అని రాసిం దెవరు?" అంది వకుళ హఠాత్తుగా.

"నేను కాదు!" అంది దేవి గబుక్కున. పాత జోకు అయినా అంతా నవ్వేరు.

"పేరు రీత్యా చూస్తే రాంబాబుగారు అమ్మాయిల గాలి తగలగానే కిలో దూరం పరుగెత్తాలి. కాని, పరుగెత్తటం లేదుగా."

"ఆయన పరుగెత్తుకుంటూనే పైకి వచ్చేరు అమ్మాయిల పేరు వినగానే. కదండీ?" అంది సత్యభామ. నోట్లో 'బాసుందీ' వుండటంవలన రాంబాబు 'అవునన్నట్లు' తల కదిపి సైగ చేసేడు.

"అయితే శ్రీరామచంద్రుడి పేరు మీకు పనికిరాదు. మార్చేయాల్సిందే. ఎలా మార్చేయమంటారు?" అంది శుభ లేఖ.

రాంబాబు బాసుందీ తినేసి "మీ ఇష్టం. నన్ను మార్చేస్తానన్నా నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు బుద్ధిమంతుళ్ళా.

"మార్చేయడానికి మీరేవ(న్నా కరెన్సీనా? కంచర సామానా? ఉత్త కార్టూనిష్టు. ఏం లాభం వుండదు" అంటూ మీరా దిగాలు పడిపోయింది.

"కార్టూనిష్టులకి మార్కెట్లో గిరాకీ వుండదా పాపం?" అంది జిమ్మీ జాలిగా.

"గీర వుందని నిరూపించేసుకుంటారుగా అమ్మాయిల మీద కార్టూన్లు గీసి. అంచేత ఆడ పిల్లలకి కోపం. ఏ అమ్మాయయినా 'అయ్యో పాపం!' అని పెళ్ళి చేసుకోవాలి!"

"అయ్యో పాపం!" అంది హేమా. అమ్మాయిలంతా కలిసి పట్టుకునేలోగా క్రిందికి పారిపోయింది.

"కార్టూనిష్టులంటే మీకు లోకువగా వున్న ట్టుంది. రోజూ నాకు అమ్మాయిల దగ్గిర్నించి ఎన్ని వుత్తరాలు వస్తాయో తెలుసా?" అన్నాడు రాంబాబు.

"తెలీదండీ" అన్నారు అమాయకంగా. "ప్లీజ్. మాకు చూపించరూ?" అంటూ గోల చేసేరు.

"మీరిలా రాంబాబుగార్ని గోలచేస్తే ఇక్క ణ్ణించి వెళ్ళిపోతాం అంతే" అంది సత్యభామ కోపంగా, చేతిలో స్పూను టక్కున ప్లేట్లో పారేసి.

"గోల చెయ్యం. వెళ్ళిపోవద్దు ప్లీజ్" అంటూ బ్రతిమాలేరంతా.

"ఐతే, రాంబాబుగారికి 'సారీ' చెప్పండి."

"'సారీ' అండీ" అంటూ అంతా కోరస్‌గా రాంబాబుకి 'సారీ' చెప్పేరు.

"నెవర్‌మైండ్!" అన్నాడు రాంబాబు చిన్నగా నవ్వుతూ. అమ్మాయిలు అన్నిటిలోనూ కొంచెం కొంచెం కొరికి ప్లేట్లలో వదిలేసేరు. రాంబాబు మాత్రం కష్టపడి అన్నీ తినేసేడు (తన ప్లేటులోవి). పార్టీ ఐపోయింది. అందరూ కుర్చీల్లో జారగిలబడి కబుర్లలో పడ్డారు.

పావుగంట గడిచింది.

యూనిఫారంలో వున్న ఓ సర్వరు పైకొచ్చేడు. "కమలగారూ, వకుళగారూ అట. ఎవరో ఫోన్‌లో పిలుస్తున్నారు" అని చెప్పేడు.

వకుళా, కమలా లేచి "ఎవరమ్మా, ఎవరెవ రమ్మా..." అని పాడుకుంటూ క్రిందికి పరుగెత్తేరు. పదినిమిషాలయినా పైకి రాలేదు. "వీళ్ళేమయే రబ్బా!" అంటూ గాభరాపడుతూ నలుగురమ్మా యిలు లేచి బయలుదేరబోయేరు.

"నే చూసొస్తాలెండి" అన్నాడు రాంబాబు లేవబోతూ. ఇంతలో కమలా, వకుళా పైకొచ్చేరు. "వసుంధర ఇంట్లో పార్టీగా. మరీమరీ రమ్మని మొన్ననే బ్రతిమిలాడింది పాపం. వస్తామని ప్రామిస్ చేసి మర్చిపోయేం. మా ఇంటికి కబురు చేస్తే మమ్మీ మనమంతా ఇక్కడున్నాం అని చెప్పేసిందిట. ఇప్పుడు వసూయే ఫోన్ చేస్తా. పార్టీ కట్టేసి బయల్దేరి వస్తారా, లేక బంధుమిత్ర సమేతంగా మీమీద దాడిచేసి కట్టకట్టి ఎత్తుకు పొమ్మంటారా....అని బెదిరిస్తోంది!" అన్నారు.

"నేను రాను. మీరు వెళ్ళండి కావలిస్తే. పార్టీకి రమ్మని పిలిచి గెస్టుని వదిలేసి పోవడం ఏం న్యాయం?" అంది సత్యభామ లేవకండా.

"ఫర్వాలేదు. వెళ్ళండి. నేను వెళ్ళిపోతాను" అని రాంబాబు కుర్చీలోనించి లేవబోయేడు.

"వద్దు రాంబాబు గారూ, కూచోండి. వసుంధర ఎప్పుడన్నా వుంటుంది. మీరు మహా వుంటే గంటో, అరగంటో వుంటారు. అదీగాక ఇన్నాళ్ళకి మిమ్మల్ని కలుసుకోగలగటం నాంకెతో ఆనందంగా వుంది. మీరు పోతే పొండి. నేను రానన్నానని చెప్పండి."

"పసుంధర తిడుతుందేమోనే!" అంది కళ్ళజోడు కమల.

"గో టు హెల్. అదీ, మీరూ కట్ట కట్టుకుని స్విమ్మింగ్‌పూల్‌లో దిగండి!

"ముందుగా మెట్లు దిగుతాం" అంటూ అంతా చెప్పులేసుకుని రాంబాబుకి 'సారీ' చెప్పి ఇద్దరికీ 'టాటా' చెబుతూ క్రిందికి వెళ్ళిపోయేరు.

రాంబాబూ, సత్యభామా కబుర్లు చెప్పుకుంటూ కార్టూన్ల గురించీ, కథల గురించీ మాట్లాడుకుంటూ కూచున్నారు.

పడమటి కొండమీద పూల రథంలా సూర్యుడు దిగుతున్నాడు. లేత గాలి పూల తీగల మీదినించి తేలి వస్తూ చెంపలను స్పృశిస్తోంది. అరగంట గడిచింది.

ఇందాకటి సర్వరు మళ్ళీ పైకి వచ్చి— "మిమ్మల్ని ఫోన్‌లో పిలుస్తున్నారండీ" అన్నాడు సత్యభామతో.

"వీళ్ళకి బుద్ధిలేదు. ఆ వసూ రాస్కేల్‌కి అసలే లేదు. రానని గట్టిగా చెప్పేసి వస్తాను, వుండండి, ప్లీజ్" అని క్షమార్పణలు చెప్పు కుంటూ, తన విసుగునంతా చెప్పులమీద చూపించుకుంటూ, హైహీల్సు టకటకలాడించు కుంటూ క్రిందికి వెళ్ళింది. జోళ్ళ చప్పుడు దూరం అయేక రాంబాబు జేబులోనించి దువ్వెన తీసి పైపైన దువ్వుకుని, పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుని అటూ ఇటూ పచార్లుచేయటం మొదలు పెట్టేడు.

ఎవరో పైకి వచ్చిన చప్పుడయింది. రాంబాబు తిరిగి చూసేడు. వెయిటర్ ఓ చీటి రాంబాబు చేతి కిచ్చి పక్కన నుంచున్నాడు.

"ఎవరిచ్చేరు?" అన్నాడు రాంబాబు చీటి విప్పుతూ.

"ఇంతవరకూ ఇక్కడున్న అమ్మాయిలంతా ఇచ్చేరు సార్!"

"అందరూనా?" అన్నాడు రాంబాబు ఆశ్చర్యంగా. "ఎక్కడున్నారు వాళ్ళంతా?"

"ఇప్పటి వరకూ క్రింద హాల్లో కూర్చున్నారు.

ఈ చీటి మీ కిమ్మని చెప్పి అంతాకలిసి ఎర్ర కారులో వెళ్ళిపోయేరు."

రాంబాబు చీటి విప్పేడు గబగబా.

"కార్టూనిష్టూ!

బై బై! మా మీద ఇష్టం వచ్చినట్టు బొమ్మలు గీసి, ఏడిపిస్తావా! అహ్హా(! బిల్లు ఇచ్చేయమ్మా. లేకపోతే ఇంచక్కా పప్పు రుబ్బెయ్!

ఇట్లు

అఖిల భారత అమ్మాయిల సంఘం అధ్యక్షురాలు

సత్యభామ, బృందం.

పి. ఎస్:—మా ప్లానుకి బోలెడు సహాయం చేసి పెట్టిన సర్వర్ సుందరానికి టిప్ ఇవ్వటం మర్చిపోవద్దు ప్లీజ్." □

‘చేతికి గాజులందమూ’ అన్నది పాట. ‘గాజులే కావు. గాజుల బుట్ట కూడా చేతికి అందమే’ అంటారు కలకత్తాకు చెందిన శ్రీమతి శాంతా అశ్వత్థనారాయణ.

“‘గాజులతో బుట్టలల్లడమేమిటి?’ అని ఎవరూ ప్రశ్నించనక్కర లేదు. గాజులతో బుట్టలు చెయ్యడం అంత సులభమైన పని!” అంటారు ఆమె.

గాజులతో బుట్టలు ఎలా అల్లాలో శ్రీమతి శాంత ఇక్కడ చెబుతున్నారు:

“ఈ గాజుల బుట్ట చెయ్యడానికి రెండు రకాల రంగుల గాజులు (ఉదాహరణకు పసుపు రంగు, పచ్చరంగు గాజులు అనుకుందాం) కావాలి. ఆ గాజులు కూడా రెండు సైజులలో ఉండాలి. ఒక దానిమీద ఒకటిగా నిలువుగా మూడు వరుసలలో గాజులను అమర్చి, ఆ నిలువు వరుసలను—అడుగు భాగంగా అమర్చిన గాజులతో కలిపితే ఈ బుట్ట పూర్తవుతుంది. గాజులే కాక సాటిన్ రిబ్బన్, లాగితే సాగే తీగె—కావాలి.

“బుట్టలో నిలువున మూడు వరుసలలో గాజులు ఉండాలన్నాను. అలాగే బుట్ట అడుగు భాగంలోనూ గాజులు ఉండాలి. బుట్ట అడుగు భాగానికీ, దాన్ని అనుకుని ఉండే నిలువు వరుసకూ—పసుపు రంగు గాజులనూ, ఆ నిలువు

గాజులతో బుట్టలు చేయడం

వరుసమీద ఉండే మరి రెండు నిలువు వరుసలకు పచ్చరంగు గాజులనూ ఉపయోగించాలి. బుట్ట అడుగు భాగం రూపొందించడానికి 2 అంగుళాల వ్యాసం గల పద్నాలుగు పసుపు గాజులు కావాలి. అడుగు భాగాన్ని ఆనుకుని ఉండే నిలువు వరుసను రూపొందించడానికి $1\frac{1}{2}$ అంగుళాల వ్యాసం గల 54 పసుపు రంగు గాజులు అవసరం. ఆ నిలువు వరుస మీద ఉండే తక్కిన రెండు నిలువు వరుసలు రూపొందించడానికి 2 అంగుళాల వ్యాసం గల పచ్చరంగు గాజులు 104 కావాలి. ఈ గాజులతో బాటు $\frac{1}{2}$ అంగుళం వెడల్పుగల పసుపు రంగు రిబ్బను 6 మీటర్లు, $\frac{1}{2}$ అంగుళం వెడల్పు గల పచ్చరంగు రిబ్బను 12 మీటర్లు కూడా సిద్ధం



చేసుకుంటే గాజులను కట్టి ఉంచడానికి పనికి వస్తాయి.

"మొదట బుట్ట అడుగు భాగాన్ని ఆనుకుని ఉండే నిలువు వరుస ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం. $1\frac{1}{2}$ అంగుళం వ్యాసం గల 54 పసుపు రంగు గాజులను తీసుకోవాలి. వాటిగుండా 26 అంగుళాల పొడవుగల సాగే తీగెనూ, 24 అంగుళాల పొడవుగల సాగే తీగెను పోనివ్వాలి. అలా పోనిచ్చి ఆ తీగెల చివరలను ముడిపెట్టాలి. అలా ముడి పెడుతున్నప్పుడు గాజుల కింది భాగాన 25 అంగుళాల చుట్టుకొలత, మీది భాగాన 23 అంగుళాల చుట్టుకొలత గల వృత్తాకారంలో వచ్చేలా గాజులను అమర్చుకోవాలి. గాజులను ఒకదానికొకటి సమాన దూరంలో ఉంచాలి. పసుపురంగు రిబ్బను తీసుకుని దాని ఒక కొనను ఒక గాజు కింది భాగాన చుట్టి కుట్టాలి, ఆ తర్వాత ఆ రిబ్బనును వృత్తాకారంలో అమర్చి ఉన్న గాజులన్నిటి అడుగు భాగం చుట్టూ పోనిచ్చి, బిగువుగా చుట్టాలి. అన్ని గాజులకూ అలా చుట్టాక రిబ్బను చివరను జాగ్రత్తగా కుట్టాలి. ఇలాగే గాజులమీది భాగాల ద్వారా పచ్చరంగు రిబ్బనును పోనిచ్చి, బిగువుగా చుట్టి కుట్టుకోవాలి.

రెండంగుళాల వ్యాసం గల పచ్చరంగు గాజులు 54 తీసుకుని వాటితో నిలువు వరుసలలో మధ్య ఉండే వరుసను రూపొందించాలి. వాటి ద్వారా 24 అంగుళాల పొడవు గల సాగే తీగె ముక్కలు రెండిటిని పోనివ్వాలి. ఆ తీగెల సాయంతో గాజుల మీది భాగాన, కింది భాగాన కూడా 23 అంగుళాల చుట్టుకొలత వచ్చేలా గాజులను వృత్తాకారంలో ఒకదానికొకటి సమాన దూరంలో అమర్చాలి. తీగెల కొనలను కలిపి ముడివెయ్యాలి. ఈ గాజుల కింది మీది భాగాల ద్వారా పచ్చరంగు రిబ్బనును పోనిచ్చి, బిగువుగా చుట్టి కుట్టాలి.

"ఇలాగే నిలువు వరుసలలో మీది వరుసను రూపొందించడానికి 54 పచ్చరంగు గాజులు (రెండంగుళాల వ్యాసం గలవి) తీసుకోవాలి. వాటి ద్వారా సాగే తీగెల ముక్కలు పోనిచ్చి గాజుల మీది భాగాన 30 అంగుళాల చుట్టుకొలత, కింది భాగాన 23 అంగుళాల చుట్టుకొలతగల వృత్తాకారం వచ్చేలా అమర్చి, తీగెల కొనలను ముడి వెయ్యాలి. ఆ తర్వాత ఈ నిలువు వరుస రూపొందించడానికి ఉపయోగించిన పచ్చరంగు గాజుల క్రింది భాగం ద్వారా పచ్చరంగు రిబ్బనును పోనిచ్చి, బిగువుగా చుట్టి కుట్టాలి. వాటిమీది భాగాల ద్వారా పసుపు రంగు రిబ్బనును పోనిచ్చి, బిగువుగా చుట్టి కుట్టాలి.

"ఇక నిలువు వరుసలలో కింద ఉండే పసుపు రంగు గాజుల వరుసను, మధ్యలో ఉండే నిలువు వరుసకు ఉపయోగించే పచ్చరంగు గాజుల వరుసను ఒకదానిమీద ఒకటి (పసుపు రంగు గాజుల వరుస కింద ఉండేలా) ఉంచి, వాటిని కనీసం నాలుగు చోట్లలోనన్నా కలిపి ఊడిపోకుండా రిబ్బను ముక్కలతో ముడిపెట్టాలి. వాటిని అలాగే జాగ్రత్తగా తీసి, నిలువు వరుసలలో మీద రావలసిన పచ్చరంగు గాజుల వరుసకు కలిపి ముడి పెట్టాలి.

"ఇక బుట్ట అడుగు భాగం తయారు చేసుకోవాలి. ఇందుకు 2 అంగుళాల వ్యాసం గల పసుపు రంగు గాజులు 14 తీసుకుని వాటిని ఇచ్చిన చిత్రంలో చూపిన తీరులో అమర్చుకోవాలి. కావాలనుకున్న వాళ్ళు గాజులను వేరే విధంగా కూడా అమర్చుకోవచ్చును. ఈ గాజులను దారంతో ఒకదానికొకటి కలిపి ముడిపెట్టాలి. ఆ తర్వాత ఈ గాజుల వరుసను, నిలువు వరుసలలో కింద ఉన్న పసుపు రంగు గాజుల వరుసతో కలిపి నాలుగైదు చోట్ల రిబ్బను ముక్కలతో కలిపి ముడిపెట్టాలి.

"బుట్టకు పిడి తయారు చేసుకోవాలి. 18 అంగుళాల పొడవు గల సాగే తీగెను తీసుకుని దాని కొనలను నిలువు వరుసలలో మీది వరుస మీది భాగాన ఎదురెదురుగా ఉన్న రెండు చోట్లలో ముడివేసి ఉంచాలి. ఈ తీగెచుట్టూ ఏ మామూలు గుడ్డతోనైనా చుట్టాలి. ఇలా చేస్తే పిడి మందం పెరుగుతుంది. ఇలా చుట్టిన గుడ్డ మీద ఎరుపు రంగు సాటిన్ రిబ్బన్ చుట్టి కుట్టేస్తే చాలు. గాజుల బుట్ట సిద్ధం!"

వర్ణచిత్రం చూస్తే గాజులబుట్ట ఎలా ఉంటుందో స్పష్టమవుతుంది. "ఈ బుట్టలో పువ్వులు, పళ్ళు, కాయగూరలు ఉంచుకోవచ్చును. లేకుంటే పూల తొట్టిగా ఉపయోగించవచ్చును. కావాలనుకుంటే బల్ల మీద 'కళా ఖండం'గా అమర్చుకోనూ వచ్చును" అంటారు శ్రీమతి శాంత.

కాంతి కిరణాలు 2

శీలంశెట్టి రమాదేవి

ఊహుం! తను నమ్మలేడు! సృజన్ ఎక్కడో పొరబాటు పడి ఉంటాడు!

"సృజన్! నువ్వనేదేమిటో నాకు బోధపడటం లేదు!" ఉద్వేగంతో అన్నాడు తను.

తను కావాలని, కోరి చేసుకొంటోన్న అమ్మాయి గురించి ఈ విధమయిన చర్చలోకి దిగడం సహించలేక పోతున్నాడతను. శరీరమంతా ఉద్రేకంతో వణికిపోతోంది.

సృజన్ అతని వంక బాధగా చూశాడు.

"క్షమించరా! నువ్వెంతగా 'హర్ట్' అవుతావో నాకు తెలుసు! కానీ నీకు ఈ విషయం చెప్పకుండా దాచటం నావల్ల కావటంలేదు! స్వరూప గురించి నాకు బాగా తెలుసు. నేను ఫైనలియర్లో ఉన్నప్పుడే ఆమె గురించి అల్లరల్లరయింది కాలేజంతా! వాళ్ళింట్లో అద్దెకుండే వాళ్ళబ్బాయి మిలటరీలో సెకండ్ లెఫ్టినెంట్! అతను రెండు నెలలు శెలవులో మా ఊరు వచ్చాడు. అతనికీ, స్వరూపకీ పరిచయమయిపోయింది. నిజానికి అతను చాలా అందంగా, ఠీవిగా ఉండేవాడు. ఆ పరిచయం ప్రేమలోకి దిగింది! ఇద్దరూ చాలాసార్లు సినిమాల్లోనూ, షికార్లకు వెళ్తూనూ మా కాలేజి కుర్రాళ్ళకు కనిపించారు. అంతే! ఇద్దరి పేర్లూ గోడల మీద కెక్కినయ్! వాళ్ళిద్దరినీ చూస్తూనే వాళ్ళ చుట్టుపక్కల వాళ్ళందరూ గుసగుసలాడుకునే వాళ్ళు! అయితే వాళ్ళిద్దరూ కూడా ఇవేమీ లెఖ్ఖచేయలేదు. ఎంచేతంటే అప్పటికే వాళ్ళు వివాహం చేసుకుందామన్న నిర్ణయాని కొచ్చేశారు. ఈ విషయాలన్నీ మాకు స్వరూప క్లాస్‌మేట్స్ కొంతమంది మా స్నేహితుల చెల్లెళ్ళవటంమూలాన తెలుస్తూందేవి...." అంతవరకూ చెప్పి ఆగాడు సృజన్.

సురేంద్రకి అతని మాటలు శూలాల్లా గుచ్చుకొంటున్నయ్! నమ్మకూడని విషయాలేమీ కనిపించటం లేదు! అయినా తన అపోహే గాని సృజన్‌కి అబద్ధం చెప్పాల్సిన అవసరం ఏమొచ్చింది? తనని మించిన ఆప్తమిత్రుడు మరొకడు లేడతనికి! ఆ విషయం తనకి బాగా తెలుసు! అదే మరొకరయినట్లయితే—పెళ్ళి చెడగొట్టటమవుతుందని ఆ విషయం దాచేసేవారు. ఎంత నమ్మకం కుదిరినా, ఒకవేళ అతను చెప్పిన విషయం అబద్ధమయే ఆస్కారం ఉందేమోనన్న ఆశ మెదుల్తూనే ఉందతన్లో.

"కలిసి తిరిగినంత మాత్రాన ఆమెది చెడుప్రవర్తన అయిపోతుందా?" అడిగాడు సురేంద్ర.

"ఒక ఆడపిల్ల మీద—అందులోనూ ఇలాంటి సమయంలో—అభాండాలు వేయడానికి నేనూ ఇష్టపడను సురేంద్రా! ఆ అమ్మాయిని వివాహం చేసుకోబోతున్నది నా ప్రాణస్నేహితుడవటంమూలాన ఆ విషయాలన్నీ చెప్పక తప్పలేదు. స్వరూప కాలుజారిందనడానికి ఆధారం ఉండబట్టే నేను రూఢిగా చెప్పగలుగుతున్నాను...."

సురేంద్ర మాట్లాడలేదు.

పెద్ద బస్సొకటి నెమ్మదిగా వారి ముందునుంచి వెళ్ళిపోయింది. ఉండుండి గాలికి కొబ్బరిచెట్లన్నీ ఊగి సవ్వడిచేస్తున్నయ్!

అలా ఎంతసేపు గడచిపోయిందో ఇరువురికీ తెలీలేదు. ముందుగా సృజన్‌బాబే ఆలోచనల్లోంచి తేరుకొని టైమ్ చూసుకొన్నాడు. పదకొండున్నరవుతోంది. "ఇంక పోదామా?" అడిగాడతను.

సురేంద్ర మౌనంగా లేచినుంచుని భారంగా విడిదింటివేపు అడుగులు వేయసాగాడు. రాత్రాను అతనికి స్వరూప మీద కోపం, అసహ్యం పెరిగిపోతున్నయ్! కావాలని తన నామె మోసగించినట్లనిపించిసాగింది. ఆమె మీద అంతవరకూ పేరుకుపోయిన ప్రేమానురాగాలు నెమ్మదిగా కరిగిపోసాగినయ్! అమాయకురాలిలా ఎంత నటన? ఆమె హృదయాన్ని ప్రప్రథమంగా తనే ఆక్రమించుకున్నాడనీ, ఆమె సరసన తన జీవితం ఎంతో మధురంగా, ఆనందంగా సాగిపోతుందనీ ఊహించుకొన్నాడు. వాడెవడినో ప్రేమించి, వాడితో ప్రణయకలాపాలు జరిపి—చివరకు తనను వివాహం చేసుకోడాని కెందుకొప్పుకుంది? ఒకవేళ వాడు అన్ని ముచ్చట్లూ తీరాక—వివాహం చేసుకోను, పొమ్మన్నాడేమో! ఇలాంటి కథలు చాలా తెలుసు తనకు! తమ బంధువుల్లోనే ఒకమ్మాయి ఇలాగే ఒకడిని ప్రేమించి, తీరా గర్భం వచ్చాక, వాడు పెళ్ళిచేసుకోనంటే ఆత్మహత్య చేసుకు చనిపోయింది. కాలేజిలో డాక్టర్‌గారమ్మాయి విజయ ఓ ఫైనలియర్ కుర్రాడితో ఇంచుమించుగా సంవత్సరంపాటు సంసారం చేసి చదువవగానే—అతన్నొదిలేసి ఓ ఆఫీసరుని పెళ్ళిచేసేసుకుంది. ఇంతకూ ఇప్పుడేమిటి చెయ్యటం? స్వరూప మీద ద్వేషం పేరుకుపోసాగిందతన్లో! ఇప్పుడీ పెళ్ళి ఆగిపోతే వాళ్ళతోబాటు తమకీ అవమానమే! పైగా అందుమూలాన స్వరూపకి జరిగే నష్టమేమీ ఉండదు! పెళ్ళి తప్పిపోవడం ఇది రెండోసారవుతుంది! అంతే! మర్నాటినుంచే మరోడిని వలలో వేసుకొని, వాడిని పెళ్ళాడటానికి తయారవుతుంది మళ్ళీ! ఇలాక్కాకూడదు! తనలాంటి అమాయకులతో చెలగాటమాడకుండా ఆమెకు బుద్ధి చెప్పాలి! మళ్ళీ జీవితంలో మరో మగాడు ఆమె వంక చూడకుండా ఉండేట్లుగా తగిన శాస్తి చేయాలి! చక్కని గుణపాఠం నేర్పాలి!

ఇల్లు చేరుకొన్నారిద్దరూ. ఇల్లంతా ఇంచుమించుగా నిశ్శబ్దంగా ఉంది!

స్నేహితులందరి కోసం గదిలో పక్కలు పరచి ఉన్నయ్! బట్టలు మార్చుకొని వాటిమీదకు వరిగారిద్దరూ.

ఇద్దరికీ కంటి మీద నిద్ర రావటంలేదు.

తీరా స్వరూప సంగతి చెప్పేశాక అతనికి తను చేసింది మంచి పని కాదేమో అన్న ఆలోచన మొదలయింది! మరి కొద్దిసేపటికి పశ్చాత్తాపంతో దహించుకుపోసాగాడతను. తన మూలాన స్వరూప జీవితం

ఎలాంటి మలుపులు తిరగబోతోందో అన్న ఆలోచన అతడిని భయ కంపితుడిని చేసింది.

శ్రీధరం, వీర్రాజు, సీతంరాజు సినిమా నుంచి తిరిగి వచ్చారు. కొద్ది సేపు ఆ పాత సినిమాలోని సన్నివేశాలు గుర్తుకితెచ్చుకుంటూ మాట్లాడి క్రమంగా నిద్రలోకి జారిపోయారు.

3

దగ్గర్లోనే గడియారం మూడు గంటలు కొట్టింది. అశాంతిగా అటూ ఇటూ పొర్లసాగాడు సృజన్.

అప్పుడే లేచి కూర్చుని సిగరెట్ అంటించుకున్న సురేంద్ర వంక బాధగా చూశాడతను!

ఇదంతా తనమూలానే జరుగుతోంది! మానసికంగా అతనెంత గాయపడతాడో తలచుకొంటే గుండెలవిసి పోతున్నయ్! క్రమంగా తన మీద తనకే అసహ్యం కలుగసాగింది సృజన్‌బాబుకి! తనంత దుర్మార్గుడు మరొకడుండడీ ప్రపంచంలో! ఎంత దుర్మార్గుడు కాకపోతే పచ్చని పెళ్ళి



పందిట్లో అలాంటి వార్తని పెళ్ళికొడుక్కి చెప్తాడు? ఒక వేళ ఇప్పుడే పెళ్ళి ఆగిపోతే, స్వరూప ఉసురు తప్పక తనకే తగుల్తుంది.

"సురేంద్రా" నెమ్మదిగా లేచి కూర్చుని పిలిచాడు సృజన్‌బాబు.

"ఊ!" గంభీరంగా అనిపించిందతని గొంతు!

"ఇంకా అదే ఆలోచిస్తున్నావా?"

"అవును!"

"ఇప్పుడేం చెయ్యాలనీ?"

"స్వరూపకి బుద్ధి చెప్పాలి! అది ఎలా చేయాలా అన్నదే బోధ పడటం లేదు!"

"అంటే పెళ్ళి జరగడం లేదన్న మాటేగా?"

"అదొక్కటే చాలదు సృజన్! ఆ రాక్షసి మరోసారి ఎవ్వరి జీవితంతోనూ చెలగాట లాడటానికి వీల్లేకుండా ఏదయినా పాఠం నేర్పాలి! అప్పుడు గాని నాకు మనశ్శాంతి ఉండదు!"

"పోనీ ఆమెనలా వదిలేసి మనదారిన మనం పోతే ఏం?"

"వాళ్ళకి కారణమేం చెప్తావ్?"

"హఠాత్తుగా మనవాళ్ళెవరికో ప్రమాదంగా ఉన్నట్లు కబురందిందని చెప్తే సరి!...."

చిన్నగా నవ్వాడు సురేంద్ర.

"వాళ్ళని అంత గౌరవ మర్యాదలతో వదిలేద్దామనా? ఊహూ! అలా వీల్లేదు సృజన్! నా సంగతి నీకు తెలిసిందేగా! నేనొకరి జోలికి పోను! ఒకరు నన్నవమానిస్తే ప్రతీకారం తీర్చుకొనేవరకూ వదలను...."

సృజన్‌కి ఏం మాట్లాడటానికి తోచలేదు.

ముహూర్తం దగ్గరపడుతున్న కొద్దీ అతనికి ఆందోళన అధికమవ సాగింది.

చీకట్లు విచ్చుకొంటూండగానే మంగళ వాయిద్యాలు వినిపించ సాగినయ్. ఇంట్లో అప్పుడే హడావుడి మొదలయింది.

స్నేహబృందమంతా నిద్రలేచారు.

సురేంద్రని లోపలికి పిలుచుకెళ్ళారు కొందరు ఆడవాళ్ళు.

అన్యమనస్కంగానే తనూ మిగతావారితోపాటు తయారయి పెళ్ళి పందిట్లోకి చేరుకొన్నాడు సృజన్‌బాబు.

ఎప్పుడు ఏం గొడవ జరుగుతుందోనని అతను కలవరపడుతూనే ఉన్నాడు. సురేంద్ర ఏం చేయదలచుకొన్నాడో అతని కేమాత్రం బోధపడటం లేదు! వివాహం యథాతథంగానే జరిగే సూచనలు కనబడుతున్నయ్!

ఒకవేళ వివాహ వేదిక మీద రసాభాస చేస్తాడేమో! 'ప్రతీకారం' తీర్చుకొంటానన్న అతని మాటలు గుర్తుకొచ్చినయ్ సృజన్‌బాబుకి. జరుగబోయ్ సంఘటన తల్చుకుంటే అతనికి వళ్ళు ఝుల్లుమనసాగింది.

వివాహ వేదికమీద కూర్చున్నాడు సురేంద్ర. పురోహితుల మంత్రాలు మైకులో మార్మోగుతున్నాయ్! సురేంద్ర మొఖం వంకే చూస్తున్నాడు సృజన్. చిరునవ్వుతో స్నేహితుల వంక చూశాడు సురేంద్ర! అతని మొఖంలో ఎలాంటి భావమూ కనిపించటం లేదు.

పెళ్ళికూతురిని కూడా తీసుకొచ్చారు వేదికమీదకి.

ముహూర్తం వేళ దగ్గరయింది.

జరగాల్సిన తంతంతా యధాప్రకారం జరిగిపోతోంది. సృజన్‌బాబు గుండెలు వేగంగా కొట్టుకో సాగినయ్‌! ఏక్షణాన ఏం జరుగుతుందోనని ఊపిరి బిగపట్టి చూస్తున్నాడు.

అతను చూస్తూండగానే మంగళ సూత్రధారణ కూడా అయిపోయింది. అందరితోపాటు తనూ అక్షింతలు జల్లాడు సృజన్.

అతనికి విపరీతమయిన ఆశ్చర్యంగా ఉంది! సురేంద్రలో ఏం ఆలోచనలు దాగి ఉన్నాయో అర్థం కావటం లేదు.

అతను స్వరూపని స్వీకరించడానికే నిశ్చయించుకొన్నాడా? అలా చేయడాన్ని తను వ్యతిరేకించటం లేదు కాని–అంతగా ఉద్దేశపడిన అతను ఇంత తేలిగ్గా ఎలా రాజీకి రాగలిగాడు! అతని తత్త్వం తనకు బాగా తెలుసు! పట్టుదల గల మనిషి! మరీ ఈ చిత్రమేమిటి?

"పదరా! ఇంకా ఇక్కడెందుకు? పదిగంటలకు బస్సుందట! పోదాం!...." అన్నాడు సీతంరాజు అక్కడినుంచి లేస్తూ.

"ఓసారి సురేంద్రకు చెప్పి వెళ్ళొద్దూ?" అడిగాడు శ్రీధరం.

"పదండి! చెప్పకుండా ఎట్లా?"

అందరూ సురేంద్ర దగ్గరకు నడిచారు. వాళ్ళతోపాటు తనూ నడిచాడు సృజన్.

"అప్పుదే ఏమిట్రా? భోజనం అదీ చేసి సాయింత్రం వెళ్దురుగాని.." అన్నాడు సురేంద్ర.

"ఇంకెందుకు లేరా మేము పానకంలో పుడకల్లాగా? రాత్రిళ్ళు ప్రయాణం కష్టమయిపోతుంది మళ్ళీ! పోతాం!"

సురేంద్ర ఇంకేమీ మాట్లాడలేకపోయాడు.

"నేనూ వెళ్తున్నాను...." అన్నాడు సృజన్. అతనికి వీలయినంత త్వరగా అక్కడి నుంచి వెళ్ళిపోవాలనుంది!

"నీకేం తొందర?" అడిగాడు సురేంద్ర.

"ఇప్పుడు బయల్దేరితేనే తెల్లారేసరికి హైద్రాబాద్ చేరుకొంటాను! లేకపోతే మరో రోజంతా గడపాల్సి వస్తుంది...."

"సరే! నీ ఇష్టం! – అన్ని విషయాలూ వివరంగా తెలియజేస్తాన్లే తరువాత"

సృజన్‌బాబు సీతంరాజు వాళ్ళతోపాటు బస్ స్టాండు చేరుకొన్నాడు. అతని మనసంతా వికలమయిపోయింది.

తనకూ–సురేంద్రకూ మధ్య అదివరకటి అభిమానం – స్నేహం లోపించినట్లనిపించసాగింది!

బస్ బయల్దేరి కాలువ ప్రక్కనే రోడ్డు మీద వేగంగా పరుగెత్తసాగింది.

సృజన్‌బాబు కళ్ళ వెంబడి నీళ్లు తిరిగినయ్. 'తనీ పెళ్ళికి రాక పోయినా బావుండేది' అనుకొన్నాడు బాధగా!

4

అందంగా అలంకరించిన మంచం మీద కూర్చున్నాడు సురేంద్ర. అతని మొఖం వాడిపోయి ఉంది. ఈ ఘడియల కోసం తనెన్ని కలలు కన్నాడు! ఎంత ఆత్రుతతో ఎదురు చూశాడు! అవన్నీ ఒక్క రాత్రిలో చెల్లా చెదరయి పోయినయ్! ఒక్కమాటలో చెప్పాలంటే తన జీవితమే సర్వనాశనం అయిపోయింది.

టైం చూసుకొన్నాడతను. పదకొండవుతోంది. గదిలో లైటు డిమ్‌గా వెలుగుతోంది. పూలు, అగరొత్తులు, సెంట్లు–అన్నిటి సువాసనా కలిసిపోయి కొత్త పరిమళం అలుముకొంది!

ఉండుండి బయట ఆడవాళ్ళ నవ్వులు వినబడుతున్నయ్!

మరి కొద్దిసేపటి తర్వాత గది తలుపులు తెరచుకొన్నయ్! స్వరూప నెమ్మదిగా, బిడియంగా లోపలి కడుగుబెట్టింది. తలుపులు మళ్ళీ మూసుకు పోయినయ్.

అతనివంక ఓసారి చూసి తలదించుకొని గోడకానుకొని నుంచుండి పోయింది స్వరూప. ఆమె అందం అదివరలా పరవశత్వం కలిగించటం లేదు సురేంద్రకి. శరీరమంతా ద్వేషంతో భగ్గుమంది. అతికష్టం మీద కోపం అణచుకొని లేచి ఆమె దగ్గరగా నడిచాడు.

కొద్దిసేపు ఆమె వంకే చూస్తూ నిలబడిపోయాడు. ఎలా మొదలు పెట్టాలో ఏమాత్రం అర్థం కావటం లేదు.

అమాయకంగా, నిర్మలంగా కనబడుతోన్న ఆమె ముఖం కోపాన్ని పెంచేస్తోంది. వెనక్కు తిరిగి నడిచి మంచం మీద కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు.

"ఇలారా!" అన్నాడు ఆమె వంక చూడకుండానే. అతని ముందు కొచ్చి నిలబడింది స్వరూప.

ఆమె వంకే చూసి, ఆమె కూడా తనవంక చూడటంతో చూపులు మరల్చుకొన్నాడతను. స్వరూప తెల్లబోయింది. అతని ప్రవర్తన ఆమె కేమాత్రం అవగాహన కావటం లేదు. తనకు అంతకు ముందు దృష్టిలో ఉన్న సురేంద్ర వేరు–ఈ సురేంద్ర వేరు!

"అలాకూర్చో! నీతో మాట్లాడాలి...." అతని గొంతులోని కర్కశత్వానికి కలవర పడిందామె.

కుర్చీలో కూర్చుని అతని వంకే ఆత్రుతగా చూడసాగింది.

"దయచేసి నేనడిగేదానికి నిజం చెప్పు! అబద్ధాలాడి నీమీద ఉన్న అభిప్రాయాన్ని మరింత దిగజార్చవద్దు...." తిరిగి అన్నాడతను.

తృళ్ళిపడింది స్వరూప. ఆమె గుండెలు బయటకు వినబడేటంత గట్టిగా, వేగంగా కొట్టుకోసాగాయి. క్షణంలో మొఖం వెలవెల పోయింది.

"ఏమిటది?" హీనస్వరంతో అడిగిందామె.

"నీ గత చరిత్ర నాదగ్గరెందుకు దాచావ్! నన్నెందుకు మోసం చేశావ్?" ఉద్రేకంగా అన్నాడు సురేంద్ర లేచి నుంచుంటూ.

స్వరూప మొఖం పూర్తిగా పాలిపోయింది.

"మీ....రనేది...."

"నేననేదేమిటో నీకు తెలుసు! ఇంక నటించడం ఆపు! నువ్వు నీ యిష్టం వచ్చిన వాడితో తిరుగు. నాకేమీ సంబంధం లేదు! కాని మధ్యలో నన్నెందుకు వివాహం చేసుకోవాలనుకున్నావ్? నేను నీ కేం ద్రోహం చేశానని నన్నీరకంగా అపఖ్యాతిపాలు చేయదల్చుకున్నావ్?"

జల జలా రాలిపోతున్న కన్నీళ్ళు తుడుచుకొని, కుర్చీలో నుంచి లేచి నిలబడింది స్వరూప.

"క్షమించండి! నేనెవ్వరినీ మోసం చేయాలనుకోలేదు! అసలు వివాహం చేసుకోవాలన్న కోరికే చచ్చిపోయింది నాలో! కానీ...మా పెద్దవాళ్ళ బలవంతం మూలాన, వాళ్ళ కన్నీళ్ళు చూడలేక నా 'చరిత్ర'ను మీ ముందుంచడానికి సాహసించ లేకపోయాను. అయినా నేనేమీ తప్పు చేయలేదన్న నమ్మకం, ధైర్యం నాకున్నాయి!...."

ఆమె చెంప ఛెళ్ళుమని మోగింది. కళ్ళు బైర్లు కమ్మినట్లయినయ్!

"ఆడదానివి కాబట్టి, ఇంతటితో ఆగుతున్నాను! తప్పు చేయలేదని నమ్మకం ఉందిట? మోసం చేయాలనుకోలేదట....రాస్కెల్! నిన్నరాత్రే ఈ పెళ్ళి రద్దు చేసి–నీ రంకుతనం నలుగురుముందూ చాటి మరీ ఇక్కడి నుంచి పోయేవాణ్ణి! కానీ ఈ అల్లరికి గుండెజబ్బు ఉన్న మా అమ్మ ప్రమాదపరిస్థితిలో పడుతుందేమోనని ఆలోచించి ఇంతవరకూ జరగనిచ్చాను!"

స్వరూప అతని వంక బాధతోనూ, అసహ్యంతోనూ చూసింది. హఠాత్తుగా ఎక్కడిలేని ధైర్యం ఆమెలో ప్రవేశించింది.

"ఛీ! ఆడదాని మీద పశుబలం చూపడానికి సిగ్గుండక్కర్లేదూ? మీకు నా చరిత్ర వివాహానికి ముందే తెలిసినప్పుడు–అప్పుడే మా వాళ్ళను అడగాల్సింది! అమ్మ ఆరోగ్యం వంకన పెళ్ళెందుకు చేసుకున్నారు? మరేదైనా కారణం అని ఆపేయ వచ్చుగా?"

"చాలా తెలివైన దానివి స్వరూపా నీ దురదృష్టవశాత్తూ నీ కంటె తెలివైనవాణ్ణి దొరికాను నీకు! నాక్కావలసింది 'వివాహం' కాకపోవడం కాదు! నీకు తగిన శాస్తి జరగడం! జీవితంలో మరోసారి నాలాంటి వాళ్ళని మోసగించకుండా గుణపాఠం నేర్పడం!–అందుకే వివాహం చేసుకున్నాను. ఈ రాత్రి గడిస్తే చాలు! సంఘం దృష్టిలో నువ్వు వివాహితురాలివవుతావ్! ఎక్కడికెళ్ళినా, ఎప్పటికైనా "ఫలానావాడి భార్య" అన్న ముద్ర మాసిపోదు! అదే నాక్కావలసింది! అప్పుడిక నీ మోసాలూ—నటనలూ పని చేయవ్! మరెవ్వరూ నీ వలలో పడరు! నిజంగా నా భార్యనయ్యానని సంతోష పడుతున్నావేమో! ఆ ఆనందం కూడా నీకు దక్కనివ్వను! ఇదే మనకు మొదటి రాత్రీ, ఆఖరి రాత్రి కూడా! ఈ క్షణం నుంచీ నీకూ నాకూ ఎలాంటి సంబంధమూ ఉండదని గుర్తుంచుకో! నిన్ను చూస్తేనే నాకసహ్యంగా ఉంది!" కోపంగా అన్నాడు సురేంద్ర. ఉద్రేకంతో అతనికి ఆయాసం కూడా వచ్చింది.

స్వరూప మొఖం వివర్ణమయిపోయింది. పెదాలు బిగపట్టి దుఃఖం ఆపుకోడానికి ప్రయత్నించింది. కొద్దిక్షణాల తర్వాత తేరుకొని నెమ్మదిగా అంది:

"నాజీవితంలో మిగిలిందేమీ లేదు—ఇప్పుడు పోగొట్టుకోడానికి! నేనేమయిపోతానో అన్న బాధ, భయం కూడా నాకు లేవు! నన్ను ఆసహ్యించుకొనే మనుషుల కంటపడటం నాకూ అఇష్టమే!...." చర చర తలుపు దగ్గరకు నడిచిందామె. సురేంద్ర మెరుపులా నడిచి తలుపు కడ్డంగా నిలబడ్డాడు.

"ఇప్పుడే గది వదలి వెళ్ళడానికి వీల్లేదు! నీకిష్టం ఉన్నా లేకపోయినా ఉదయం వరకూ ఇక్కడ పడి ఉండాల్సిందే...." కర్కశంగా అన్నాడు.

స్వరూప నిస్సహాయంగా అతని వంక చూసి, నెమ్మదిగా వెనక్కు తిరిగి దూరంగా ఉన్న కుర్చీలో కూలబడిపోయింది.

సురేంద్ర లైట్ స్విచ్ ఆఫ్ చేసి నైట్ బల్బ్ వెలిగించాడు. గదంతా మసక కాంతితో నిండిపోయింది.

మంచంమీదకు వరిగి సిగరెట్ వెలిగించుకొన్నాడు. అతని మనసంతా అల్ల కల్లోలంగా అయిపోయింది. అతనికి తెలీకుండానే అతని కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్. మొదటి రాత్రి! ఎన్నో కథల్లో చదివాడు. ఎన్నో సినిమాల్లో చూశాడు. తన మొదటి రాత్రి కూడా అంత మధురంగానూ ఉంటుందని కలలు కన్నాడు. కాని చివరకు జరిగిందేమిటి? ఈ చరిత్రహీనురాలి మూలాన తన కలలన్నీ ధ్వంసమయిపోయినయ్! స్వరూప మీద కసికొద్దీ తన జీవితం కూడా అర్థరహితంగా చేసుకున్నాడు. ఫలానావాడి భార్య అన్న ముద్ర ఆమె మీద పడాలన్న ఆవేశంలో–తనకీ 'ఫలానా అమ్మాయి భర్త' అన్న పేరు మిగిలిపోతుందన్న విషయమే మర్చిపోయాడు. శిలా ప్రతిమలా కూర్చున్న స్వరూపను చూస్తూంటే అతనికి కోపమూ, ద్వేషమూ ఎక్కువయిపోతున్నయ్! సమయానికి సృజన్‌బాబు చెప్పబట్టి తెలిసింది! లేకపోతే, దీని పవిత్రతను నమ్మి, స్వరూపతో సంసారం సాగించేవాడే! చెడిపోయిన స్త్రీతో సంసారం! ఆ ఊహే భయంకరంగా ఉంది! స్త్రీ కాలు జారడం తప్ప, మరే తప్పు చేసినా క్షమించ గలడు తను!

తెల్లారేసరికి గదంతా సిగరెట్ పీకలతో నిండిపోయింది.

"ఇంక నువ్వు బయటకు పోవచ్చు!" స్వరూప నుద్దేశించి అన్నాడతను.

సమర సంక్రాంతి

పదునెక్కిన ఆచారాల
అంచులపైన నడువలేక,
అనాదిగా జరిగే అవమానాలను
సహించలేక,
బ్రతుకే భారమైన నేటి
వనితకు
ఈ సంక్రాంతి పంచలో
విశ్రాంతి కావాలి!
చిరునగవులు శూన్యమైన
చెల్లెమ్మలకు
పసుపు కుంకుమ రాలిపోయిన
అక్కయ్యలకు
ఈ సంక్రాంతి ముంగిట
శుభం జరగాలి!
కుత్సిత కులాచారాలపై
సమరానికి
ఈ సంక్రాంతి శంఖారావం
కావాలి!
జాతినే జ్వలింపజేసే శక్తిగా
ఈ సంక్రాంతి మన సంస్కృతికే
సంకేతమవాలి!
మానవతకే శ్రీకారం చుట్టాలి!

—యెలిశెట్టి సూర్యకాంతం

అంత వరకూ శిలాప్రతిమలా కూర్చున్న స్వరూపలో చలనం కలిగింది. లేచి, వాడిపోయిన మొఖంతో గది తలుపు తీసుకుని బయటకు నడిచింది. స్వరూప వెళ్ళిపోయాక హృదయం కొంత వరకూ తేలిక పడ్డట్టనిపించిం దతనికి. అలసటగా కళ్ళుమూసుకొన్నాడు. కొద్ది క్షణాల్లోనే గాఢంగా నిద్ర పట్టేసింది.

5

ఇంకా చీకట్లు పూర్తిగా విచ్చుకోకుండానే వరుసగా హైద్రాబాద్ చేరుకుంటున్నయ్. ఆర్టీసీబస్‌లు! సృజన్ ఓ బస్సులో నుంచి, సూట్‌కేస్ చేత్తో పట్టుకొని దిగాడు. ఆటోవాళ్ళు అతన్ని చుట్టు ముట్టేశారు. వాళ్ళకి సైకాలజీ తెలుసు! చికాగ్గా, పరధ్యానంగా ఉన్న ప్రయాణీకులు ఎంత డబ్బడిగితే అంతా ఇచ్చేస్తారు. ఒక్కోసారి మీటర్ ఛార్జికాకుండా మరో మూడు నాలుగు రూపాయలు ఎక్కువ వసూలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయ్.

"ఎక్కడికి పోవాల్సార్?" గట్టిగా అరచాడు ఓ ఆటో డ్రైవర్.

సృజన్‌బాబు అప్పటిగ్గాని ఆలోచనల్లోంచి తేరుకోలేదు. బస్ హైద్రాబాద్ బస్‌స్టాండ్ చేరుకోవడం–తను సూట్‌కేస్ తీసుకుని దిగడం–ఇవేమీ గుర్తులేవతనికి! అంచేత ఆటో డ్రైవర్ అడిగిన ప్రశ్నకి తేరుకొని ఆశ్చర్యపోయాడు. తను బస్ దిగి అప్పుడే బయటివరకూ నడచి వచ్చేశాడు.

"విజయ్‌నగర్ కాలనీ!" ఆటోలో కూర్చుంటూ అన్నాడు.

"మీటరు మీద ఒక్కరూపాయ్ ఇవ్వాల్సార్!"

"సరే – సరే. త్వరగాపద!" విసుగ్గా అన్నాడు సృజన్‌బాబు. మరుక్షణంలో వాయువేగంతో దూసుకుపోసాగింది ఆటో.

అతనికి కళ్ళు మండిపోతున్నాయి! రాత్రంతా కంటి మీద కునుకు లేదు! ఎంత ప్రయత్నించినా స్వరూప రూపం కళ్ళ ముందు నుంచీ తొలగించటం సాధ్యం కాలేదు. ఎడతెరిపిలేని సంఘర్షణ! గుండెల్ని కాల్చివేసే పశ్చాత్తాపం!

తను స్వరూప జీవితం సర్వనాశనం చేసేడు. సురేంద్ర పట్టుదల తనకు తెలుసు. ఆ అమ్మాయిని చంపేస్తాడేమో అన్న అనుమానం కూడా లేకపోలేదు. అప్పుడు తను రెండు జీవితాలను నాశనం చేసినట్లవుతుంది! ఇంత దారుణానికి ఎందుకు పూనుకున్నాడు తను? స్వరూపని గుర్తించనట్టే ఊరుకుంటే ఎంత బావుండేది! ఆమె చరిత్ర మర్చిపోతే ఈ గొడవుండేది కాదుకదా! ఎవరికెలా రాసిపెట్టుందో అలా జరిగేది! మధ్యలో తనెందుకు కల్పించుకున్నాడు? తనలాంటి పాపాత్ముడు మరొకరెవరూ ఉండరు.

సృజన్‌బాబుకీ ఆలోచనలు నచ్చలేదు. తనిలా ఆలోచించకూడదు! ఏది మంచో ఏది చెడో తనకు తెలుసు! ఓ మంచి స్నేహితుడిగా తన ధర్మం తను నెరవేర్చాడు. ఇందులో తప్పేముందీ? తన ప్రాణస్నేహితుడు–ఓ కాలుజారిన అమ్మాయిని చేసుకోడం తనెలా సహించగలడు? తనేకాదు–నిజమైన స్నేహితుడెవరయినాసరే–తను చేసిన పనే చేస్తాడు.

ఆటో విజయ్‌నగర్ కాలనీలో ప్రవేశించింది.

"అదిగో! ఆ మోటర్‌సైకిలున్న ఇంటి ఇవతల ఆపు!" చేత్తో చూపుతూ అన్నాడు సృజన్. ఆ యింటి ముందు ఆగింది ఆటో. డ్రైవర్‌కి ఛార్జి ఇచ్చేసి దిగి ఇంటి లోపలకు నడిచాడతను!

అప్పటికే శాంతి వంటింట్లో కాఫీ తయారు చేస్తోంది. సృజన్‌బాబుని చూడగానే చిన్నగా నవ్వింది.

"ఇప్పుడే అనుకుంటున్నానన్నాయ్–ఇంకా రాలెదెమా అని!" అంది అతనివంక చూస్తూ.

"అంటే నూరేళ్ళు ఆయుష్షన్నమాట నాకు! థాంక్యూ! అమ్మా. నాన్నా ఇంకా నిద్రలేవలేదా?"

"పెద్దమ్మ ఎప్పుడో లేచింది! మొక్కలకు నీళ్ళు పోస్తోంది. పెదనాన్న ఇంకా లేవలేదు!"

"ఓకే! నేనిప్పుడే మొఖం కడుక్కుని వస్తాను! కాఫీ రడీగా ఉంచాలి!" అక్కడి నుంచి వెనక్కు తిరుగుతూ అన్నాడతను.

మొఖం కడుక్కొని వచ్చేసరికి కప్పుతో కాఫీ తీసుకొచ్చి అందించింది శాంతి.

"నువ్వు తాగవేం?" నవ్వుతూ అడిగాడు సృజన్.

"తెచ్చుకుంటాను!" లోపలకు నడుస్తూ అందామె.

"పెళ్ళి బాగా జరిగిందా?" హాల్లోకొస్తూ అడిగింది తల్లి.

"ఆఁ....." క్లుప్తంగా అని ఊరుకున్నాడతను.

"పెళ్ళికూతురెలా ఉంది?" వివరాలకోసం అడిగిందామె.

"బాగానే ఉంది!"

"ఏం చదువుకొందిట?"

బొద్దింకల పీడ విరగడ కావడానికి ఎన్నెన్నో మందులు ఉన్నాయి. బొద్దింకలను అరికట్టడానికి అవి ఎక్కువగా ఉన్న చోట వేపనూనె చల్లినా మంచి ఫలితం కలుగుతుంది.



"ఏమోనే! అవన్నీ నాకేం తెలుసు?" తల్లిమీద విసుక్కున్నాడు సృజన్.

శారదమ్మ ఆశ్చర్యపోయింది.

బహుశా ప్రయాణపు బడలికవల్ల విసుగ్గా ఉందేమో అనుకొని మౌనంగా ఊరుకొండి పోయింది.

"కాసేపు నిద్రపోరాదూ! మళ్ళీ పదింటికి ఆఫీసుకెళ్ళాలిగా!" అంది శాంతి. అదే మంచిదనిపించింది సృజన్‌కి. లేచి తన గదిలోకెళ్ళి మంచం మీద వాలిపోయాడు. ఇంకా ఎండ రాకపోయినా పూర్తిగా తెల్లారిపోయింది. చల్లనిగాలి కిటికీలో నుంచి ఆహ్లాదంగా వీస్తోంది. బలవంతంగా కళ్ళు మూసుకున్నాడతను. గంటసేపు గడచిపోయిందిగాని నిద్రపట్టటం లేదు. ఆలోచనలన్నీ స్వరూప మీదే! తను వచ్చేసిన తరువాత ఏం గొడవయిందో ఏమో! అన్నీ వివరంగా ఉత్తరం రాస్తానన్నాడు సురేంద్ర! కానీ అంతవరకూ ఈ సస్పెన్స్ భరించటం ఎలా? లేని పోని మనోవైకల్యాన్ని కొనితెచ్చుకున్నట్లయింది. అసలు అతనీ పెళ్ళికి వెళ్ళకపోయినా బాగుండేది. లేచి కూర్చున్నాడతను! ఊహూ! ఒంటరితనం తను భరించలేడు! హాల్లోకి నడిచాడు. శాంతి అప్పుడేవచ్చిన పేపరు చదువుతోంది. తండ్రి బయటనుంచుని ప్రక్కింటి ముసలాయనతో ఏవో రాజకీయాలు చర్చిస్తున్నాడు.

[సశేషం]

వంటలు

ఆపం

ఆపం అనేది—ఒక రకమైన టిఫిను. ఇది చాలా ప్రాంతాల్లో చాలా ఇష్టంగా తింటారు. ఇది ఎలా చెయ్యాలి? చెయ్యడానికి ఏమేం కావాలి?

ఒక లీటరు బియ్యం, రెండు పెద్దస్పూన్లు మినపపప్పు, ఒక చిన్నస్పూను మెంతులు, కొబ్బరి నీరు (పావు లీటరు) కాస్త—సోడా ఉప్పు, సరిపోయే నూనె, కాస్త పంచదార, కాస్త ఉప్పు, దానికి కావలసినవి.

ఇవన్నీ సిద్ధం చేసుకున్న తర్వాత, బియ్యం బాగు చేసి, బాగా కడగాలి. కడిగిన తర్వాత బియ్యం, మినప పప్పు, మెంతులూ కలిపి—ఆ మిశ్రమంలో నీళ్ళు పోసి, ఉదయమే నాన బెట్టాలి. సాయంకాలం మెత్తగా రుబ్బాలి. అంతకు ముందు రోజే, కొబ్బరి నీరును ఒక సీసాలో పోసి, అందులో మూడు చిన్నస్పూన్ల పంచదార వేసి, బయట పెట్టి వుంచాలి. అలా వుంచితే, కొబ్బరినీరు బాగా పులుస్తుంది. పిండి మెత్తగా రుబ్బిన తర్వాత, ఈ పులిసిన నీళ్ళను అందులో వేసి కలిపేయాలి. అప్పుడే కాస్త సోడా ఉప్పు, కావలసినంత ఉప్పు కూడా వేసి బాగా కలియబెట్టాలి. ఉదయానికి అది బాగా పొంగి వుంటుంది. ఆ పిండిలో కొద్దిగా నీళ్ళుపోసి దోసెల పిండిలాగా కలపాలి. నీళ్ళకు బదులుగా కొబ్బరి నీళ్ళు వేస్తే బావుంటుంది. పొయ్యిమీద బాణలి పెట్టి, అది వేడెక్కిన తర్వాత, అడుగున నూనె రాయాలి. పెద్ద గరిటతో గరిటెడున్నర పిండి తీసుకుని, అందులో వెయ్యాలి. బాణలిని ఏటవాలుగా పట్టుకుని చుట్టూ తిప్పితే, పైన వున్న పిండి అంచుల వరకూ వచ్చేస్తుంది. ఆ తర్వాత ఆవిరి పోకుండా మూత పెట్టాలి. ఆపం సిద్ధం కాగానే, ఆవిరినీళ్ళు దాని మీద పడి చిన్న శబ్దం వస్తుంది. అంటే—ఆపం సిద్ధమయిందన్న మాట. దాన్ని తీసేసి, ఇంకోటి వెయ్యాలి. ఇందులో పులుసు, కుర్మా ఏదైనా వేసుకుని తినవచ్చు....మాంసాహారులైతే, కోడి కుర్మా, చేపల పులుసులతో తినవచ్చును.

—మంగతాయారు, బొబ్బిలి

తెలుగు వారికి తెలియనివి, తెలుగు వారివి కానివీ ఎన్నో వంటలున్నాయి. తొలినుంచి 'వనిత'లో అలాంటివే చెబుతున్నాము. అటువంటివి మీకు కూడా ఏదైనా తెలిస్తే—రాసి పంపవచ్చును. ఆంధ్రేతర రాష్ట్రాలలో వున్నవారయితే, ఆ ప్రాంతాలవారు ఇష్టంగా చేసుకునే వంటలు తెలిస్తే—అవీ రాసి పంపవచ్చును. ఫోటోలు పంపనవసరం లేదు. విధానం మాత్రం—వివరంగా రాసి పంపాలి. ప్రచురింపబడే ప్రతి వంటకానికీ పారితోషికం కూడా పంపిస్తాము.

ప్రకటించిన ప్రకారం 'శ్రీ మహాలక్ష్మి' వర్ణచిత్రం ఈ సంచికలో రావలసివున్నది. కారణాంతరాలవల్ల ప్రచురించలేక పోయినందుకు విచారిస్తూ—త్వరలోనే ప్రచురింపబడగలదని తెలియజేస్తున్నాము—వ. సం.

పాఠకులకు ఇదొక చిన్న పరీక్ష!

ఏమిటంటే—

ఇక్కడో చిన్న కథ వుంది—పిట్ట కథ. ఆ కథ చదవండి—మీరు చెప్పవలసిందేమిటో అర్థమవుతుంది. చక్కగా చెప్పగలిగిన వారికి చిన్న బహుమతి కూడా పంపబడుతుంది।

ఒక రాజుగారు, రాణీగారూ కొంతమంది భటులతో కలిసి విహార యాత్రకు వెళ్ళారు. రాజుగారు, రాణీగారూ ఒక చెట్టు కింద వున్న నీడలో విశ్రాంతి తీసుకుంటూ వుంటే—తెచ్చిన భోజన పదార్థాలూ, తక్కిన సామగ్రీ అన్నీ అక్కడ వుంచి భటులంతా స్నానాలు చేసి వస్తామని వెళ్ళారు. పక్కనే వున్న ఒక చెట్టు మీద అందమైన ఒక పిట్ట కనిపించింది. అలాంటి పిట్ట తనకు కావాలని రాణీగారు పట్టు పట్టింది. అక్కడి నుంచి, కొన్ని గజాల దూరం వెళ్తే—అలాంటి పిట్టలన్నీ అక్కడే నివసిస్తాయనీ, తాను వెళ్ళి తెస్తాననీ రాజుగారు లేవబోయాడు. అయితే, తను ఒంటరిగా వుండలేనని రాణీగారు అన్నది. ఆమెనే వెళ్ళమంటే—ఒంటరిగా వెళ్ళలేనన్నది. ఇద్దరూ కలిసి వెళ్ళాలంటే—ఇక్కడ భోజన పదార్థాలూ, తక్కిన ఖరీదైన పటాటోపం వున్నాయి. వదిలేసి వెళ్తే—ఏ దొంగలయినా ఎత్తుకుపోవచ్చు. భటులు వచ్చేవరకూ ఆగాలంటే—సాయంకాలమైపోతుంది. సాయంకాలమైపోతే, అప్పుడు ఇహ పిట్టలు వుండవు. మరి ఏంచెయ్యాలని—ఇద్దరూ కలిసి కొంతసేపు ఆలోచించి, ఒక నిర్ణయానికొచ్చారు. ఆ నిర్ణయం ఏమిటి? ఆ సమస్యను వాళ్ళు ఎలా పరిష్కరించారు?—మీరు కార్డు మీద ఐదు, ఆరు వాక్యాలకు మించకుండా రాయాలి. అందరికంటె ఎవరు సందర్భోచితంగా, సమయస్ఫూర్తిగా జవాబు రాయగలుగుతారో వారికే బహుమతి పంపబడుతుంది. కార్డు మీద—'చిన్న పరీక్ష' అని రాసి 'వనిత' చిరునామాకు ఈ నెలాఖరులోగా అందేలా పోస్టు చెయ్యాలి.

సమాధానం—ఫిబ్రవరి **15** వ తేదీ సంచికలో :

గోష్ఠి:

"ఒక రెండేళ్ళపాటు మన విద్యా విధానాన్ని వాయిదా వేసి, విద్యావంతులైన యువతీ యువకులను గ్రామీణ ప్రాంతాలకు పంపి వారిచేత గ్రామస్థులకు విద్యా జ్ఞానమూ, ఆరోగ్యకరంగా బతకడానికి కావలసిన పరిజ్ఞానమూ కల్పించితే దేశాభివృద్ధికి అదెంతగానో దోహదం చెయ్యగలదు. నిరక్షరాస్యత రూపు మాసిపోతే – దేశం ముందంజ వెయ్యడం త్వర త్వరగా సాగగలదు!'' అన్నారు అఖిల భారత మహిళా సమాఖ్య (ఆల్ ఇండియా విమెన్స్ కాన్ఫరెన్స్) అధ్యక్షురాలు శ్రీమతి లక్ష్మీ రఘురామయ్య – 'వనిత' జరిపిన గోష్ఠిలో మాట్లాడుతూ.

అఖిలభారత మహిళా సమాఖ్య – ఇటీవలే తమిళనాడులోని సేలంలో స్వర్ణోత్సవం జరుపుకుంది. సేలంలోని శ్రీ శారదా కాలేజ్ ఫర్ విమెన్ ఆవరణలో సాగిన ఈ కార్యక్రమంలో అంశంగా అఖిలభారత మహిళా సమాఖ్య 44వ వార్షిక సమావేశం జరిగింది. దాంతోపాటు అఖిల భారత మహిళా సమాఖ్య–యునెస్కో, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ విమెన్ (ఐ. ఏ. డబ్ల్యూ) లతో కలిసి 'చక్కని భవిష్యత్తు కోసం జీవిత పర్యంతం విద్యను విస్తరించడం' అన్న అంశం గురించి ఆసియా ప్రాంతీయ సమావేశం కూడా ఏర్పాటు చేసింది.

ఈ సమావేశాలలో స్త్రీలకు సంబంధించిన వివిధ సమస్యల గురించి చర్చలు సాగాయి. స్త్రీ జనోద్ధరణ గురించి ఇప్పటిదాకా దేశంలో సాగిన, ఇకముందు సాగవలసిన కృషి గురించి ఎందరో ప్రముఖులు కూలంకషంగా చర్చలు జరిపారు. భవిష్యత్తులో సమాఖ్య అనుసరించదగ్గ విధానాల గురించిన నిర్ణయాలు చేశారు. స్త్రీల సర్వతోముఖాభివృద్ధి కోసం అనుసరించదగ్గ కార్యక్రమాలను ప్రభుత్వానికి తెలియజేసే ఉద్దేశంతో కొన్ని నిర్ణయాలు చేశారు.

సేలం మహాసభలలో చేసిన నిర్ణయాల గురించి ప్రస్తావిస్తూ ''వివాహం చేసుకున్న స్త్రీలకు ఆస్తి హక్కుకు సంబంధించినంత వరకు పురుషుడితో సమానమైన స్థాయిలేదు. ఇందు వల్ల చాలామంది స్త్రీలు తమకు చట్టప్రకారం చెందవలసిన ఆస్తి మీద హక్కు సంపాయించ లేకపోతున్నారు. వివాహితలకు, మైనర్ పిల్లలకు ఇందువల్ల అన్యాయం జరుగుతున్నది. ఈ విషయమై చెయ్యదగ్గ కృషిని గురించి నిర్ణయించడానికి న్యాయవాదులు, పార్లమెంటు సభ్యులు మొదలైన వారు సభ్యులుగా గల ఒక సంఘాన్ని నెలకొల్పాలని నిర్ణయించాము. మన దేశంలోని ముస్లిం స్త్రీలకు చాలా అన్యాయం జరుగుతున్నది. ముస్లిం పురుషులకు ఉన్నన్ని హక్కులు ముస్లిం స్త్రీలకు లేవు. ముస్లిం స్త్రీల బాగోగుల గురించీ, ముస్లిం సాంఘిక సూత్రాల గురించీ పరిశీలించి ముస్లిం స్త్రీల పురోభివృద్ధికోసం అనుసరించదగిన కార్యక్రమం గురించి తెలుసుకోవడానికి ముస్లిం స్త్రీల సంఘం ఒకటి నెలకొల్పాలని నిర్ణయించాము. దేశవ్యాప్తంగా స్త్రీల పురోగతిని ఉద్దేశించి స్త్రీలకు సంబంధించిన జాతీయ సంఘాన్ని నెలకొల్పినందుకు ప్రధాన మంత్రినీ, పిల్లలను దత్తత

తీసుకునే విషయానికి సంబంధించిన బిల్లును పాస్ చేసినందుకు కేంద్ర న్యాయశాఖమంత్రినీ అభినందిస్తూ నిర్ణయాలు చేశాము. 'స్పెషల్ మారేజెస్ ఆక్ట్'ను సవరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఒక నిర్ణయం చేశాము. పట్టణ ప్రాంతాలలోని ఉద్యోగినుల సమస్యల గురించి పరిశోధనాత్మకంగా తెలుసుకోవాలనుకున్నాము. భారత దేశంలోని వివిధ విశ్వ విద్యాలయాల వారిని – వనితల సంఘం ఒకటి నెలకొల్పి దాని ద్వారా స్త్రీల విద్యా విధానాన్ని పరిశీలించి, అందులో చెయ్యదగ్గ మార్పుల గురించీ సంస్కరణల గురించీ కృషి చెయ్యవలసిందిగా కోరాలనుకున్నాము. ఢిల్లీలోని లేడీ ఇర్విన్ కళాశాలను విశ్వ విద్యాలయ స్థాయికి పెంచమని ప్రభుత్వాన్ని కోరాలనుకున్నాము'' అన్నారు శ్రీమతి లక్ష్మీరఘురామయ్య.

మొత్తం మీద వివిధ అంశాల గురించి ఈ సమావేశంలో ఎన్నో నిర్ణయాలు చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

అఖిల భారత మహిళా సమాఖ్య భావి కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ ''1977ను ప్రముఖ వనిత శ్రీమతి మార్గరెట్ కజిన్స్ శత జయంతి సంవత్సరంగా జరపాలని మేము నిర్ణయించాము'' అన్నారు ఆమె.

''ఆగ్నేయ ఆసియా ప్రాంతంలోని దేశాలకు చెందిన స్త్రీలలో చాలామంది నిరక్షరాస్యులు. అవసరమైనంత చదువు నేర్చుకోవడానికి, నిత్య జీవితాన్ని ఎదుర్కోవడానికి–వాళ్ళకు అవకాశాలు చాలా తక్కువ. అందువల్ల ఈ స్త్రీలకు విస్తృతమైన విద్య నేర్పడం చాలా అవసరం. వాళ్ళను విద్యావంతులుగా చేసి వారిని సాంఘిక, జాతీయ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేలా చెయ్యడం అవసరం. ఈ ఉద్దేశంతోనే యునెస్కోతోను, ఐ. ఎ. డబ్ల్యూతోనూ కలిసి సమావేశాన్ని జరిపాము'' అన్నారు శ్రీమతి లక్ష్మీరఘురామయ్య.

''ఈ సమావేశంలో బంగ్లాదేశ్ ప్రతినిధులు నలుగురు, శ్రీలంక ప్రతినిధులు ఇద్దరు, ఐ. ఏ. డబ్ల్యూ ప్రతినిధి శ్రీమతి హిల్డా ట్వీడీ, కామన్‌వెల్త్ హ్యూమన్ ఎకాలజీ కౌన్సిల్‌కు సెక్రటరీ జనరల్ అయిన శ్రీమతి జెనా దేష్–పాల్గొన్నారు. వీరుగాక భారతీయ ప్రతినిధులు ఇరవై మంది పాల్గొన్నారు'' అన్నారు ఆమె.

అఖిల భారత మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి లక్ష్మీరఘురామయ్యతో

ఈ సమావేశానికి శ్రీమతి లక్ష్మి రఘు రామయ్య డైరక్టరుగాను, డాక్టర్ రాజమ్మాళ్ పి. దేవదాస్ వ్యవహ ర్తగాను, శ్రీమతి వై. జి. పార్థసారథి సమన్వయక ర్తగాను వ్యవహరించారు.

"ఆగ్నేయ ఆసియా ప్రాంతంలోని దేశాలకు చెందిన స్త్రీల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ సమావేశ కార్యక్రమాలను నిర్వహించాము. ఐ. ఏ. డబ్ల్యూ సమకూర్చిన ప్రాతిపదికపై సాగిన ఈ సమావేశంలో ఒక్కొక్క రోజును – ఈ ప్రాంతంలోని ఒక్కొక్క దేశానికి సంబం ధించినదిగా తీసుకున్నాము. ఆయా దేశాల ప్రతి నిధులు ఆ సమావేశాలలో పాల్గొన్నారు. ముందు గానే నిర్ణయించుకున్న అంశాలగురించి 'పేపర్స్' చదవడం, ఆ తర్వాత ఆ పేపర్లలోని అంశాల గురించి చర్చించి – కొన్ని సిఫార్సులు చెయ్యడం జరిగాయి" అన్నారు ఆమె.

ఈ సమావేశంలో చర్చింపబడిన అంశాల గురించి వివరిస్తూ శ్రీమతి లక్ష్మి రఘురామయ్య "వయోజన విద్య, స్త్రీల అక్షరాస్యతకు సంబం ధించిన అవసరాలను పురస్కరించుకుని స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర ఎలా ఉండాలో చర్చించడం జరిగింది. స్త్రీల హక్కులు, అవసరాలు, సమస్యలు మొదలైనవాటి గురించీ; సాంఘిక పరిస్థితులలోను జీవన పరిస్థితులలోను వచ్చే మార్పుల విషయంలో శ్రద్ధ చూపవలసిన తీరు గురించీ; వయసును, విద్యను పురస్కరించుకుని స్త్రీలు కూడా దేశాల పరిపాలనలో పాల్గొనడాన్ని ప్రోత్సహించడానికి అనువుగా విద్యా కార్యక్రమాలు తలపెట్టడం గురించీ కూడా చర్చించడం జరిగింది" అన్నారు.

"చదువుకున్న స్త్రీలు నిరక్షరాస్యులైన తమ సాటి సోదరీమణులకు సాయపడడం ఎంతైనా అవసరం" అంటారు ఆమె.

అఖిలభారత మహిళా సమాఖ్య ఈ యాభై సంవత్సరాలలోనూ ఏం చేసింది? ఏం చేస్తున్నది?

"స్త్రీలలో వాళ్ళ సాంఘిక స్థాయికి సంబం ధించిన విస్తృతమైన జ్ఞానం కలిగేలా చెయ్యడానికి సమాఖ్య పాటుపడుతున్నది. సాంఘిక దురాచారా లనూ, సాంఘిక అసమానతలనూ తొలగించడానికి కృషి చేస్తున్నది. స్త్రీల అభివృద్ధి కోసం ఎన్నో అవకాశాలు కల్పించడానికి ప్రయత్నిస్తున్నది. సాంఘికమైన మార్పు రావడానికి అవసరమైన చైతన్యాన్ని కలిగించడానికీ; జాతీయసమైక్యతను, అన్ని రంగాలలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడానికి నిర్విరామంగా పనిచేస్తున్నది" అన్నారు శ్రీమతి లక్ష్మి రఘురామయ్య.

దేశంలోని వివిధ భాగాలలోనూ స్త్రీల పురోగతి కోసం రకరకాల కార్యక్రమాలు అమలుజరిపి, రకరకాల వ్యవస్థలు నెలకొల్పడం కూడా సమాఖ్య సాధనలుగా చెప్పుకోవచ్చునంటారు ఆమె.

"దేశం బాగుపడాలంటే గ్రామాలు సంపన్నంగా ఉండాలి. అయితే వివిధ కారణాలవల్ల గ్రామీణ ప్రజలు పట్టణాలకు పరుగు తీస్తున్నారు. ఈ పరిస్థితి మారాలి. అందువల్ల గ్రామాలలోనే వీలైనన్ని ఉద్యోగావకాశాలు లభించడానికీ, అలా అక్కడి స్త్రీపురుషులకు జీవనోపాధి లభించడానికి సంబం ధించిన కృషి జరగాలనీ మా సమాఖ్య వాంఛిస్తు న్నది!" అన్నారు ఆమె.

స్త్రీల జీవనోపాధికోసం తమ సమాఖ్య వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని చెప్పారు ఆమె. "అనవసరమైన అనుమానాలూ అపోహలూ స్త్రీలను ముందంజ వెయ్యనివ్వడం లేదు. ఉదా హరణకు పట్టణ ప్రాంతాలలోని కుటుంబ స్త్రీలు ఇల్లు కదలకుండా జీవనోపాధి మార్గాలు అన్వేషించ వచ్చు. బట్టలు కుట్టడం ద్వారా, గుడ్డల మీద రంగులు అద్దడం ద్వారా ఎంతోకొంత సంపా యించవచ్చును. ఈ పనులు చెయ్యడానికి పెద్ద పెట్టుబడులు కూడా అవసరం లేదు. అవకాశ ముంటే తమ ఊళ్ళలోని ఉద్యోగినులైన స్త్రీలకు సాయపడే పనులు చెయ్యవచ్చును. చాలా ఊళ్ళలో ఉద్యోగాలు చేసుకునే స్త్రీల పిల్లలను చూసుకోవ డానికి మనుషులు ఉండరు. అటువంటి ఉద్యోగినుల పిల్లలను చూసుకోవడం కూడా జీవనోపాధికి మార్గం అవుతుంది" అన్నారు ఆమె. "అవ కాశాలు లేవనుకుంటూ నిరాశపడడంకన్నా ఉన్నం తలో అవకాశాలు సృష్టించుకుని, అలా తమ ఆర్థికపరిస్థితిని మెరుగుపరచుకోవచ్చు కదా" అంటారు ఆమె.

"మా సమాఖ్య మళ్ళీ ఏప్రిలులో సమావేశ మవుతుంది. ఈలోగా మేము సేలంలో చేసిన నిర్ణయాలను అమలుపరచడానికి అవసరమైన కృషి చేస్తాము" అన్నారు ఆమె.

ఈ సమాఖ్య కృషి ఫలితంగా స్త్రీలకు సంబం ధించిన చట్టాలు ఎన్నో రూపొందాయి. సమాఖ్య స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని పంపిన సందే శంలో ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ఆ విషయాన్ని ప్రస్తావించి "విద్యా విషయికం గానూ, పరిపాలనా రీత్యానూ మన స్త్రీలు అనుభ వించిన అసమానతను, చట్ట సంబంధమైన లోటు పాట్లను తొలగించడంలో అఖిలభారత మహిళా సమాఖ్య మార్గదర్శకమైన కృషి చేసింది....పట్టణ ప్రాంతాలలోని వనితలను వారి హక్కుల గురించి తెలుసుకొనేలా చెయ్యడమేకాక, గ్రామీణస్త్రీలలో కూడా గొత్త చైతన్యం తీసుకువచ్చింది. స్వాతంత్ర్యం రావడానికి పూర్వం రోజులతో పోలిస్తే ఇప్పట్లో స్త్రీల పరిస్థితి బాగా మెరుగు పడిందనే చెప్పాలి. అయితే స్త్రీలు తమ శక్తికీ, సంఖ్యకూ సరిపడేలా జాతీయజీవితంలో పాల్గొం టున్నారనలేము. కనుక ఈ పోరాటం ఇంకా సాగవలసి ఉంది" అన్నారు.

"స్త్రీల పురోభివృద్ధికోసం ఎంతటి పోరాట మైనా సాగిస్తాము" అంటారు శ్రీమతి లక్ష్మి రఘురామయ్య. ఆమె మాటల్లో ఆ మాటను నిలబెట్టుకోగల ఆత్మవిశ్వాసం ధ్వనించింది! □

పోయినసారి మీ 'వనిత' వాళ్ళు 'సౌందర్య సంచిక' అంటూ, ప్రత్యేకంగా వేసి, "అందాన్ని ఎలా పెంపొందించుకోవాలి? ఏమిటి?" అంటూ కొన్ని వ్యాసాలు వేశారు. అవన్నీ నేనూ చదివాను. బాగానే వున్నాయి. మరి, నన్ను అడిగివుంటే నా చిట్కాలు నేనూ చెప్పి వుండేదాన్నే. ఆ మాటే అడిగితే—"బామ్మగారూ, ఇది ఒకటో తేదీ సంచిక; మీరు పదిహేనో తేదీ సంచికలో గదా వస్తారు" అన్నారు మీ 'వనిత' వాళ్ళు. "ఐతే, సరే—ఇప్పుడు చెబుతే మాత్రం ఏం పోయిందిలే—అలాగే" అన్నాను.



మరి — అందచందాలు కాపాడుకోడానికి నా చిట్కాలు ఏమిటో వింటారా—'ఈ ముసలమ్మ కబుర్లకేంలే' అని ఈసడిస్తారా? ఏం చేసినా సరే, మీ యిష్టంగాని — ముందు నే చెప్పేది చదివి, ఆ తర్వాత మీ యిష్టం వచ్చినట్టు మీరు నిర్ణయించుకోండి.

ఏమ్రోయ్: ఒక్కటుంది! అసలు అందాన్ని కాపాడుకోడానికి కావలసిన వస్తువులన్నీ మన వంట ఇంట్లోనే వున్నాయి. మీకు తెలుసో లేదో! మనం వంటకు ఉపయోగించి, పారేసిన పదార్థాలు కూడా అందాన్ని కాపాడతాయి. మరి ఆ మాట నేను చెబుతే మీకు విడ్డూరంగా వుంటుంది.

అసలు—'అందం కాపాడుకోడం' అంటే—చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోడం అన్నమాట. చర్మం చక్కగా తళతళ మెరుస్తూ ఆరోగ్యంగా వుంటే—ఇహ అందం కోసం తాపత్రయపడే అవసరమేం వుంది? — మనం పాటించే ఈ విధానాలూ అవీ చూసి, విదేశీయులే ఎంతో ముచ్చటపడేవారుట; వాళ్ళూ కొన్ని ఆచరించేవార్ట కూడానూ.

తలకు నువ్వుల నూనె మర్దన చెయ్యడం అన్నది—మనకి పురాతన కాలంనుంచీ వస్తోంది. ఈ మర్దనవల్ల రక్తప్రసారం ఎంతో బావుంటుంది—ఏమనుకుంటున్నారో మరి!

ఇప్పుడు మీరు అవేవో షాంపూలూ అవీ బజార్లో కొని తలలు రుద్దుకుంటున్నారా-దానికంటె మంచిది శీకాయ. శీకాయ వాడకం చవకలో పోతుందనో ఏమో—మీకెవళ్ళకీ అది నచ్చదు. కాని అందులో ఎంత ఆరోగ్యం వుందని! కాసిన్ని బియ్యం, పెసలు, మెంతులూ వేసి శీకాయను మర పట్టిస్తే, ఆ పొడి తలకూ, జుట్టుకూ ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఇంకోటి కూడా వుంది. అన్నం వార్చిన గంజిలో, శీకాయపొడి వేసి కాస్సేపు ఉడకబెట్టి, చల్లారిన తర్వాత తలకు బాగా పట్టించి, రుద్దుకుంటే—శీకాయ చేసే మేలు ఇంతా అంతా కాదు! అలా చేస్తే జుట్టు మెత్తగా పట్టులా ఎదుగుతూ, ఎలా కావాలంటే అలా వంగుతూ అందంగా ఆరోగ్యంగా వుంటుంది. నా మాట అబద్ధమయితే, కొన్నాళ్లు అలా చేసి చూడండి; మీరే రాస్తారు నాకు! జుట్టును, వారానికి ఒకసారి నూనెతో మర్దన చేస్తూ వుండాలి. కొందరు మర్దన చేస్తే జుట్టు వూడిపోతుందంటారు. మరి, ఊరికే అదే పనిగా నూనెతో రుద్దేస్తే వున్న వెంట్రుకలు కాస్తా వూడి వచ్చేస్తాయి. అంచేత, నిదానంగా అరచేతితో మర్దన చెయ్యాలి. గాని, అదేపనిగా తువ్వాలుతో బరబరా తుడిచినట్టు — వేళ్ళతో జుట్టు కలియ బెట్టకూడదు!

ఐందా—ఇహ సబ్బులున్నాయి. ఈ సబ్బులు కొందరి శరీరానికి పడవు. చలికాలం వస్తే ఎవరికీ పడవు. సబ్బుతో స్నానం చేస్తే—చర్మం పగిలినట్టయిపోయి, తెలతెల్లగా కనిపిస్తుంది. దానికి బదులు, సెనగపిండో, పెసరపిండో వేసి, ఒళ్లు రుద్దుకుంటే—చర్మం నిగనిగలాడుతుంది. అంతేకాద్రా — అది చర్మానికి ఎంతో మంచిదికూడానూ.

పుచ్చకాయ సంగతి మీకు తెలుసా? ఎండా కాలం వస్తే ముక్కలుగా కోసుకుని తింటాం. ఎందుకని? అది చలవచేస్తుంది. అది కళ్ళకు ఎంత మంచి చేస్తుందో మీరెరగరు! మీ కళ్లు ఎప్పుడైనా అలిసిపోయినట్టు కనిపించాయనుకోండి—రెండు పుచ్చకాయ ముక్కల్ని తీసి, రెండు కళ్ళమీదా పెట్టుకుని, వెల్తురు రాకుండా వున్న గదిలో అలా కాస్సేపు పడుకుంటే—కళ్లు మామూలు స్థితికి వచ్చేస్తాయి! కళ్ళ మంటలు, నొప్పి లాంటివి వుంటే—అవి కూడా తగ్గిపోతాయి. చూశారా! పుచ్చకాయ రసానికి అంతటి 'చల్లని' గుణం వుందన్నమాట. అంతేకాదు; పుచ్చకాయ రసాన్ని అడపా దడపా ముఖానికి పట్టిస్తూ వుంటే-మొహం మీద వున్న చిన్న చిన్న మచ్చల్లాంటివి మాయమైపోతాయి!

అలాగే మరి, బొప్పాయికాయ వుందా—ఆ కాయ గుణం దానికి వున్నా—దాని పాలకి కూడా మంచి గుణం వుంది. బొప్పాయికాయ నుంచి పాలు వస్తాయి చూడండి—అవి చర్మానికి ఎంతో మంచి చేస్తాయి. అవున్రా — చర్మాన్ని నున్నగా, మెత్తగా వుంచే గుణం ఆ పాలలో వుంది! అలాగే మరి, వేపాకురసం, వెల్లుల్లి

రసం—ఇవి కూడా చర్మానికి మంచి చేస్తాయి.

ఆయితే ఒకటుంది. మన వయసు పెరిగేకొద్దీ చర్మం సడలిపోతూ వుంటుంది; ఎండిపోతూ వుంటుంది. అది ప్రకృతిలోనే వుంది - దాన్ని మనం నివారించలేం. కాని, పైన చెప్పిన సాధనాల్ని మనం ఉపయోగిస్తూ వుంటే, చర్మం ఆరోగ్యంగా వుండడానికి మరి కొంతకాలం వరకూ అవకాశం వుంది. ఈ ప్రకృతిలో వున్న విశేషమైన ఎండ, గాలి, చలి — ఇవన్నీ చర్మానికి శత్రువుల్లాంటివి. ఇవి చర్మ ఆరోగ్యానికి భంగం కలిగిస్తూ వుంటాయి. అందుకని అలాంటివి వాడుతూ, ఎప్పటికప్పుడు చర్మాన్ని రక్షించుకుంటూ వుంటే చాలు.

ఇంకో చిన్న 'టానిక్' లాంటిది చెబుతాను. కమలాపండు తినేసి, దాని తొక్క పారేయకండి. ఎండబెట్టి, పొడిచేసి దాన్ని మీగడలో కలిపి — ఆరారా ముఖానికి రాసుకుంటే అద్భుతంగా వుంటుంది. బిగుసుకుపోతూ, కాంతిహీనంగా కనిపించే చర్మానికి అది 'బలవర్ధక ఔషధం' లాగా పని చేస్తుందన్న మాట.

ముఖం ఎప్పుడైనా, చిటచిటలాడుతూ, చిరాగ్గా వుందనుకోండి. అప్పుడేం చేస్తారో తెలుసా? కోడిగుడ్డులోని పచ్చభాగం వుందా-దాంతో మూడు చిన్న స్పూన్ల తేనె కలపండి. ముందుగా పిండి పెట్టి, ముఖమంతా కడిగేసి, తుడిచేసుకుని, ఆమీదట—తేనె, గుడ్డు ముద్దని పట్టించండి — కళ్ళ చుట్టూ మాత్రం వదిలేయండి; పది నిమిషాలు దాన్ని ముఖం మీద ఆరనిచ్చి, గోరువెచ్చని నీళ్ళతో కడిగేయండి; తర్వాత, తువ్వాలుతో అద్దేయండి — అంతే!

మరి—ఇవన్నీ ఇలా వున్నాయా — తినే ఆహారంలో కూడా చర్మాన్ని రక్షించేవి వున్నాయి. ముఖ్యంగా ఆకుకూరలు. ఇవి ప్రతి వూళ్ళోనూ దొరుకుతాయి, చవకకూడాను. రోజూ ఆకుకూర తినడం — అన్నివిధాలా మంచిది. ప్రతి ఉదయం పరగడుపున సగం నిమ్మకాయ రసం, చెమ్చాడు తేనెతో కలిపి — కాసిన్ని నీళ్ళు కూడా కలిపి — పుచ్చుకుంటే — అది చర్మానికి ఎంత మేలు చేస్తుందో చెప్పడానికిలేదు. ముఖ్యంగా ముఖానికి మంచి కాంతి కలిగిస్తుంది. మరి, నేను చెప్పిన ఈ విధానాలన్నీ ముసలమ్మ కబుర్ల కింద కొట్టి పారేస్తారా — చేసి చూస్తారా? చేసి చూస్తేనే గదా విషయం తెలిసేది—ఏమంటారు?

మంగళ వాద్యాల ముగ్గు

'కళాసాగర్ - వనిత' కలిసి నిర్వహించిన 'మదర్స్ డే'నాడు జరిగిన 'ముగ్గుల పోటీ'లో ముగ్గుపిండితో ముగ్గువేసి పి. సరస్వతీబాయి బహుమతి గెలుచుకున్నారు. ఆమె వేసిన ఈ 'మంగళవాద్యాల' ముగ్గును, పాఠకులకు అందజేస్తున్నాము.

కొత్త ముగ్గులు వెయ్యదలుచుకునే వాళ్ళకు — ఒక ముగ్గు. ఈ ముగ్గు పేరు మంగళవాద్యాల ముగ్గు. ఇది ఎలా వెయ్యాలి?

చుక్కలు, వరుసలు ఒకదాని కొకటి సమాన దూరంలో ఉండేలా 16 చుక్కలున్న 16 వరుసలు పెట్టాలి. అంటే నిలువుగా 16 వరుసలు, అడ్డంగా 16 వరుసలు వస్తాయన్న మాట! వాటిని చిత్రాలలో చూపినట్లు కలిపితే మంగళ వాద్యాల ముగ్గు పూర్తవుతుంది!





అందమైన దుస్తులు

పాత సంవత్సరం వెళ్ళిపోయి కొత్త సంవత్సరం వచ్చింది. పాతకొత్తల మేలు కలయికతో ప్రపంచం సాగిపోతున్నది. ఫాషన్ల విషయం కూడా అంతే! కొత్త ఫాషన్లూ పాత ఫాషన్లూ కలిసి ఎప్పటికప్పుడు 'వస్త్రధారణ'లో మార్పు తెస్తున్నాయి. ఈ పేజీలలో 'కొత్తపాతల మేలు కలయికలు'గా చెప్పుకోదగ్గ దుస్తులు కనిపిస్తున్నాయి.

[39 వ పేజీ చూడండి]

వర్ణ చిత్రాలు:
సత్యకుమార్

కుట్టుపని: అభ్యాసం

వనితా - ఉషా కుట్టుపని బడి

[కుట్టుమెషీన్లు తయారు చేసే ప్రసిద్ధ సంస్థ 'ఉషా'వారి సౌజన్యంతో]

భాగం–బి (ముందువేపు)

బిందువులు 0, 1, 2, 3, 4, 5, 6 భాగం–ఎ లోని బిందువులతో సమానంగా ఉన్నాయి.

7–4 $\frac{1}{2}$ చెస్ట్ + 3" తగ్గింపు భాగం ఎ–లోని (15–4); 7 నుంచి పైకి చదరపు గీత.

8–4 $\frac{1}{2}$ వర్కింగ్ స్కేల్ తగ్గింపు 1"; బిందువు 8 నుంచి పైకి చదరపు గీత.

9–8 $\frac{1}{6}$ వర్కింగ్ స్కేల్ + $\frac{1}{2}$"; 9 నుంచి 10 వరకు పైకి చదరపు గీత; 11, 10 కలపండి.

12–10 భాగం ఎ–లోని (14–12) తగ్గింపు $\frac{1}{4}$"కు సమానం.

13–12 $\frac{1}{4}$"; చూపినట్టుగా 13 నుంచి 10 కి షోల్డర్ సీము షేప్ తియ్యండి.

14–8 1"; 14, 12 కలపండి.

15–7 $1\frac{1}{2}$".

16–15 $\frac{1}{4}$".

17–16 $\frac{1}{2}$"; డ్రాఫ్టులో చూపినట్టుగా బిందువు 14 ద్వారా 13 నుంచి 17 కి ఫ్రంట్ సై యొక్క షేప్ తియ్యండి.

18–2 $1\frac{1}{2}$".

19–18 1".

20–10 $\frac{3}{4}$"; కోటు లాపెల్ యొక్క క్రీస్ లైను కోసం 20, 19 కలపాలి.

21–10 $1\frac{1}{2}$".

22–0 $\frac{1}{6}$ వర్కింగ్ స్కేల్ + $\frac{1}{2}$"; చూపినట్టుగా 10 నుంచి 22కి ఫ్రంట్ నెక్ షేపు తీసి, దాన్ని లాపెల్ వెడల్పు-3" లేదా అభిరుచినిబట్టి ఎక్కువ ఉండేలా పొడిగించండి. డ్రాఫ్టులో చూపినట్టుగా 19 వరకూ లాపెల్ యొక్క ప్రక్క షేప్‌ను కూడా తియ్యండి.

23–2 $\frac{1}{2}$ వెయిస్టు + $3\frac{1}{2}$" తగ్గింపు భాగం ఎ–లోని (18–8)కు సమానం.

24–3 $\frac{1}{2}$ సీట్ + 2" తగ్గింపు భాగంఎ–లోని (19 నుంచి 9).

25–1 (24–3) తగ్గింపు $\frac{1}{4}$"కు సమానం; డ్రాఫ్టులోలాగా బిందువులు 23, 24 ద్వారా 16 నుంచి 25కి ప్రక్క సీము షేప్ తియ్యండి.

26–1 1"; 26, 25 కలపండి.

డ్రాఫ్టులో చూపినట్టుగా 19 నుంచి 25కి ఫ్రంట్–బాటమ్‌లకు షేపు తియ్యండి.

జేబులు :

ఎడం చేతివేపు ఫ్రంటు మీద మాత్రమే చెస్ట్ లైను పైన ఒక్క వెల్ట్ జేబు వెయ్యండి. జేబు ఓపెనింగ్ పొడవు $\frac{1}{4}$ వర్కింగ్ స్కేల్ ప్రకారం ఉండాలి; వెల్ట్ వెడల్పు $\frac{3}{4}$"కు సమానంగా ఉండాలి.

బాటమ్ లైనుకు సమాంతరంగా – వెయిస్ట్ లైన్‌కు దిగువని, ఒక్కొక్క ఫ్రంట్ పైన ఒక్కొక్క కట్ పాకెట్ వెయ్యండి ($\frac{1}{6}$ వర్కింగ్ స్కేల్ + $\frac{1}{2}$" ప్రకారం). $\frac{1}{3}$ వర్కింగ్ స్కేలుకు సమంగా ఉండే జేబు ఓపెనింగు ఫ్రంటు యొక్క వెడల్పుకి మధ్యగా గుర్తించాలి.

డార్టులు

డ్రాఫ్టులో చూపినట్టుగా డార్టులను తీసుకోండి. ఎదర డార్ట్ యొక్క పైభాగం మధ్యగాను, చెస్ట్ పాకెటు ఎత్తుకు $1\frac{1}{2}$" దిగువగాను ఉండి,



బయటి జేబు పైన 1″ పైగా ముగియాలి. సైడ్ - డార్టు బిందువు 8కి 2″ ఎడంగా కుట్టండి. అది కట్ – పాకెట్‌కి ¼″ పైగా, 1″ లోపలికి ముగియాలి.

భాగం–సి (కోట్ స్లీవ్)

సి డి-అనే నిర్మాణ రేఖను గీసి, దాని మీద ఒకచోట 0–అనే బిందువును గుర్తించండి.

1–0 స్లీవ్ పొడవు.

2–1 1½″.

3–0 ¼ వర్కింగ్ స్కేల్ + 1″.

4–3 ½ (3–1) తగ్గింపు ½″ లేదా మోచేతి కొలతను 0 నుంచి 4కి ఉంచండి.

బిందువులు 0, 1, 2, 3, 4 నించి అడ్డంగా చదరపు గీత.

5–0 ⅛ వర్కింగ్ స్కేలు.

6-5 ½ (5-0); 6,3 కలపండి.

7–5 1½″; 7, 6 కలిపి, డ్రాఫ్టులో చూపినట్టుగా బిందువు 6 ద్వారా 7 నుంచి 3 వరకూ స్లీవ్ టాప్ యొక్క షేపును తియ్యండి.

8–4 ¾″; డ్రాఫ్టులోలాగా బిందువు 8 ద్వారా 3 నుంచి 4కి ముంజేతి యొక్క షేప్ తియ్యాలి.

9–1 ½ కఫ్.

10–8 (9-1) + 1″ కు సమానం; డ్రాఫ్టులో చూపినట్టు బిందువు 10 ద్వారా 7 నుంచి 9 కు టాప్ స్లీవ్ యొక్క ప్రక్క సీమ్ షేపును తియ్యండి.

క్రింది స్లీవ్‌కు దిగువ సూచించిన మార్పులను చెయ్యాలి.

12–7 1½″; చూపినట్టుగా 12 నుంచి 9 కి క్రింది స్లీవ్ షేప్‌ను తియ్యండి.

11–12 ⅜″; బిందువు 11 ను బిందువు 12 కంటె ⅛″ ఎక్కువ ఎత్తుగా తీసుకోవాలి; చూపినట్టుగా 11 నుంచి 3 కి షేప్ తియ్యండి. క్రింది స్లీవ్ క్రింది షేప్ యొక్క తక్కినదంతా టాప్ (పై) స్లీవ్‌కు మాదిరిగానే.

భాగం–డి

ఇది ఒక మాదిరి కోట్ స్లీవు; దీని ముంజెయ్యి సీమ్ 1″ లోపలికి ఉంటుంది. గుడ్డ మడత సరిగ్గా ముంజేతి సీమ్ మీదికే వస్తుంది.



భాగం సి–లో చూపినట్టుగా పేపర్ పాటర్న్ ఒకటి తయారు చేసుకుని, క్రింది చేతిని ముంజేతి ప్రక్క కంటె 1″ సన్నంగా కత్తిరించండి. డ్రాఫ్టులో చూపినట్టు ముంజేతి వద్ద టాప్ స్లీవ్ పైన వీలయినంతవరకు వెడల్పును హెచ్చించండి.

భాగం–ఇ (కోట్ కాలరు)

మెడనూ, కోటు ఫ్రంట్ యొక్క లాపెల్ భాగాన్నీ గియ్యండి. క్రీస్-లైన్‌నూ నెక్-లైన్‌నూ ఖండించేది బిందువు O. ఫ్రంట్ యొక్క పొడిగింపబడిన షోల్డర్ సీమ్ లైన్‌ను క్రీస్-లైను కలిసే చోట ఉన్నది బిందువు 1.

2–1 కోటు బ్యాక్-నెక్‌కు సమానం.

3–2 ¾″; డ్రాఫ్టులో చూపినట్టుగా 3 నుంచి O కి కోటు కాలర్, క్రీస్–లైన్‌ల షేపులు తియ్యండి.

4–3 1¼″.

5–3 1½″.

7–6 1¾″.

8–6 ¼″; డ్రాఫ్టులోలా 4 నుంచి 8 కి కాలర్ యొక్క దిగువ షేప్‌ను తియ్యాలి.

9–8 1½″; డ్రాఫ్టులో చూపినట్టు 5 నుంచి 9 కి కాలర్ షేప్‌ను తియ్యండి.

బట్టఅంచనా

(2 పొడవులు + 2 స్లీవు పొడవులు + కొలగజం).

గమనిక :

'వనిత–ఉషా కుట్టుపని బడి' లో కుట్టు మిషన్ స్వరూప స్వభావాల దగ్గరి నుంచి, పకరకాల దుస్తులు కుట్టడం దాకా తెలుసుకున్నాము. ఈ సంచికతో ఈ శీర్షిక పూర్తవుతున్నది. ఇప్పటి దాకా వెలువడినవి కాక 'అంచెల పద్ధతిని బుష్ షర్ట్ తయారీ', 'అంచెల పద్ధతిని ఫ్రాక్ తయారీ' ఎలా చెయ్యాలో వీలువెంబడి 'ఉషా' వారి సౌజన్యంతో ప్రచురించగలము. వ. సం.

విద్యార్థినుల శీర్షిక:

"స్త్రీలకు పురుషులతో సమానత్వం వుండాలా?"

'స్త్రీ పురుషుల మధ్య సమానత్వం ఉండాలి' అని చాలామంది అంటూ ఉంటారు. మరి ఆ సమానత్వం నేతిబీరకాయలో నెయ్యిలా ఉందని చాలా మంది అభిప్రాయం. ఈ సమానత్వం గురించి యువతులు ఏమనుకుంటున్నారు? మద్రాసు ఎతిరాజ్ కళాశాల విద్యార్థినులు ఎన్. మీనాక్షి, రత్నమాల, ఎన్. నళిని, ఎన్. జయంతి, ఎమ్. తిలకవతి, ఉషారాణి – భారతీయ స్త్రీ పురుషుల సమానత్వం గురించి ఇక్కడ ముచ్చటిస్తున్నారు.

"పెళ్ళిపీటల మీద కూడా పెళ్ళికూతురు పెళ్ళికొడుకు ముందో వెనుకో కూచోదు. ప్రక్కనే–సమానంగా కూచుంటుంది. అలా ఉన్నప్పుడు జీవితంలో మాత్రం మనకెందుకు ఆ హక్కు లభించడం లేదు?''— ఈ ప్రశ్న వేసింది ఎన్. నళిని.

''విదేశాలలో స్త్రీ పురుషుల మధ్య సమానత్వం ఉందంటే అందుకు కారణం ఏమిటి? అక్కడి సంఘంలో స్త్రీ పురుషుడికన్నా తక్కువ అన్న అభిప్రాయం లేదు. ఇక్కడ అలాకాదు. బస్సుల్లో కూడా స్త్రీలకు విడిగా సీట్లు ఉంచేశారు. మన స్త్రీలు సమానావకాశాలు కావాలంటున్నారే తప్ప సమానత్వం కావాలనడం లేదని నా భావం .... అదీ కాక మగవాడు ఆఫీసునుంచి ఎంత ఆలస్యంగా ఇంటికెళ్ళినా ఎవరూ పట్టించుకోరు. అదే ఒకమ్మాయి కాస్త ఆలస్యంగా యింటికి వెళ్ళినా తల్లిదండ్రులు సందేహపడతారు. తిడతారు....'' అన్నది ఉషారాణి.

ఇంతలో రత్నమాల అందుకుంది: "ఊరికే సమానత్వం, సమానత్వం అనడం వల్ల ఏ పనీ జరగదు. రేపు మనకు పెళ్ళయి అత్తవారింటికి వెడదామనుకుంటాం. అక్కడ మనకు సమానమైన హక్కులు ఇవ్వలేదనుకుంటాం. అందుకని వెంటనే సమానత్వం గురించి 'లెక్చర్' ఇవ్వడమేనా? అక్కడి పరిస్థితులకు తగ్గట్టు సర్దుకుపోవాలి! బస్సుల్లో మనకు విడిసీట్లు ఉండడాన్ని 'మనకే సౌకర్యం' అని ఎందుకనుకోకూడదు? ఆలస్యంగా వస్తే ఆడపిల్లలను ఎందుకు ఆడిపోసుకోవాలి అని ఉష అడిగింది. పురుషుల కన్నా స్త్రీలు శరీరతత్త్వం రీత్యా బలహీనులన్నది అందరూ ఒప్పుకునేదే. ఆలస్యమైతే ఆడపిల్లకు ఏమయిందో నని తల్లిదండ్రులు భయపడడం–ఆమెమీద వాళ్ళకున్న శ్రద్ధవల్లనే కదా? అందువల్లనే వాళ్ళు తిడతారేమో?''

జయంతి కలగజేసుకుని "ఏం ఆడపిల్లలకు మాత్రం ఆత్మబలం ఉండదా? తమను కాపాడుకోవాలని వాళ్ళకు అనిపించదా? అందువల్ల – ఆడపిల్లలను నమ్మాలి. వాళ్ళను అనుమానించడమో తిట్టడమో చెయ్యకూడదు'' అన్నది.

"వీటిలో ఏదీ సమస్యకాదు. కాకుంటే సంఘంలో మార్పులు రావాలి. అవి మెల్లగా వస్తాయి'' అన్నది రత్నమాల.

''సంఘంలో మార్పులు రావాలి రావాలి అంటే ఎప్పుడు వస్తాయి? ఎలా వస్తాయి? వాటంతట అవే రావుకదా? మనమే ప్రయత్నించాలి''— ఇది నళిని అభిప్రాయం.

"చదువు సంగతే తీసుకోండి. అబ్బాయినీ, అమ్మాయినీ ఒకే స్థాయి దాకా చదివించరు. అబ్బాయి అయితే పెద్ద చదువులు చదవాలి. అమ్మాయిలు చదవక్కరలేదు. ఎప్పటికైనా పెళ్ళయితే అత్తవారింటికి వెళ్ళేదే కదా అని చిన్న చూపు చూస్తారు. నిజానికి రేపటి పౌరులను రూపొందించే వాళ్ళు స్త్రీలే. అందువల్ల ఆడవాళ్ళు ఎంత పెద్ద చదువు చదివితే అంత మంచిదని నా అభిప్రాయం'' అన్నది తిలకవతి.

"మగ పిల్లవాడయితే ముసలితనంలో కూచోపెట్టి తిండి పెడతాడు. ఆడపిల్ల 'ఈడ' పిల్ల కాదు. 'ఆడ 'పిల్ల అన్న అభిప్రాయం మారాలి" అన్నది నళిని. ఆమె మాటల్లో కోపం ధ్వనించింది.

''ఆడపిల్ల అంటేనే 'ఖర్చు చేయించేది!' అన్న అభిప్రాయం సంఘంలో బాగా స్థిరపడిపోయింది!'' అని రత్నమాల అంటే తిలకవతి "అంతేకాదు. ఉద్యోగం చేస్తున్న అమ్మాయికి పెళ్ళయిందనుకోండి. ఆ అమ్మాయి తన జీతాన్ని తన తల్లిదండ్రులకు ఇవ్వడం తప్పట. అయితే మగవాడు మాత్రం ఇవ్వవచ్చు. ఎందుకీ పక్షపాతం? ఆ కుటుంబం ఆ అమ్మాయినే నమ్మి ఉందనుకుందాం. అప్పుడు వాళ్ళగతేం కావాలి?'' అన్నది. మీనాక్షి దాన్ని ఆమోదిస్తున్నట్టుగా తల పంకించి, "మామూలుగా ఆడపిల్లలు పుడితే తల్లిదండ్రులకు విచారం పట్టుకుంటుంది. అలాగే పెళ్ళీడుకొచ్చిన ఆడపిల్లల కష్టాలకు అంతేలేదు. నాకు తెలిసిన ఒకమ్మాయి ఎం. బి. బి. ఎస్ పాసయింది. ఆ అమ్మాయిని పెళ్ళాడడానికి ఒక అబ్బాయి పదివేలు కట్నం అడుగుతున్నాట్ట; అతనూ డాక్టరే. ఇద్దరి చదువూ ఒక్కటే అయినప్పుడు మళ్ళీ కట్నమెందుకో?'' అన్నది.

రత్నమాల ఇందుకు సమాధానం చెబుతున్నట్టు "మగవాడు తన జంటను ఎన్నుకునే స్థితిలోనూ, ఆడది ఎన్నుకోబడే స్థితిలోనూ ఉండడమే ఇందుకు కారణం. అయితే ఇప్పుడిప్పుడే ఈ పరిస్థితి కాస్త మారుతున్నదనుకుంటాను. అయినా చట్టం ప్రకారం స్త్రీ పురుషుల మధ్య 'సమానత్వం' ఉండనే ఉంది....'' అన్నది. ఉష అందుకుంది.

"చట్టంలో ఉంటే ఏం లాభం? సంఘంలో మాత్రం స్త్రీ పురుషుల సమానత్వం అసలు లేదు.

'పెళ్ళిచూపులు' ఎందుకు? ఆడపిల్ల ఇంకా మగవాడు తన్ను చూడడానికి రావడాన్ని అనుమతిస్తూనే ఉన్నది కదా? అది తప్పంటాను నేను. కొందరు–ఆడపిల్లలను అడ్డమైన ప్రశ్నలూ వేస్తూ ఉంటారు'' అన్నది ఆమె.

''ప్రతి ఆడపిల్లా తన గురించి తక్కువగా అంచనా వేసుకోవడమే ఇందుకు కారణం"అన్నది రత్నమాల. ''అదీకాక ప్రతి మగవాడికీ తాను తన భార్యకన్నా ఉన్నతస్థాయిలో ఉండాలన్న భావన ఉంటుంది. దాన్ని వాళ్ళు 'పురుషాహంకారం' అంటారు. ఆడదానికి తన అండ కావాలనుకోవడంలో మగవాడికొక తృప్తి. ఏ ఆడదన్నా 'నాకు మగవాడి అండ అక్కర్లేదు. నా కాళ్ళమీద నేను నిలబడగలను' అన్నదంటే మగవాడి పురుషాహంకారం దెబ్బతింటుంది. అప్పుడు ఆ కుటుంబంలో సమన్వయం కుదరదు. కుటుంబ జీవితం ప్రశాంతంగా ఉండాలంటే సమానత్వం గురించి మాట్లాడకూడదు. అక్కడ సర్దుకుపోవాలి'' అన్నది ఆమె.

అసలు విషయం అదికాదన్నట్టు– మీనాక్షి అభిప్రాయపడింది. ''అసలు ఆడపిల్లల పెంపకంలోనే ఆ ధోరణి ఉంది. ఆడపిల్ల అంటే లొంగి ఉండాలన్నట్టు పెంచుతారు. పెళ్ళాడడానికి వచ్చే అబ్బాయికి అమ్మాయిగురించి అన్నీ తెలుసుకోడానికి అవకాశం ఉంది. ఆ అవకాశం అమ్మాయికెక్కడిది? ఇది ఆడవాళ్ళకు అవమానకరం'' అన్నది ఆమె.

''అలాగే భార్య చచ్చిన మగవాడు మళ్ళీ పెళ్ళి చేసుకుంటే ఒప్పుకునే సంఘం వితంతువు మళ్ళీ పెళ్ళిచేసుకుంటే హర్షించేస్థాయికి ఇంకా ఎదగలేదు" అన్నది ఉష.

భార్యా భర్తలిద్దరూ ఉద్యోగాలు చేసేవారే అయినా. భార్య యిబ్బందుల గురించి భర్త అంతగా పట్టించుకోవడం లేదని రత్నమాల అభిప్రాయపడింది.

''సాంకేతిక విద్యారంగంలో కూడా స్త్రీకి సమానత్వం లేదు. మెడికల్ కాలేజీలలో కూడా స్త్రీలకు ఇన్ని సీట్లేనన్న లెక్క ఉంది. ఏ అమ్మాయన్నా ఇంజనీరింగో చదువుదామనుకుంటే– ఆ అమ్మాయిని చుట్టూ ఉన్నవాళ్ళు నిరుత్సాహపరుస్తారు'' అన్నది తిలకవతి.

తిలకవతి మాటలకు అడ్డువస్తూ ''ఈ ఏడాది ఇంజనీరింగ్ కాలేజీ సెలక్షన్లు చూశావా? దాదాపు 66 మంది అమ్మాయిలు ఇంజనీరింగ్‌లో చేరారు. ఇలా జరగడం మంచిదే'' అన్నది రత్నమాల.

''పురుషుడితో సమానమైన అవకాశాలు తమకు లభిస్తే తాము పురుషులకు ఏమాత్రమూ తీసిపోమని స్త్రీలు నిరూపించగలరు'' అన్నది మీనాక్షి.

''సరే! ఆడవాళ్ళకు పురుషులతో సమానావకాశాలు లభించడం లేదనేకదా స్త్రీలకోసం ప్రత్యేకంగా పత్రికలు కూడా ప్రచురించాల్సి వస్తున్నది?'' అని అడిగింది తిలకవతి.

''ఆడవాళ్ళు శరీరతత్త్వం ప్రకారంగానూ, మానసికంగానూ కూడా బలహీనులని సంఘం ఇంకా భావిస్తున్నది. అది తప్పు. శరీరతత్త్వం ప్రకారం కూడా స్త్రీలు బలహీనులు కారని ఇటీవల ఋజువవుతూ ఉంది. ఈ తేడాలన్నీ త్వరగా నశించాలి"–ఇది ఉషారాణి అభిప్రాయం.

ఇదివిని ''నగర ప్రాంతాలలో ఫరవాలేదు. గ్రామ ప్రాంతాలలో స్త్రీలు తాగుబోతులైన పురుషుల ద్వారా పడే బాధలు చాలా ఉన్నాయి. అలాంటి స్త్రీలకు వారి హక్కుల గురించి తెలియజెయ్యడానికి ప్రభుత్వం పూనుకోవాలి!'' అన్నది మీనాక్షి.

''వర్ణాంతర వివాహాలకు ప్రోత్సాహం కలిగించాలి. అంతేకాదు. అలా ఏ ఆడపిల్ల అన్నా పెళ్ళాడితే ఆమె తోబుట్టువు అమ్మాయి ఎవరన్నా ఉంటే–ఆ అమ్మాయికి పెళ్ళికాదు. అక్కయ్య చేసిన పనికి చెల్లెలు శిక్ష అనుభవించడం ఎందుకు? అదే మగవాళ్ళు చేస్తే ఫరవాలేదు. ఈస్థితి మారాలి'' అన్నది నళిని. ''ఆడపిల్లల పట్ల తల్లిదండ్రుల దృక్పథం మారాలి'' అన్నది తిలకవతి. ''అంతే కాదు. ఆడపిల్లలమీద అనవసరమైన ఆంక్షలు తొలగాలంటే–ఆడపిల్లలు బాగా చదువుకోవాలి. చదువుకున్న ఆడపిల్లలకు ధైర్యం రావాలి. ధైర్యంగా ముందంజ వెయ్యడానికి స్త్రీలకు తక్కిన స్త్రీల ఆదరం, సహకారం కావాలి. అవి లభిస్తే మనం తప్పకుండా మగవాళ్ళతో సమాన స్థాయికి చేరుకోగలం'' అన్నది ఉషారాణి.

ఆమె వాదంలోని ఆశాభావం–తక్కిన అందరి అభిప్రాయాలనూ ప్రతిఫలించింది.

'ఈనాడు మానవతులు సమానవతులు కాగోరుతున్నారు' అన్న ఆధునిక కవి వాక్యం నిజం చెయ్యాలన్న భావం ఆ అందరి అభిప్రాయాలలోనూ వ్యక్తమైంది. □

కళలలో హరికథలు చెప్పడం కూడా ఒక కళ. ఈ కళలో ఎందరో కృషి చేసిన వారున్నారు. అయితే స్త్రీలు–పురుషులున్నంత సంఖ్యలో లేరు. అయినా, ఉత్సాహం వున్న స్త్రీలు కూడా హరికథలు నేర్చుకుని - ఉత్సవాలలోనూ, సభలలోనూ కథలు చెబుతున్నారు.

శ్రీమతి కొలచిన ఇందిరాబాల చిన్నతనంలో భరతనాట్యం నేర్చుకుని, (హరికథకు భరతనాట్య ప్రవేశం కూడా అవసరమే) పన్నెండవ ఏట నుంచీ హరికథలు చెప్పడం ఆరంభించారు. తండ్రిగారైన ఇంద్రగంటి సత్యనారాయణ భాగవతార్‌గారే, ఆమెకు హరికథలు చెప్పడంలో తర్ఫీదు ఇచ్చారు.

ఇందిరాబాల, చాలాచోట్ల హరికథలు చెప్పారు; ప్రశంసలూ బిరుదులూ, సన్మానాలూ, సువర్ణ పతకాలూ అందుకున్నారు. తిరుపతి, భద్రాచలం, సింహాచలం, యాదగిరిగుట్ట, శ్రీకాళహస్తి, పీఠవరం మొదలైన పుణ్యక్షేత్రాలలో ఈమె వార్షికంగా కథాగానం చేస్తూ వుంటారు. స్త్రీ, పురుష కంఠాలను మార్చి మార్చి – కథాగానం చెయ్యడంలో ఈమెకు ప్రత్యేకత వున్నదని – శ్రోతలు చెబుతారు. కాకినాడ శ్రీనివాస సమాజం వారు 'మధుర కథాగాయని', గుంటూరు నటరాజ కథాగాన కళా పరిషత్‌వారు 'కథాగాన నృత్య కళా సరస్వతి'–అన్న బిరుదులు ఇచ్చారు. కొన్ని వూళ్ళల్లో సింహతలాటలు, ఘంటా కంకణాలతో సన్మానాలు జరిపారు. వీరి భర్త హరవాధ్‌బాబుగారు, సంగీత విద్వాంసులు. విశాఖజిల్లాలోని చోడవరం గ్రామంలో వుంటున్న ఈ దంపతులకు ఇద్దరు అబ్బాయిలు సంతానం.

కె. ఇందిర

"రాధక్కా. ఆకలేస్తోంది. ఏదైనా తింటానికి పెట్టవూ" దీనంగా అడుగుతున్న చిన్న తమ్ముడు గోపికి ఏమి జవాబివ్వాలో ఆలోచిస్తోంది రాధ. ఆకలి బాధకు తట్టుకోలేక కడుపులో కాళ్ళు పెట్టుకుని నిద్రపోతున్నారు చెల్లి, తమ్ముళ్ళు. వీళ్ళే కాదు ఆ పెద్ద ఊడల మర్రిచెట్టు నీడలోని చాలా ప్రాణాలు అదేస్థితిలో వున్నాయి. అది నిద్రో లేక శోషో అర్థం కాలేదు రాధకి. వీళ్ళందరికీ ఏ సహాయమూ చెయ్యలేక రాముడికి దండం పెట్టి శిలలా మారిపోయాడు దాసాంజనేయులు — ఆ చెట్టు మొదట్లో.

"అక్కా...ఎదురుగా వున్న మేడ మీద వాళ్ళందరూ ఏమంటున్నారక్కా ఎంతో సేపటినుంచి?" నోరు చప్పరించుకుంటూ అడిగాడు గోపి.

ఎదురుగా వుంది కంట్రాక్టర్ విష్ణుమూర్తి కట్టించిన మూడు అంతస్తుల మేడ. టెర్రస్ మీద వెన్నెల భోజనాలు చేస్తున్నారు ధనవంతులు, నాయకులు, పెద్ద ఉద్యోగస్తులు.

"అమ్మా రాధా, వాళ్ళింట్లో పెళ్ళి విందా జరుగుతోంది? గొప్ప వాళ్ళందరూ కార్ల మీద స్కూటర్ల మీద వచ్చారు?" నస్యం డబ్బీని బొడ్డులో దోపుకుంటూ అడిగాడు తాతయ్య.

"గొప్పవాళ్ళకి పెళ్ళిళ్ళు, పుట్టిన రోజులు, తద్దినాలు రానక్ఖర్లేదు తాతయ్యా. వాళ్ళకి రోజూ ఒక విందే. ఎండిన రొట్టెముక్క దొరక్క మనం ఏడుస్తుంటే తిన్నంత తిని, పారేసినంత పారేస్తారు. వాళ్ళకేం కడుపునిండిన బేరాలు." కసిగా అంది రాధ మేడపైకి చూస్తూ. ఆకాశంలో హాయిగా ఎగురుతున్న చకోరాలను చూసిందిరాధ.

"తాతయ్యా మనం ఆ చకోరాలుగా మారితే హాయిగా ఆకాశంలో ఎగురుతూ వెన్నెలను తింటూ సుఖంగా బ్రతికే వాళ్ళము కదా తాతయ్యా?"

"అవును తల్లీ. ఈ నిరుపేద జన్మకంటే ఏ పక్షిగానో ఏ చెట్టుగానో పుట్టివుంటే బాగుండేది. వీళ్ళను చూస్తూంటే కడుపు తరుక్కుపోతోందే రాధా! రాముడు, కోడలు బ్రతికుంటే మనకీ దుస్థితి పట్టదే నా తల్లీ" చనిపోయిన కొడుకును కోడల్ని తలచుకొని కన్నీళ్ళు తుడుచుకున్నాడు తాతయ్య.

మేడకి ప్రక్కగా వున్న చెత్తకుండీ వైపు చూశాడు గోపి. ఆ చెత్త కుండీ ఎంగిలాకులతో ఎప్పుడు నిండుతుందా అని ఆశగా చూస్తున్నాయి వూర కుక్కలు. ఆ కుక్కలను తోలుతూ కొంత మంది బిచ్చగాళ్ళు కాచుకుని కూర్చున్నారు ఎంగిలాకులకోసం.

"అక్కా. నేను వెళ్ళి రెండు ఎంగిలి విస్తళ్ళను ఎత్తుకుని వచ్చేదా?" ఆత్రంగా అడిగిన గోపిని అక్కున చేర్చుకుంది రాధ బాధతో.

"గోపీ! ఇంత పుట్టుక పుట్టి, అందరి ఎంగిళ్ళు తింటానంటావురా. వాళ్ళు తినగా పారేసిన కోడి కొక్కురాయి ఎముకలను తింటావురా గోపి. ఆకలితో మాడైనా చద్దాము కాని మనకి ఆ ఎంగిళ్ళు తినే బ్రతుకు అక్కర్లేదురా."

చెత్త కుండీ దగ్గర కాచుకుని కూర్చుని వున్న ఎన్నో జతల కళ్ళు మేడపైకి ఆశగా చూస్తున్నాయి విందు ఎప్పుడవుతుందా: ఎంగిలి విస్తళ్ళతో తమ కడుపులు ఎప్పుడు నిండుతాయా అని. వాళ్ళని చూసి పిచ్చిగా నవ్వింది రాధ.

"అటు చూడు తాతయ్యా! పాపం పిచ్చి బిచ్చగాళ్లు, ఎంగిలి విస్తర్లకోసం ఆశగా చూస్తున్నారు. గొప్పవాళ్లు విస్తర్లల్లో భోజనం చెయ్యరు— గాజుప్లేట్లలో తింటారని తెలియదుపాపం ఈ బిచ్చగాళ్ళకి. ఆ మిగిలిన ఎంగిలిని తినేందుకు వాళ్ళ క్రింద పనిచేసే కుక్కలు చాలా వున్నాయి. వీళ్ళకేం మిగులుతుంది మట్టి?" పిచ్చిగా నవ్వుతూ మాట్లాడుతున్న రాధను చూసి ఉలిక్కిపడ్డాడు తాతయ్య. "అమ్మా రాధమ్మా ఎందుకు తల్లీ, అలా నవ్వుతున్నావు?"

"ఏమీలేదు తాతయ్యా! కడుపులు నిండిన వినాయకులే చేరి కడుపులు నింపుకుంటారే కాని వాళ్ళకంటే కొంచెం తక్కువ వాళ్ళకి పెట్టరు. కటిక పేదవాళ్ళకి ఒక పట్టెడు మెతుకులు రాల్చరు. దబ్బెక్కువయి విందులు చేసుకుంటున్నారు వాళ్ళు. పైసా లేక ఆకలితో 'అన్నమో రామచంద్రా' అంటున్నాము. ఎందుకిలా జరగాలి తాతయ్యా దేవుడున్నాడా అసలు?" బాధతోటి, ఉక్రోషంతోటి, అడిగింది రాధ.

"యుగాలనుంచి జరిగే తంతే ఇది తల్లీ. వున్నవాడికే పెడతాడు పై మెట్టులో ఉన్నవాడు. తనకంటే ఒక మెట్టు దిగువలో వున్న వాడ్ని పిలవడు తల్లీ. అది వాళ్ళ గౌరవానికే భంగం. అలాంటిది పాతాళంలోకి దిగజారిపోతున్న మనల్ని పిలిచి పెడతారటే తల్లీ. పిచ్చిరాధమ్మా ఇంకేమీ ఆలోచించక పడుకో—ప్రొద్దుగూకులూ తెగతిరిగావు కూలి డబ్బులకోసం" ఒక చిటికెడు నస్యం పట్టించి చిగురుల బొంతమీద నడుం వాల్చాడు తాతయ్య.

మేడమీద నుంచి పెద్దగా వీనులకు విందుగా పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది. "చీర్స్" అనుకుంటూ బ్రాందీని, విస్కీని గ్లాసుల్లోనింపుకుని ఆడ మగా తేడాలేకుండా త్రాగుతున్నారు. ఆ మైకంలో భార్యనే, భర్తనే భేదం తెలియక ప్రక్కనున్న చేతులను పట్టుకుని ఆ సంగీతానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. అరగంట సేపు భూలోకస్వర్గంలా ఊహించుకున్నారు అక్కడివాళ్ళు. తరువాత అలసటతో కుర్చీల్లో కూలబడ్డారు. ఆ అలసిన ప్రాణాలకి అందించారు ఫ్రూట్ సాలడ్‌లు, ఐస్‌క్రీములు. అవి తింటూ ఆడవాళ్ళందరూ కబుర్లు చెప్పుకోసాగారు.

"మిసస్ మూర్తీ! మీ డిన్నర్ బ్రహ్మాండంగా వుంది. ముఖ్యంగా మీ ఆవకాయ చాలా బాగుంది."

"నిజంగానా! మీ ఇంటికి పంపుతాను ఎంత కావాలంటే అంత. బైదిబై మీరు కట్టుకున్న చీర చాలా బాగుంది. ఎక్కడకొన్నారేమిటి?"

"ఇది మిష్టర్ రాయుడు జపాన్ నుంచి తెప్పించారు. ఖరీదేమంత లేదు. ఒన్లీ ఫోర్ హండ్రెడ్. మీకు కావాలంటే ఇంకో చీర వుంది. ఇస్తాను."

"ఓ. చాలా థ్యాంక్స్. బైదిబై మిసస్ వర్మా: దీపావళికి చీర తీసుకున్నారా?"

"బెనారస్ చీర తీసుకున్నాను. ఎనిమిది వందలు. లేడీస్ అండ్ జెంటిల్‌మన్! ఒక చిన్న విన్నపం. వచ్చే ఆదివారం మా ఇంట్లో జరగబోయే ట్యూబ్‌లైట్ డిన్నర్‌కి మీ అందరు వచ్చి మమ్మల్ని ఆనందింపచేయువలసిందిగా ప్రార్థన."

"అరెరే! నేను పిలుద్దామనుకున్నాను డిన్నర్‌కి. కాని మీరే ఛాన్స్ కొట్టేశారు. ఫరవాలేదు దీపావళి నాడు మా ఇంట్లో జరిగే విందుకు రావలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను." మిసస్ రాయుడు చెప్పగానే అందరూ హియర్, హియర్ అంటూ వండర్‌ఫుల్ అంటూ కరతాళధ్వనులు చేసారు. అందరూ నవ్వుకుంటూ తూలుకుంటూ క్రిందకి వచ్చారు.

ఎవరైనా ఒక పదిపైసలు చేతిలో పడెయ్యక పోతారా అని నుంచున్న గోపికి-కార్లు, స్కూటర్లు తన కలల్లోకి కూడా రాని దూరపు కొండల్లాగా కనిపించాయి. వాటివైపు వింతగా చూస్తున్నాడు. అందరూ తమ తమ వాహనాల్లో కుర్చొని స్టార్ట్ చేశారు. వేటికీ హెడ్‌లైట్లు వెలగలేదు. అన్నీ పగలగొట్టి వున్నాయి. కోపంతో చుట్టుప్రక్కల, ఈ పనిని చేసినదెవరా అని చూస్తున్నవాళ్ళకి అమాయకంగా చూస్తున్న గోపి కనిపించాడు.

"రాస్కెల్! లైట్లన్నీ పగలగొట్టి వినోదం చూస్తూ నుంచున్నావా!" గోపి చెంప ఛెళ్ళు మనిపించారు ఎవరో.

"నేను పగలగొట్టలేదు. ఆంజనేయస్వామి సాక్షిగా పగలగొట్టలేదు." ఏడుస్తూ చెపుతున్న గోపి మరో చెంప ఛెళ్ళుమంది.

గోపి ఏడుపు విని పరుగెత్తుకుంటూ వచ్చారు రాధ, నీల. చిరుగులపాతలు ఆ చిక్కని శరీరాల అందాల్ని కప్పలేకపోతున్నాయి. వెన్నెల్లో మలచిన పాలరాతి విగ్రహాల్లా మెరిసిపోతున్నారు వాళ్ళిద్దరూ.

"ఎవరో చేసిన పనికి మా తమ్ముడ్ని కొట్టడానికి మీకు చేతులు ఎలా వచ్చాయి? ధనం, విద్య వుంటేనే చాలదు. మానవత్వం వుండాలి. అప్పుడే మనిషనిపించుకుంటాడు." కోపంతో మాట్లాడుతున్న రాధ అందమైన అదిరే పెదవులను చూసి పెదవులను తడుపుకున్నాడు కంట్రాక్టర్ విష్ణుమూర్తి. వాళ్ళ అందాన్ని ఆస్వాదించే మగవాళ్ళను చూసింది మిసెస్ మూర్తి.

"ఆడపిల్లలా మీరు గాడిదలా? కొంచెం ఒంటి నిండా బట్ట వుండాలని తెలియదా? బైదిబై ఇలా మగవాళ్ళ ముందు రావడానికి సిగ్గుల్లేవూ మీకు?"

"అయ్యోపాపం, మీకు కావలసినంత నల్ల ధనం వుంది. వందలకొలదీ చీరలున్నాయి. అలాంటి మీరే చాలీచాలని బట్టలతో శరీరాల్ని కప్పుకోలేక అవస్థపడుతున్నారు. ఇక మాలాంటి వాళ్ళ సంగతి ఏమంటారు? పాపం తోటి ఆడదాని



దుస్థితికి అంత జాలి గలిగితే బైదిబై రెండు చీరలు మా ముఖాన పడెయ్యకూడదూ?" వ్యంగ్యంగా అంది రాధ వాళ్ళ వస్త్రధారణను పరికిస్తూ. అక్కడున్న ఆడవాళ్ళందరూ తమ వంక చూసు కున్నారు. అందరూ స్లీవ్‌లెస్, లో-కట్ జాకెట్లు వేసుకున్నారు. బొడ్డుక్రిందకి వుండాలా, వూడాలా అన్నట్లు కట్టుకున్న చీరలు, భుజం మీద వుండటం ఇష్టంలేక క్రిందపడే పమిట కొంగులు—ఈ తీరులో వున్నారు వాళ్ళందరూ. ఆ లావుపాటి శరీరాల ముందు రాధ, నీలలు రెండు లతల్లాగా వున్నారు.

"మూర్తీ! పిల్లలు బలే జోరుగా వున్నాయి. పంజరంలో వుంచి మంచి తిండి పెడితే మజాకు బలేగా పనికివస్తాయి." వర్మ మాటలను ఒక జోక్‌గా భావించి అందరూ గొల్లుమని నవ్వ సాగారు. కోపంతో వూగిపోయింది రాధ.

"మిష్టర్. డోంట్ టాక్ రబ్బిష్. మీకు పనికి వచ్చే బంగారు చిలుకలు ఇన్ని వుండగా మర్రి నీడలో బ్రతికే మాలాంటి పిచ్చుకలు మీకెందుకు? గోపి, నీలా పదండర్రా. వీళ్ళదగ్గర నుంచుంటే లేనిపోని పాపాలు మనకంటుకుంటాయి." చీత్కా రంగా వాళ్ళని చూసి రాధ వెళ్ళింది చెట్టు నీడకి.

కోపంతో మూర్తి మర్రిచెట్టును భస్మం చేసేటట్లు చూసాడు. రాధ చేత తను పొందిన అవమానం గుర్తుకువచ్చి చెంప తడుముకున్నాడు మూర్తి. ఈ మర్రి నీడను చూసుకునేగా వీళ్ళకింత పొగరు. ఈ నీడ లేకుంటే తమ నీడలోకి రాకుండా వుంటాయా పిచుకలు? వర్మ ఒక క్షణం ఆలో చించాడు.

"మిష్టర్ మూర్తీ! మీ అందమైన భవనం ముందు ఈ దెయ్యాల మర్రి ఎందుకయ్యా? ఆ ప్లేస్‌లో ఒక పెద్ద హోటల్ కట్టిస్తాను." గర్వంగా అందరివంకా చూస్తూ కారును స్టార్ట్ చేసాడు వర్మ. చెట్టు క్రింద వుండి ఆ కార్లవంక చీరలవంకా ఆశగా చూస్తున్న నీల కళ్ళు వర్మ మనసును ఆకట్టుకున్నాయి.

"అక్కా! మూర్తిగారి భార్యకి అన్ని చీర లున్నాయి కదా పాతబడ్డ చీరలన్నిటినీ ఏం చేస్తా రక్కా?" అమాయకంగా అడిగిన నీలను చూసి నవ్వింది రాధ.

"పిచ్చి నీలా! పాత చీరలన్నిటినీ స్టీలు సామాన్లవాడికి, ప్లాస్టిక్ సామాన్లవాడికి ఇస్తారే వీళ్ళు. పొరపాటునైనా మనలాంటి వాళ్ళకి పాత బట్టలిస్తే వచ్చే పుణ్యాన్ని దాచుకునేందుకు లాకర్లు లేవు వాళ్ళదగ్గర. అందుకని భయం వాళ్ళకి."

"అక్కా అందమైన చీరలు, భవనాలు, కార్లు విందులు, వినోదాలు మన జన్మలో చూస్తామా అక్కా?"

"కలలో కూడా చూడలేము నీలా మనం. పిచ్చి ఆలోచనలు పెట్టుకోక నిద్రపో. ఓరేయ్ గోపి నువ్వు పడుకోరా!"

గతం జ్ఞప్తికి వచ్చిన రాధకు నిద్రరాలేదు. తండ్రి ఎలిమెంటరీ స్కూలు టీచర్. అయిదుగురు పిల్లలు. ఎస్. ఎస్. ఎల్. సి. చదివిన రాధ, టెన్త్ పాస్ అయిన నీల గుండెల మీద కుంపట్లుగా వున్నారు. రెండేళ్ళ క్రితం శివరాత్రి నాడు కృష్ణస్నానానికి వెళ్ళిన తల్లితండ్రులిద్దరూ కృష్ణలో మునిగిపోయి అన్ని బంధాలను తెంచుకుని శివుని చేరుకున్నారు. దెబ్బయో పడిలో పడిన తాతయ్య మీద పడింది భారం. ఇంటి అద్దె చెల్లించనందున ఇంటి వాళ్లు బయటకు గెంటారు ఏడాది క్రితం. తాతయ్య అర్చన చేసే ఆంజనేయస్వామికి గుడిగా వున్న మర్రి చెట్టు వీళ్ళకి నీడగా మారింది. ఆ పచ్చని

కొత్తది!

అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్ఠమైన

ఆముదము

శుద్ధిచేసినది.
వాసనలేనిది.

మూడు సైజులలో లభిస్తూంది:
50 మిలి
100 మిలి
200 మిలి

అమృతాంజన్ ఆముదము

OBM 3270 5 TG (R)

చెట్టు నీడలో రెండు చింకి చాపలు అడ్డుగా పెట్టుకుని కాలక్షేపం చేస్తున్నారు. రాధ మిషన్ మీద బట్టలు కుట్టి అక్కడక్కడా వంటలు చేస్తూ, కూలీకి పోతూ సంపాదిస్తోంది. రాధ అందం ఆమెకు శత్రువయింది. మిషన్ పని కూడా పోయింది. పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో పసి నిమ్మపండులాగా వున్న నీలను ఎక్కడికీ పంపడం ఇష్టం లేదు రాధకి. ఆకాశానికి అంటుకునే ధరల తోటి వీళ్ళ సంపాదన పోటీ పడలేక పాతాళంలోకి దిగజారిపోయింది. పస్తులు మిగిలాయి వీళ్ళకి. ఏ భక్తుడో దయవుంచి వేసిన దక్షిణ మిగిలింది వీళ్ల కొనుక్కునే ఎండిన బ్రెడ్‌కి. నాలుగు తాటాకులు తెచ్చి గుడిసె వేసుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తుండగా, కంట్రాక్టర్ విష్ణుమూర్తి మూడు అంతస్థుల మేడను మూడు నెలలలో కట్టించాడు. "ధనం మూలం మిదం జగత్" అనుకుంది రాధ. కన్నె ప్రాయంలో కలలు గన్న రాధ ఆ కలల జ్ఞాపకాల్ని వెతుక్కుంటూ నిద్రలోకి జారుకుంది.

తెల్లవారుతోంది. తాతయ్య పాడుతున్న సుప్రభాతం వింటూ లేచింది రాధ. మర్రి నాశ్రయించిన వందల కొలదీ పక్షిగణాలు కిల కిల, కల కల రవాలతో సుప్రభాతం పలికాయి. రెక్కలు విదిల్చి తమ గూళ్ళు, వదలి హాయిగా ఆకాశం లోకి ఎగిరిపోసాగాయి తమ తిండిని అన్వేషిస్తూ. రాధ లేచి కాలకృత్యాలు తీర్చుకుని ఎండిపోయిన రొట్టెలు చౌకగా దొరుకుతాయని తొందరగా నడక సాగించింది టౌన్ లోకి.

ఒక స్కూలు దగ్గిర చాలామంది స్త్రీలు బారులు తీర్చినుంచున్నారు. అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగా దీపావళికి పేద మహిళలకు ఉచితంగా చీర జాకెట్, ధోవతుల చాపు ఇస్తున్నారట మహిళా మండలి వారు. అయిదు వేల మందికి ఇస్తారట. రాధకి చెప్పలేని సంతోష మేసింది. వెళ్ళి క్యూలో నుంచుంది. దాదాపు ఏడు, ఎనిమిది వేల మంది ఆడవాళ్ళు క్యూల్లో నుంచుని వున్నారు. అందరి ముఖాల్లో ఏదో తెలియని సంతోషం, పండక్కి కొత్త చీర కట్టుకుంటామే అనే తృప్తి కనిపిస్తోంది. రాధ హమ్మయ్య అనుకుంది. నీలకి, తనకి రెండు ఓణీలు అవుతాయి, కాస్త ఒళ్ళు దాచుకోవచ్చును. తాతయ్యకి క్రొత్త ధోవతులు వస్తాయి. చలికి కప్పుకోవచ్చు. పాపం తాతయ్య చలికి వణికిపోతుంటాడు. సంతోషంతో కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగాయి రాధకు. ప్రొద్దున్న ఎనిమిది గంటలకు క్యూలో నుంచున్న రాధ సాయంత్రం నాలుగు గంటలకు గమ్యం చేరుకుంది. చీరలు పంచుతున్న మిసస్ మూర్తి రాధను చూసి వ్యంగ్యంగా నవ్వింది.

"అరే, నువ్వూ వచ్చావా? బైదిబై నీకూ కావల్సి వచ్చిందా చీరె?"

"రాబందుల చూపుల బారినుండి శరీరాన్ని కప్పేందుకు కావాలిగా ఏదో చీరె! పట్టు చీరలు, దేవతా వస్త్రాలు లేకపోయినా!" సమాధానం చెపుతూ చిన్నగా నవ్వింది రాధ మిసస్ మూర్తి కట్టుకున్న దేవతా వస్త్రాన్ని చూస్తూ.

ప్రక్కనే కూర్చుని వున్న పంజాబీ ఆవిడతో హిందీలో మాట్లాడుతూ చెప్పింది మిసస్. మూర్తి. రోటీ నహీ, కపడా నహీ మకాన్ నహీ కాని పొగరు చాలవుందని. వచ్చిరాని హిందీలో మాట్లాడటానికి అవస్థపడుతున్న మిసస్ మూర్తిని చూసి నవ్వుకుంటూ గదిలోంచి బయటకు వచ్చింది రాధ.

చీర, జాకెట్టు పీస్‌ను, ధోవతుల చాపును సంతోషంతో గుండెల కదుముకుని గేటు దగ్గిరగా వచ్చింది రాధ. బయట గంటల తరబడి నుంచున్న ఆడవాళ్ళు తమకి చీరలు దొరకవనే భయంతోటి గేటును విరగ్గొట్టి మూక ఉమ్మడిగా లోపలికి వచ్చారు. ఆ త్రొక్కిడిలో చాలామంది స్త్రీలు క్రింద పడ్డారు. వాళ్ళమీదనుంచే మిగతావాళ్ళు లోపలికి పరుగెత్తసాగారు చీరలకోసం. స్త్రీల హాహాకారాలు, గోల, ఏడుపులు అన్నీ సర్దుమణిగే సరికి గంట పట్టింది. త్రొక్కులాటలో చనిపోయిన ఆడవాళ్ళ శవాలను పరికిస్తున్నారు. గాయపడ్డ ఆడవార్ని హాస్పిటల్స్‌కి చేరవేస్తున్నారు. నెమ్మదిగా లేచింది రాధ. అణువణువునా బాధ. గుండెల్లో విపరీతమైన నొప్పి. నోటిలోంచి రక్తం వస్తోంది. ఏదో తెలియని మైకం ఆవరిస్తోంది రాధను. తను హాస్పిటల్ పాలవకూడదు. వెళ్ళాలి. నెమ్మదిగా బయటకు వచ్చింది రాధ. తన ప్రక్కగా నుంచున్న నిండు నెలల గర్భిణీ స్త్రీ చనిపోయింది. రాధ మనసు బాధతో మూలిగింది. ఒక చీర కోసం ప్రాణాలు పోగుట్టుకున్నారు చాలామంది. దేవుడెక్కడ? ప్రశ్నించుకుంటూ తూలుకుంటూ తన గూటిని చేరుకోవడానికి తడబడుతున్న అడుగులతో నడక సాగించింది. "ఆంజనేయా! నన్ను తొందరగా చేర్పించు, నీలకి ఈచీర ఇవ్వాలి. తాతయ్యకి ధోవతుల చాపుఇవ్వాలి. దీపావళినాడు క్రొత్త బట్టలు కట్టుకుంటారు. నేను వెళ్ళాలి. ఆంజనేయా నాకు శక్తినివ్వు. వాళ్ళకిచ్చిన తరువాత నీలో ఐక్యం అయినా ఫరవాలేదు."

మర్రిచెట్టు దగ్గరకు అతి కష్టంగా చేరుకున్న రాధ అక్కడి దృశ్యం చూసి బాధతో కెవ్వున అరచింది. ఎన్నో వేల పక్షులకు ఆశ్రయమిచ్చిన



'ఉత్తమ చిత్ర కథా రచయిత్రులు ('76)గా ఆంధ్ర ప్రభుత్వం చేత నిర్ణయింపబడిన శ్రీమతి కె. రామలక్ష్మి, ('జీవనజ్యోతి') శ్రీమతి యార్లగడ్డ సరోజినీదేవి ('మావూరి గంగ') గార్లను ఇటీవల విజయవాడలో వున్న తొమ్మిది మహిళా సంస్థలు కలిసి ఘనంగా అభినందించాయి. శ్రీమతి వి. కోటీశ్వరమ్మ అభినందన సభకు అధ్యక్షతవహించగా, శ్రీమతులు యమ్. సుబ్బలక్ష్మి. వి. లీలావతీ రాఘవయ్య, మోటూరు ఉదయం, హేమలతాలవణం, మల్లికాంబ, వాణీరంగారావు, వీరమాచనేని సరోజని మున్నగువారు సన్మానితులను అభినందిస్తూ ఉపన్యసించారు.

నవలా సాహిత్యంలో ఉత్తమాభిరుచికే..

జనప్రియ పుస్తకమాల

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

పూజారిణి ... 10.00
సూర్యముఖి ... 7.50
కల్పన ... 6.00
కల్పవృక్షం ... 6.00
దిక్చక్రం ... 6.00
నందనవనం ... 11.00
బృందావనం ... 7.50
దివ్య దీపావళి ... 7.50
శాంతి నికేతన్ ... 10.00
చక్రనేమి ... 10.00
శంఖుతీర్థం ... 10.00
ధర్మచక్రం ... 8.00
చక్రవాకం ... 7.50
చక్రభ్రమణం ... 6.00
ప్రేమనగర్ ... 6.00
భాగ్యచక్రం ... 9.00
బదనిక ... 6.00
శోభకృతు ... 6.00
సుప్రభాతం ... 6.00
సంసారచక్రం ... 6.00
కళ్యాణ మందిర్ ... 6.00
పెళ్లి ఎవరికి! ... 6.00
అనిర్వచనీయం ... 6.00
తీయని శాపం ... 6.00

పరిమళా సోమేశ్వర్

అహం - అనురాగం ... 7.50
దర్పణం ... 8.00
వలయం ... 10.00
తెల్లకాకులు ... 6.00
లవ్ మ్యారేజ్ ... 7.50
గాజు పెంకులు ... 7.50
పిల్లలతో ప్రేమయాత్ర ... 6.00
సుగంధి ... 8.00
నర్తకి ... 8.00
తప్పటడుగు ... 6.00
ప్రణయ జీవులు ... 6.00
ఈతరం స్త్రీలు ... 7.00

వాసిరెడ్డి సీతాదేవి

ధర్మక్షేత్రం ... 6.00
బంధితుడు ... 6.00

అరవింద

అవతలి గట్టు ... 9.00
పగిలిన ప్రతిమ ... 8.00
నీరజ పెళ్లి ... 7.50
పొగమబ్బులు ... 6.00

నిరుద్యోగి

కార్యాలయ భేతాళ
విక్రమార్కీయం ... 4.00
ఏడడుగులు ... 4.00

చిట్టారెడ్డి సూర్యకుమారి

పాము-పగ ... 7.50
మహారాణి ... 6.00
ప్రేమకథ ... 6.00
ప్రేమకు శాపం ... 6.00
ప్రతిబింబాలు ... 6.00
వ్యర్థ కుసుమాలు ... 6.00
కన్నె పిల్లలు ... 7.50
ఉదాత్త చరితులు ... 6.00
పరిభ్రమణం ... 6.00
మట్టి బొమ్మలు ... 7.50
కవిత ... 5.00

పోల్కంపల్లి శాంతాదేవి

మలిప్రొద్దు రేఖ ... 7.50
మనసు ఒకరికి మనిషి ఒకరికి ... 6.00
ప్రేమబంధం ... 7.50
వెండి అంచు ... 5.00
పత్రిక ... 5.00
నిశిరాత్రిలో నక్షత్ర ప్రభలు ... 6.00
పూజా సుమం ... 5.00

పసుపు తేటి

మల్లిఖార్జున రావు

పక్షులు ... 6.00
సమాంతర రేఖలు ... 8.00

యలమంచిలి ధనలక్ష్మి

బొమ్మరిల్లు ... 7.50
గాజుబొమ్మ ... 5.00
వెలుగు నీడలు ... 8.00
అనురాధ ... 7.00
రాగమయి ... 5.00

కోమలా దేవి

వర్షించే మేఘాలు ... 8.00
ఉన్నత శిఖరాలు ... 8.00

ముత్తంశెట్టి హనుమంతరావు

ఇది త్యాగం కాదు ... 6.00
వ్యక్తిత్వాలు ... 6.00

ఇంకా....

ఆశయాలు - అనురాగాలు .. కోలా మోహనరావు .. 8.00
ప్రశాంతి నిలయం .... బి.వి. రమణారావు 6.00
హెడ్మిస్ట్రెస్ హేమలత ... అవసరాల రామకృష్ణారావు .. 8.00
జీవన వలయం .. అకుల సరస్వతీ బాయి 5.00
మమతల వంతెన ...... ఉమాశశి 6.00
శాపగ్రస్థులు .... రామచంద్రమౌళి ... 6.00
పునరావృతం .... డా॥ పరచూరి రాజారామ్ .. 5.00
పూలు-పడగలు .... సి. కనకాంబర రాజు ... 6.50
ఇంటింటి వంటలు ... శ్రీమతి సూర్యకాంతం .. 7.50
ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామ చరిత్ర ..... ఎన్. ఇన్నయ్య .. 2.50

25 రూపాయలపైన కొన్నవారికి
పోస్టేజీ ఉచితం! V.P. పద్ధతి లేదు!!

NAVRANG

నవజ్యోతి పబ్లికేషన్స్

ఏలూరు రోడ్ ◆ విజయవాడ-2

ఆ మఱ్ఱిచెట్టు, ఏనీడా దొరకని తమలాంటి పేదలకి నీడనిచ్చిన ఆ ఊడలమఱ్ఱి నేల కూలింది! కుప్పలా కూలబడిన రాధనుచూసి పరుగెత్తుకుంటూ వచ్చారు తాతయ్య, తమ్ముళ్ళు.

"అమ్మా రాధా వచ్చావా తల్లీ. మనకున్న ఈ ఆశ్రయం కూడా పోయిందే తల్లీ. మనగతి రోడ్లపాలే అయింది. ఈ ఆంజనేయులు కూడా ఏమి చెయ్యలేక పోయారు. రాయిని పూజించానే ఇన్నాళ్ళు నాకేమి మిగిలింది మట్టి? అరే! రాధా ఏమిటమ్మా రక్తం వస్తోంది నోట్లోంచి? ఒళ్ళంతా గీరుకుని రక్తం కారుతోందీ? ఏమయిందీ? చెప్పమ్మా..."భయంగా అడుగుతున్న తాతయ్యను చూసింది రాధ.

"ఏమీలేదు తాతయ్యా నీలకి చీర తెచ్చాను. నీకు ధోవతులు తెచ్చాను. నీల ఎక్కడ?"

"నీలక్క పెద్ద కారులో ఝుమ్మని పోయింది ఎవరితోటో."

"ఏమిటీ కారులో పోయిందా? ఎక్కడికి పోయింది తాతయ్యా." గుండెను బాధతో అదుముకుంటూ అడిగింది రాధ.

"ఎవరో వర్మట—అతనితో వెళ్ళిపోయింది. ఈ ఉత్తరం నీకియ్యమంది."

"రాధక్కా.

ఈ నీడలేని మనం రోడ్లమీద పడితే మనిద్దరి బ్రతుకులు కుక్క బ్రతుకులవుతాయి. పేదరికం అనే నరకం భరించలేనక్కా. వర్మగారితో వెళ్ళి—స్వర్గం చూస్తానక్కా. ఖరీదైన చీరలు, నగలు, విందులు, వినోదాలు—మనం కలల్లో కూడా చూడలేని స్వర్గాన్ని చవిచూస్తానక్కా. నన్ను క్షమిస్తావు కదూ.

నీల."

"నీలా! నీ అందమైన శరీరాన్ని దాచడానికి ఈ చీర తెచ్చాను చెల్లీ. కాని ఆ శరీరాన్ని అమ్ముకున్నావా నీలా! స్వర్గం అని భ్రమించావు కాని; వాళ్ళు నిన్ను పువ్వులా నలిపి దుమ్ములో పడేస్తారే పిచ్చి నీలా. ఖరీదైన బ్రతుకు కోసం నీ బ్రతుకును, నీతిని, జాతిని వదులుకున్నావా నీలా! ఎందుకిలా చేసావు? ఓ భగవాన్ ఈవార్త వినకముందే నేను చనిపోయి వుంటే బాగుండేది. తాతయ్యా! తమ్ముళ్ళు జాగ్రత్త. మిమ్మల్ని వదలి వెళుతున్నాను తాతయ్యా. ఏచీకూ చింతా లేని ప్రదేశానికి పేదరికం బాధించని చోటికి—అమ్మా నాన్నల దగ్గిరకు. నన్ను క్షమిస్తావు కదూ తాతయ్యా!

విశాఖపట్నం శారదా మహిళా సమాజం (కంచెరపాలెం శాఖ) ఇటీవల ద్వితీయ వార్షికోత్సవాన్ని జరుపుకున్నది. అదే రోజున బాలల దినోత్సవం కూడా జరిగింది. విశాఖపట్నం పోర్ట్ ఛైర్మన్ శ్రీ బి. కె. రావు ముఖ్య అతిధిగా వచ్చారు. శ్రీమతి సీతా బి. కె. రావు—నూతన భవనాన్ని తెరిచారు. మహిళా సమాజం కార్యదర్శిని శ్రీమతి కళా రామకృష్ణ నివేదిక చదివారు. ఈ సమాజం నడుపుతున్న 'డాన్స్ స్కూలు' గురించి, నిర్వహిస్తున్న సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల గురించీ—ఆమె తెలియజేశారు. ఉత్సవంలో పాల్గొని, గెలుపొందిన బాల బాలికలకు శ్రీమతి బి. కె. రావు బహుమతులు అందజేశారు. బాలబాలికల నృత్య నాటికలతో, ఉత్సవం అంతమైంది.

మిమ్మల్ని వదిలి పోతున్నందుకు....అమ్మా" త్రొక్కిడిలో నలిగిన గుండె నీల చేసిన పని విని చితికిపోయింది. నేల కూలిన ఆ వటవృక్షం ముందే కూలి పోయింది రాధ శరీరం. అస్తమిస్తున్న సూర్యుడితోపాటు రాధ జీవితం కూడా అస్తమించింది.

సంధ్యా సమయంలో గూళ్ళను చేరుకునే పక్షులు మఱ్ఱితోపాటు కూలిపోయిన తమ గూళ్ళను, పగిలిన గుడ్లను, చనిపోయిన చిన్న పక్షి పిల్లలను చూసి అరుస్తూ ఆ చెట్టు చుట్టూ ప్రదక్షిణం చెయ్యసాగాయి. పక్షుల గోల, రాధ కోసం తమ్ముళ్ళు, తాతయ్యల ఏడుపులు ప్రతిధ్వనిస్తున్నా ఏ మానవుడూ, ఏ దేవుడూ వినిపించుకో లేదు.

"అమ్మా రాధమ్మా! నీ శవాన్ని కప్పేటందుకు కొత్త గుడ్డ ఎలాగూ నేను తేలేనని తెలిసి, నీవే తెచ్చుకున్నావా తల్లీ ఈ చీర! పోస్లేమ్మా నీవు బ్రతికుండగా నీ శరీరాన్ని దాచుకునేందుకు ఎవరూ చింకి చీరయినా ఇవ్వలేకపోయారు, నీవు చనిపోయే ముందు నీ శవాన్ని కప్పేటందుకు క్రొత్త చీర ఇచ్చారు! సంతోషం తల్లీ. నీవు బ్రతికుండగా తింటానికి ఎండిన రొట్టె దొరకలేదు. చింకిపాతలు కట్టుకున్నావు. పూరిగుడిసెలోను మఱ్ఱి నీడను బ్రతికావు. రాధమ్మా! చనిపోయి స్వర్గాన్ని చేరుకున్నావు తల్లీ. అక్కడే దేవతలతోపాటు చీనిచీనాంబరాలు కట్టుకో, అమృతం తాగు, పుష్పక విమానంలో తిరుగు. అక్కడ సుఖపడు తల్లీ." తాతయ్య వాగ్ధోరణిని ఎవరూ ఆపలేరు.

రాధ అంతిమ యాత్రకు పేదవాళ్ళు సహాయపడ్డారు. కంట్రాక్టర్ విష్ణుమూర్తి తెలియకుండానే రెండు కన్నీటిబొట్లు రాల్చాడు. పోయింది పీడ అనుకుంది మూర్తి ధర్మపత్ని. వర్మ మేడలో పట్టుచీర కట్టుకుని, నగలు పెట్టుకుని అందంగా అలంకరించుకున్న నీల-నిలువుటద్దంలో తన అందమైన ప్రతిబింబం చూసుకుంటే బలిపీఠానికి పోయే బలిపశువు గుర్తుకొచ్చింది. కుడి కన్ను అదరసాగింది.

మరునాడు పేపర్లో పడ్డ వార్త ఇది.

"మహిళా సంవత్సరం సందర్భంగా మహిళా మండలి వారు పేద మహిళలకిచ్చే చీరల కోసం జరిగిన త్రొక్కిడిలో మరణించిన మహిళల సంఖ్య ముప్పై. గాయపడ్డవారి సంఖ్య రెండువందలు."

ఆ సాయంత్రం మహిళా మండలి వారు తమ విలువైన జరీ చీరలను సవరించుకుంటూ మరణించిన మహిళల కోసం సంతాప సభ జరిపారు.

తింటానికి ఏమీ దొరక్క, వుంటానికి స్థలం లేక కాలే కడుపులతో, చిరుగుల పాతలతో రోడ్ల మీద పడి తిరుగుతున్నారు తాతా మనుమళ్ళు. రోడ్ల ప్రక్కగా గోడలమీద, బోర్డ్లమీద అంటించిన రంగు రంగుల సినిమా వాల్‌పోస్టర్స్‌ను చూస్తున్నాడు గోపి.

"తాతయ్యా! "రోటీ, కపడా ఔర్ మకాన్" అంటే ఏమిటి తాతయ్యా?"

"మనలాంటి పేదవాళ్ళకి భగవంతుడు ఇవ్వడం మర్చిపోయిన మూడు వరాలు రా." రాధ, నీలలు జ్ఞాపకం వచ్చి కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు తాతయ్య.

ఈ మూడు కోసం ఆత్మను చంపుకోలేక శరీరాన్ని మట్టికర్పించింది రాధ. ఈ మూడు కోసం ఆత్మను చంపుకుని శరీరాన్ని అమ్ముకుంది నీల.

"మరి వీటికోసం మేము ఏమిచెయ్యాలి?" జవాబు దొరకని ప్రశ్నగా మిగిలింది తాతయ్య మనసులో. □

రోలర్ స్కేటింగ్

ఇటీవల కొంతకాలంగా మన దేశంలోని స్త్రీ పురుషులను విశేషంగా ఆకర్షిస్తున్న క్రీడ – 'స్కేటింగ్.' స్కేటింగ్ మన దేశానికి అపరిచిత మైనదనే చెప్పాలి. అయితే విదేశాలలో–అందులోనూ పాశ్చాత్య దేశాలలో ఎన్నో శతాబ్దాలనుంచీ కూడా 'స్కేటింగ్' ఆట ప్రచారంలో ఉంది.

కాలిజోళ్ళకు తగిలించిన 'స్కేట్స్' అన్న సాధనాలతో ఐస్ మీద కదలడమే–'స్కేటింగ్'. తొలి రోజుల్లో జంతువుల ఎముకల ముక్కలను కాళ్ళకు కట్టుకుని ఐస్ మీద కదిలేవారట। (పాశ్చాత్య దేశాలలో మంచు విపరీతంగా కురిసి, నేలంతా మంచుతో పరుచుకుపోతుంది. ఆ సందర్భాలలో ఆడదగ్గ ఆటలలో ఒకటిగా స్కేటింగ్ కూడా ప్రాచుర్యం సంపాయించింది!)

కాలక్రమాన స్కేటింగ్ చెయ్యడానికి ఉపయోగించే స్కేట్లలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. తక్కిన ఆటలలాగానే స్కేటింగ్ కూడా వివిధ దేశాలకూ పాకింది.

'కాళ్ళకింద నేల జారిపోతుండగా, హాయిగా ఆనందంగా ముందుకు కదలడం ఎంతో బావుంటుంది' అంటారు స్కేటింగ్ నేర్చినవారు.

ఇప్పట్లో స్కేటింగ్ రెండు రకాలుగా సాగుతున్నది. అవి – రోలర్ స్కేటింగ్, ఐస్ స్కేటింగ్.

'రోలర్ స్కేటింగ్' చెయ్యడానికి మంచు పర్వ ప్రదేశంగానీ, ఐస్‌తో నింపిన చోటుగాని అక్కరలేదు. నున్నగా ఉండే సమతల ప్రదేశం ఉంటే చాలు. దానిమీద రోలర్ స్కేటింగ్ చెయ్యవచ్చును. 'రోలర్ స్కేటింగ్'కు ఉపయోగించే స్కేట్లకు చక్రాలు ఉంటాయి. ఆ చక్రాలున్న స్కేట్లను కాలి జోళ్ళకు తగిలించుకుని నున్నని ప్రదేశం మీద సర్రుమని జారిపోతుంటే హుషారుగా ఉంటుంది.

స్కేటింగ్ నేర్చుకుంటున్న వారికి ఈ చక్రాల స్కేట్లను ధరించి కదలడం కాస్త ఇబ్బందిగా ఉంటుంది. మొదట్లో పట్టు కుదరదు. ఒక కాలి స్కేటు ఒక వైపుకి లాగితే, మరో కాలి స్కేటు మరో వైపుకి లాగి–మనిషిని కింద పడేస్తామని బెదిరిస్తుంటాయి. అయితే అలవాటయి, 'బేలన్స్' కుదిరితే స్కేటింగ్ చెయ్యడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. మనదేశంలో కూడా నగరాలలో 'రోలర్ స్కేటింగ్' చెయ్యడానికి తగిన అవకాశాలు ఏర్పడుతున్నాయి.

'ఐస్ స్కేటింగ్'కు ఉపయోగించే స్కేట్లకు చక్రాలు ఉండవు. అయితే వాటికి ఐస్‌ను కోసుకుని, ముందుకు దూసుకుపొయ్యేలా చెయ్యగల కత్తిలాంటి అమరిక ఉంటుంది. జోళ్ళకు 'ఐస్ స్కేట్లు' తగిలించుకుని ఐస్‌మీద స్కేటింగ్ చెయ్యడం పాశ్చాత్యులకు చాలా ఇష్టమైన ఆట. ఈ స్కేటింగ్ చెయ్యడానికి ఉపయోగించే క్రీడా స్థలాన్ని 'రింక్' అంటారు. కెనడాలో 68 వేల చదరపు అడుగుల 'రింక్' ఉంది. జపాన్‌లో కృత్రిమంగా రూపొందించిన 3.8 ఎకరాల వైశాల్యం గల 'రింక్' ఉంది. ఈ రింక్‌లను బట్టి అక్కడ ఐస్ స్కేటింగ్ పట్ల ఉన్న ఆసక్తిని గ్రహించవచ్చును. 'రోలర్ స్కేటింగ్', 'ఐస్ స్కేటింగ్'లలో స్త్రీలు కూడా పురుషులతో సమానంగా పాల్గొని ఎన్నెన్నో విజయాలు సాధించారు.

అక్కచెల్లెళ్ళు ఇద్దరిం ఒక్కసారిగా పెళ్ళి కుదిరింది. పెళ్ళిరోజు కూడా రానే వచ్చింది. ఆ రోజున పెళ్ళికొడుకుల తండ్రి – ఆడపిల్లల తండ్రిని వరకట్నం కావాలని అడిగాడు. ఆ అమ్మాయిలు వెంటనే తమకు కట్నంతో పెళ్ళి వద్దన్నారు. పోలీసులకు కట్నం గురించిన కబురు పంపించారు. పోలీసులు వచ్చేంతలో పెళ్ళికొడుకులూ, వారి బంధువులూ, కాలికి బుద్ధి చెప్పి పలాయనం చిత్తగించారు. మధ్య ప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్‌లో ఇటీవల జరిగిన సంఘటన ఇది।

ఐస్ స్కేటింగ్‌లో 'ఫిగర్ స్కేటింగ్' అన్న భాగం ఉంది. 'ఫిగర్ స్కేటింగ్'లో అంతర్జాతీయ స్థాయిలో పోటీలు జరుగుతూ ఉంటాయి. ఈ పోటీలలో కూడా స్త్రీలు ఘన విజయాలు సాధించారు.

ఫిగర్ స్కేటింగ్‌లో ప్రపంచ స్థాయిలో ఛాంపియన్‌గా పేరు తెచ్చుకున్న తొలి వనిత ఇంగ్లాండుకు చెందిన మాడ్జ్ సైయర్స్. ఆమె 1906–1907లో 'ఛాంపియన్‌షిప్' గెలిచింది। 'ఫిగర్ స్కేటింగ్'లో ప్రపంచ రికార్డు స్థాపించిన వనిత-సొంజా హెనీ. నార్వే ప్రతినిధిగా ఆమె ఒలింపిక్ స్థాయిలో జరిగిన 'ఫిగర్ స్కేటింగ్'లో పాల్గొని 1928, 1932, 1936లో గెలుపొందారు. 1927 నుంచి 1936 మధ్య ఆమె ప్రపంచ ఛాంపియన్‌గా ప్రసిద్ధి గడించారు।

'ఫిగర్ స్కేటింగ్' కాక 'ఐస్ స్కేటింగ్'లో 'స్పీడ్ స్కేటింగ్' అని మరో భాగం ఉంది. ఇందులో కూడా స్త్రీలు వెనుకంజ వెయ్యలేదనడానికి 1957, 58, 62, 65లలో ప్రపంచ స్థాయిలో ఛాంపియన్‌షిప్ గెలిచిన సోవియట్ రష్యా వనిత ఇంగా వారోనినా। 1970, 72, 73, 74లలో ప్రపంచ ఛాంపియన్ అయిన అట్జె క్యూలెన్ డీల్‌స్ట్రా ఉదాహరణలు। సోవియట్ రష్యాకు చెందిన లిడియా స్కోబ్లికోవా 1960 ఒలింపిక్స్‌లో రెండు బంగారు పతకాలు, 1964లో నాలుగు బంగారు పతకాలు గెలిచి 'స్పీడ్ స్కేటింగ్'లో చరిత్ర సృష్టించింది.

మనదేశంలో 'ఐస్ స్కేటింగ్' చెయ్యడానికి తగిన సౌకర్యాలు అన్నిచోట్లా లేవు. అందువల్ల నగర ప్రాంతాలలో కొన్ని చోట్ల కృత్రిమంగా 'ఐస్ రింక్'లు రూపొందించి వాటి మీద స్కేటింగ్ జరపడానికి వీలు కలిగిస్తున్నారు. మన దేశంలో కలకత్తాలో 'ఐస్ స్కేటింగ్' చెయ్యగలవారు చాలామంది ఉన్నారు.

మద్రాసులో 'హోటల్ చోళ'లో ఐస్

స్కేటింగ్ చెయ్యడానికి అనువైన కృత్రిమమైన రింక్ ఉంది.

స్కేటింగ్ – ఆరోగ్య రీత్యా కూడా చాలా మంచిదని స్కేటింగ్ నిపుణుల అభిప్రాయం. 'ఎవరికివారు వాళ్ళ కాళ్ళమీద ఆధారపడి ఆరోగ్య కరంగా ముందంజ వెయ్యడానికి స్కేటింగ్ చక్కగా తోడ్పడగలదు' అంటారు వాళ్ళు!



బస్తీలో సంక్రాంతి

ఎం. కుసుమ

"ఏమండోయ్! పెద్ద పండగొచ్చేసింది!"

"ఆ! ఆ! వచ్చిందొచ్చింది. ఇప్పుడేం? ఇరవై రోజుల్నాడే వచ్చేసింది."

"మరి! మీ వాకిట్లో పేడనీళ్ళు జల్లి, ముగ్గు లెడుతున్నట్లు లేదేం?"

"నయమే! మేముంటున్నది నాలుగు అంతస్తుల మేడ మీదున్న ఓ చిన్న పోర్షన్‌లో. స్లాబ్ మీద పేడ జల్లితే, ఇంటావిడ తంతుంది."

"పోనీ నాలుగిళ్ళవాళ్ళూ కలిసి, ఆ ప్రహరీలోనైనా కాస్త పిండిముగ్గెట్టకపోయారా?"

"ఏమిటీ? పిండిముగ్గేనా? అంటే ముగ్గు పిండితో. ఇదివరకు 10 పైసల కొచ్చేది. ఇప్పుడు శేరు 60 పైసల వరకూ పోయింది గదా! అదయినా నల్లగా, కళా కాంతీ లేకుండా, బొత్తిగా గోడ బెత్తికల పొడిలా ఉంటోంది."

"కాస్త బియ్యప్పిండి కలపాలి మరి!"

"మరే! కిలో రెండున్నర, మూడున్నర పెట్టి కొనుక్కుంటూ, తిండానికే, వెనకాడవలసి వస్తోంటే, ఇక పిండికొట్టి ముగ్గుల్లో కలిపేమంటే, నోట్లో కరక్కాయే! వెదుక్కోవాలిహ కర్రా, ఓ చిప్పా, ఓ జోలేనూ!"

"మీ పిల్లలు గొబ్బెమ్మ లెడుతున్నారా?!"

"ఆవుపేడెక్కడ తెస్తాం? అద్దెకున్న వాళ్ళందరం కలిసి, యింటికో రూపాయిస్తాం — ఈ నెల రోజులూ కాస్త ఆవుపేడ తెమ్మని బ్రతిమాలేమా?—మా పాలు పోసేది, వాళ్ళింట్లోదే బర్రె పేడ తెస్తోంటే, కళ్ళారా చూసి, ఇహ మానేశాం! చెప్పొద్దూ! లేనిపోని పాప ఖర్మం కూడానూ! పిదపకాలం పాడుబుద్ధులూనూ. పేడ కనిపించిందా, ఒక్కోసారి, ఎద్దుపేడా, దున్నపేడా కూడా తెస్తోందట. మా చిన్నాడన్నాడు."

"బాగానే వుంది. మరి బొమ్మల కొలువో!"

"భలేవారండి వదినగారూ! మనిళ్ళే బొమ్మరిళ్ళు! మాటవరసకు నాలుగే కాని, ఈ నాలు గంతస్థుల మేడలోను, పదిళ్ళ వాళ్ళం కాపరా లుంటున్నాం — ఇంటివాళ్ళు కాక! వందలకొద్దీ అద్దెలే గాని, ఇల్లు వసతేదీ? ఒక మనిషింట్లోకి వెళితే, ఇద్దరు బయటకి రావల్సివచ్చే. పొదరిండ్ల వంటి ఇళ్ళలో మనమే ఓ బొమ్మలం! ఇక బొమ్మలెక్కడ పెడతాం చెప్పండి!"

"పోనీ, మీ కూతుర్నీ అల్లుణ్ణీ పండక్కి పిలిచేరా?"

"ఏదో మేం పిలిచాం! కాని రావడానికి వాళ్ళకే ఛార్జీలు అవీ చాలవుట! చిన్న ఉద్యోగమేగా అతగాడికీని. ఇక్కడ గంపెడు సంసారంతో మా పరిస్థితీ అలాగే వుంది. ఛార్జీలెక్కడ పంపం? ఓ 50 రూపాయలు పంపించి బట్టలు కుట్టించుకోమన్నాం!"

"అంతేలెండి! ఏంచేస్తాం? మీ పెద్దబ్బాయి తిరుపతిలో చదువుతున్నాడన్నారుగా? పండక్కి రాడా? మరి!"

"ముందే చెప్పాగదండీ! ఛార్జీ లెక్కడ పోస్తాం? వాడికి గుడ్డలకూడా డబ్బు పంపలేక పోయామీసారి!"

"పోనీ, పండక్కి స్వీట్సు ఏంచేస్తున్నారేం?"

"రామ! రామ! చక్కెర కార్డు పట్టుకుని, క్యూలో నించున్న కుర్రాడికి శోషొచ్చి ఇంటి కొచ్చేసేడు మొన్న. మర్నాడెడితే, చక్కెర స్టాక్ లేదని, ఒక కిలో ఇచ్చి పంపేరుట. బెల్లం అసలే దొరక్కపోతూంటే ఇహ స్వీట్స్ ఏమిటండీ?"

"పోనీ, కారంగా ఏదైనా?"

"నూనె లీటరు 10 రూపాయిల దాకా పెరుగుతోంటేనూ? ఏ పకోడీలో పడేసుకుందామన్నా వెధవది వుల్లిగడ్డలు రూపాయిన్నరా — మళ్ళీ మాట్లాడితే రెండూనూ. ఏ కూర కొందామన్నా, మార్కెట్‌కి వెడితే, కిలో రెండూ, ఒకటిన్నరా. నలుగురున్న వాళ్ళం. ఇంకేమిటండీ తినేది?"

"పోనీండి. ఈ జన్మకింతే! ఓ మంచి గుమ్మడికాయకు ఓ రవ్వంత బంగారం అంటించి సద్బ్రాహ్మణుడికి దానమిచ్చుకుంటే, వచ్చే జన్మకు గుమ్మడిపండంత బంగారం కలుగుతుందిట?"

"మరేం? బంగారమే కద! ఏం భాగ్యం లెండి! దిన వెచ్చాలకి పుస్తె లమ్ముకునే రోజులు రాకుంటే అదే పదివేలు. రోజెలా వెడ్తుందిరా ఈ దిక్కుమాలిన ధరల్తోటీ, అని ఛస్తుంటే, బంగారం దానం చేస్తుందట ఈవిడ! గుమ్మడి 'కాయ' దాకా ఎందుకండీ, ఓ చిన్న చెక్క రెండు రూపాయ లన్నాడొకడు మొన్న మార్కెట్టులో. ఏదో భోగినాడు మంచి గుమ్మడి వండాలంటారుకదాని, ఓ చిన్న చెక్క తెండీ అంటే, 'ఇహ నోర్మూయ్!' అన్నారు మా వారు. అన్నీ తెలిసే అలా అంటావేవిటంటూ. ఇహ! అన్నీ పై జన్మకే వేద్దాం వాయిదాలు."

"ప్చ్! ఏమిటో! మరీ కరువు కాలమొచ్చి పడింది. ఈ మహా పట్నాలలో అన్నిటికీ అంగలార్చడమే లాగుంది సామాన్యుడి బ్రతుకు."

"మమ్మల్నిన్ని ప్రశ్నలు వేసేరు గదా? పండక్కి మీరేం చేస్తున్నారో చెప్పేరుగారేం వదినగారూ."

"హూ! ఇహ మొదలుపెట్టండి. మీ ప్రశ్న పరంపర. నేనూ చెబుతానిక జవాబులు...." ■

లలితకుమారి జవాబులు

కె. కరుణశ్రీ, కరీమ్‌నగర్

మా యింట్లోవున్న కొబ్బరిచెట్టు అయిదు మీటర్ల ఎత్తుకు ఎదిగింది. ఆరు సంవత్సరాలైంది—వేసి. కాని కాండంమీద, అక్కడక్కడ పగుళ్ళు వస్తున్నాయి. దీనివల్ల ఇబ్బంది వుంటుందా ?

ఇలాంటి పగుళ్ళు మామూలుగా వస్తూనే వుంటాయి. చిన్న చిన్న పగుళ్ళయితే పర్వా లేదు కానీ, మరీ లోతుగా రాకూడదు. అలా వచ్చివుంటే, మీవూరి వ్యవసాయ కేంద్రం వారితో సంప్రతించి, చెట్టు వారికి చూపిస్తే, వారు సలహా ఇస్తారు. అలాంటివి, చూడ కుండా సలహాలు ఇవ్వలేము.

వి. సుజాతారాణి, ప్రొద్దుటూరు

నాలుగు సంవత్సరాల క్రితం, మాయింట్లో అశోక చెట్లు వేశాము. నాలుగు అడుగుల ఎత్తు ఎదిగాయి. త్వరగా ఎదగాలంటే ఏంచెయ్యాలి ?

అశోక వృక్షాల్లో రెండు రకాలున్నాయి. ఒక జాతికి – కొమ్మలు వేల్లాడినట్టుంటాయి. ఇంకో రకమైతే, కొమ్మలు పైకి వున్నట్టు వుంటాయి. ఇందులో మొదటి రకం అయితే, తొందరగా ఏదుగుతుంది. మీ యింట్లో వున్నది రెండో రకానికి చెందినదైతే, అది అలాగే నిదానంగా పెరుగుతుంది. మొదట చెప్పిన రకమే అయి, నిదానంగా ఎదుగుతూ వుంటే, అందుకు కారణం మొదట్లో తీసిన గొయ్యి చిన్నదై వుండొచ్చు. అలాంటిదే గనక అయివుంటే, చుట్టూ మరికొంత వెడల్పుగా గొయ్యి తవ్వి. ఎరువు, పశుపెంట వేసి, నీరుపోస్తూ వుండండి.

బి. రత్నకళ, కాకినాడ

మా యింట్లో వున్న కనకాంబరం పువ్వులు ఎర్రగా రావడం లేదు. ఎర్రగా రావాలంటే ఏం చెయ్యాలి? ఆకుల మీద తెల్లగా బూడిదలా పడుతోంది. దానికి నివారణ కూడా తెలియజెయ్యండి.

మీ యింటవున్న మొక్క అలాంటి రంగు దన్నమాట. అది ఏ రంగుకు చెందినదయితే, ఆరంగే వస్తుంది. బూడిద పోవడానికి మెల తియాన్ స్ప్రే చేయ్యండి. (బూడిదలా పడు తున్న మొదటి రోజుల్లోనే)

వై. గాయత్రి, యమ్మిగనూరు

మా పెరట్లో వున్న గులాబి మొక్కలకు, లోగడ బాగా ఎర్రటి పువ్వులు పూశాయి. ఇప్పుడు రంగు మారిపోయి, గులాబిరంగులో వస్తున్నాయి. మునుపటి రంగులోనే రావడానికి ఏం చెయ్య మంటారు ?

ఎరువు తక్కువ కావడంతో రంగు తగ్గి వుంటుందేమో గాని, రంగు మారడానికి అవకాశం లేదు.

వి. శశిరేఖ, విజయనగరం

మా యింట్లో వున్న అరటిచెట్టు, గెలలువేసినా కుళ్ళిపోతున్నాయి. ఆకులూ కుళ్ళిపోతున్నాయి. ఎందువల్లనంటారు ?

అరటి పిలకలు లేచినప్పుడు, వాటిని అక్కడే వుంచి పెంచకూడదు. వేరేచోట, గొయ్యి తీసి ఎరువు వేసి నాటాలి. ఒకచోట గుంపుగా పెరగనివ్వకూడదు. కుళ్ళిపోవడం – నీరు ఎక్కువ కావడం చేత.

కె. గిరిజాదేవి, మాచర్ల

మా యింట్లో ఖర్జూరపుచెట్టు వుంది. ఐదేళ్ళయింది కాని, కాపుకి రాలేదు. కారణం ఏమిటి ?

ఖర్జూరం ఎడారి చెట్టు. మన ప్రాంతాల చెట్టయితే వచ్చిందిగాని, అది కాపుకి రావడం కష్టం. ఆ వాతావరణం వేరు; ఈ వాతా వరణం వేరు. ఇంగ్లాండ్ దేశంలో మామిడి చెట్టు వేసి కాయించగలమా ?

[అందమైన దుస్తులు : 24 వ పేజీ నుంచి]

వర్ణ చిత్రాలలోని మాడల్స్ కొత్తతరహా చీరలూ, స్కర్టులూ ధరించి కనువిందు చేస్తున్నారు.

చిత్రం–1లో ఇద్దరు యువతులు కనిపిస్తున్నారు. వాళ్ళు ధరించిన స్కర్టులు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ స్కర్టులు నూలు గుడ్డలతో రూపొందినవే. వీటి మీద అందమైన డిజైన్లు (చేత్తో 'ప్రింట్' చేసినవి) ఉన్నాయి. ఎడమవైపున ఉన్న అమ్మాయి దుస్తులలో ఎరుపు, నలుపు చక్కగా కలగలిసి ఉన్నాయి. కుడివైపున ఉన్న అమ్మాయి ధరించిన స్కర్టులో నలుపు ప్రధానంగా కనిపిస్తుంది. ఈ నలుపు స్కర్టు సాయంకాలాలపూట ధరించడానికి బావుం టుంది! ఈ స్కర్టుల ధరలు రూ. 50 నుంచి రూ. 70 ప్రాంతాలలో ఉంటాయి.

మేడమెట్లు దిగి వస్తున్న యువతి (చిత్రం – 2 చూడండి) ధరించిన వచ్చరంగు చీర, వచ్చరంగు జాకెట్టు చక్కగా 'మాచ్' అవుతాయి. ఈ చీర కున్న తెల్ల అంచులో కొమ్మల మీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్న చిలుకలు (ప్రింటు చేసినవి) కనిపిస్తాయి. ఈ నూలు చీర ధర రూ. 80 మంచి రూ. 100 దాకా ఉంటుంది.

చిత్రం–3లో ఇద్దరు వనితలు కనిపిస్తున్నారు. ఎడమవైపున ఉన్న ఆమె నీలం, గోధుమరంగులు కలగలిసిన చీర కట్టుకుంది. ఈ చీర మీద ప్రింటు చేసిన డిజైన్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. (ఈ చీర ధర రూ. 185 నుంచి రూ. 225 దాకా ఉంటుంది) కుడివైపున కూచున్న ఆమె వచ్చరంగు షిఫాన్ చీర కట్టుకుంది. ఈ చీరకు సాటిన్ అంచు ఉంది. చీర ధర రూ. 215తో ప్రారంభమవు తుంది. ఈ చిత్రాలలో కనిపించే రెండు రకాల చీరల్లో దేన్నయినా ధరించి దానికి నప్పే జాకెట్టు తొడుక్కుని పార్టీలకో, షాపింగుకో, షికారుకో పోతే బావుంటుంది!

అందమైన గులాబీరంగు ఆర్గంజా చీర ధరించిన యువతి చిత్రం – 4లో కనిపిస్తున్నది. ఆ చీరకు చక్కని పువ్వుల అంచులు ఉన్నాయి. ఈ చీర రూ. 200 మంచి రూ. 250 ధరలలో దొరుకు తుంది.

వర్ణ చిత్రాలలో కనిపించే వస్త్రాలను 'డిజైన్' చేసినవారు శ్రీమతి సబితా రాధాకృష్ణ. ఈ చిత్రా లలో 'మాడల్స్'గా కనిపించేవారు: సంధ్య, కల్పన, అవంతి, కరేన్. ఈ చిత్రాలలోని చీరలు, స్కర్టులూ మద్రాసులోని 'ఊర్వశి' సంస్థ వారు (47 బి, హ్యారిస్ రోడ్, మద్రాసు - 18) రూపొందించారు.

చిన్నగా రెప్పలు పైకెత్తి కలియజూచింది సౌద భర్తను. శరీరం మీద చీమలు పారాడినంత అసహనంగా కదులుతూ, తనవైపు కోరగా చూస్తున్నాడు. అతడి అయిష్టత గమనించి ఇంట్లోకి వెళ్ళడానికి వెనక్కుమళ్ళింది.

"సిస్టర్! మీరూ కూర్చోండి" అన్నారెవరో.

పిలుపు వచ్చినవైపు కనుకొలకుల చివర్లనుంచి చూచింది. అతడు జయప్రద భర్త—ఒక్కక్షణం తటపటాయించి లోనికి నడిచింది సౌద.

తలా ఒక ప్రక్క దెప్పిపొడవసాగారు నిరంజనరావును.

"ఏరా! గంటల తరబడి నా వైఫ్‌తో హస్కు వేస్తావే? నీ భార్యకేమో గోషా వేస్తావా! పిలవరా ఫూల్"

"పరిచయం చెయ్యవోయ్. దిష్టి తగలదుగాని".

19 20 21

శేఖర్ వశకామానికి తను బలి కాకుండా మాధవ్, శ్రీధర్‌లు తనను రక్షించడం, తను విడాకులు తీసుకున్న తర్వాత తల్లి ధోరణి మారడం - రాధకు గుర్తుకు వచ్చాయి. రాధ అన్న శ్రీధర్‌కు కోయంబత్తూరులో ఉద్యోగం లభించింది. రాధను తాను పెళ్ళాడుతానని తన తల్లికి చెప్పాడు మాధవ్. ఆమె దాన్ని వ్యతిరేకించింది. సౌదకు తన భర్త నిజ స్వరూపం తెలియవచ్చింది.

"అంతేరా! తనదాకా వస్తేగాని తెలిదన్నట్లు"

తలా ఒక మాటంటుంటే, గత్యంతరం లేక రూములోకొచ్చి రమ్మని పిలిచాడు నిరంజనరావు.

రానని తల వూపింది.

"చదువుకున్నదానివి. బిడియమైతే ఎలా!" అన్నాడు.

భయం భయంగా అడుగులు వేసుకుంటూ హాల్లోకొచ్చి నిలిచింది. అజంతా శిల్పాన్ని గుర్తుకు తెచ్చేలా వుందామె నిలబడిన తీరు.

ఏం చదివావని, ఏ గ్రూపని, 'హాబీ'లేమిటని తలా ఓ ప్రశ్న వేశారు. నెమ్మదిగా క్లుప్తంగా సమాధానాలిచ్చింది.

ముళ్ళ మీద నిలుచున్నట్లు గడిపి....చిక్కంలో పిట్టలా దూసుకుపోయింది కొంతసేపటికి.

అక్కడి మాటలు స్పష్టంగా వినబడసాగాయి సౌదకు.

"మిస్టర్ నిరంజన్, గెలిచావురా! వండర్‌ఫుల్ లేడీ! గుడ్‌లక్!" ఒకరి గొంతు.

"నిజంగా ఇంత అపురూప లావణ్యవతి అయిన నారీ తిలకం అబ్బుతుందనుకోలేదు" మరొకరి కంఠం.

"ఆనాడేమన్నార్రా మీరు? కళ్ళున్న ఏ ఆడపిల్ల వొప్పుకోదన్లేదూ? అందమైన అమ్మాయిని చేసుకుని తీరుతానంటే, మీసం తీసేస్తానని ఒకరు, చెవికోసుకుంటామని ఒకరు, తలా ఒకటని హేళన చేయలేదట్రా."

అయితే ఓ నగ్న సత్యం బయటపడింది.

అందమైన అమ్మాయి అతణ్ణి ఒప్పుకోనందుకు పంతంగా సాధించుకున్నాడన్నమాట! అంతేగాని ఆదర్శంగా ఓ బీదపిల్లను చేసుకోడం గాని, అందాన్ని ఆరాధించడం గాని కాదు. నిస్పృహ ఆవరించింది....ఛీ....ఛీ ఎంత స్వలాభి! అణువణువూ పరాభవంతో వ్యధతో దహించివేసింది. దుఃఖం పెల్లుబికింది సౌదకు. ఎంత పాపం చేసింది తను? బాధతో మెలికలు తిరిగిపోతున్న సౌద చెంప చెళ్లుమంది.

ఆ హఠాత్పరిణామానికి అదిరిపోయింది సౌద. బాధను గూడా మరిచి మ్రాన్పడిపోయింది. కన్నీళ్ళు గూడా కదలాడలేదు.

జ్యోతుల్లా నిప్పులు చిమ్మే కళ్ళతో తన ఎదటున్న భర్తవైపు చూడలేక రెండు చేతుల్తో కళ్లు గట్టిగా మూసుకుంది.

"నేను లావణ్యవతినని ప్రదర్శించుకోడానికి పిలవంగానే వచ్చి పోజులు పెడుతూ నిలుచుని, బారెడు జడని ముందుకు విసురుకుని, లజ్జా బిడియం లేకుండా, అదీ చాలదన్నట్లు బాతాఖానీకి దిగావు. నీ అవధుల్లో నీ అంతస్తులో నీవుంటే బాగుంటుంది" అన్నాడు తీవ్రంగా నిరంజనరావు.

"మీరేగా. రమ్మన్నారు! అవధులేం అతిక్రమించానని! అంతస్తు అని ప్రతిసారి అనడం ఎందుకూ? ముందే తెలుసుగా మేం పేదవారమనీ. అయినా యిప్పుడు మీ భార్యగా, భాగ్యవంతురాల్ని కాదా! ఎందుకు నన్ను పరాయిదాన్నిగా భావిస్తారు!" ఆవేదన, ప్రాధేయత మేళవించాయి ఆమె కంఠాన.

"ఎదురు చెప్పేదానివయ్యావా?" అని ముందుకు రాబోయాడు.

ఇంతలో ఎవరో పిలవగా....అక్కడి నుంచి వెళ్ళాడు నిరంజనరావు.

తను కావాలని చేసుకున్నందుకు, స్వయంకృతాపరాధం అనుభవించాలి. కళ్లు కాలవలయ్యాయి. గుండెలవిసేలా ఏడ్చేడ్చి ప్రక్కమీద వాలిపోయింది సౌద.

*

ఉద్యోగం చేసే వూళ్ళో కాపురం పెట్టాడు నిరంజనరావు. పుట్టింటి నుంచి కొత్త సంసారానికి కావలసిన పాత్రసామాను ఫర్నిచర్ తెచ్చుకో

రాధ

పొన్నలూరు పద్మావతి

మన్నారు అత్తగారింటివారు.

"ఇవ్వగలిగినవేవో నేనొచ్చేటప్పుడే ఇచ్చారు ఇహ తేవలసినవి లేవు....వాళ్ళిస్తారన్న నమ్మకం లేదు" అని తెగేసి చెప్పింది సౌద.

విసుక్కుంటూ కొన్ని సామాన్లిచ్చింది అత్తగారు.

క్రొత్త కాపరమనే సరదా లేకుండా పోయింది సౌదామినికి....భర్త చేసే అకృత్యాలు ఆమెకు జుగుప్స కలిగించేవి.

కంట్రాక్టర్ల దగ్గర లంచం తీసుకుని కంట్రాక్టు చేసిన పని బాగున్నట్టు సర్టిఫికేట్లు ఇవ్వడం లాంటివి నచ్చేవికావు. ఆ అరాచకాన్ని అరికట్టాలని నచ్చజెప్పబోయేది.

"గవర్నమెంటు సొమ్ము తింటూ దానికి అన్యాయం చెయ్యడమెందుకండీ?....పని బాగుంటేనే చూచి యివ్వచ్చుకదా?" అని తప్పించాలని చూచేది.

"పది డబ్బులు వచ్చేటప్పుడు తీసుకొనకపోతే ఎలా? రేపు పిల్లలు పుడితే కావద్దూ! డబ్బు చేదనేవాడు లోకంలో పనికిరాడు. డబ్బుతో పొందని సుఖాలేం వున్నాయి? ఆ డబ్బుకు ప్రలోభపడేగా నువ్వు చేసుకున్నదీనూ? నా అందాని కన్నా ధనమే ముఖ్యమని నువ్వే రుజువు చేసేవ్... డబ్బుకు లోకం దాసోహం....హ్హా....హ్హా...." విరగబడి నవ్వేడు.

అతడి నవ్వుకు అసహ్యం, ఆవేదన కలిగాయి సౌదకు.

*

ఓసారి సౌదను తనతో క్యాంపుకు తీసికెళ్ళాడు నిరంజనరావు. అక్కడ అందమైన తోటలు, కొండలు, సరస్సులు వున్నాయని, రమ్మని నిర్బంధించాడు.

ఎక్కడికెళ్ళినా ఏదో నెపం మీద నింది స్తుంటాడు గనుక, వెళ్ళాలని సరదా వున్నా రానంది సౌద.

"మేరేజ్ కాకముందు సుందర దృశ్యాలు చూస్తుంటే, సౌందర్యవతైన భార్య ప్రక్కనుంటే బాగుండుననుకునేవాణ్ణి...నా కోసంగాకపోతే నీ లావణ్యం ఏం చేసుకోడానికి?" అన్నాడు నిష్ఠూరంగా.

*

అది షుమారైన పల్లెటూరు. అక్కడికి పల

హారాలు చేయించుకుని తీసికెళ్ళాడు. బ్రాందీ బాటిల్సు తెచ్చుకున్నాడు.

ఆనాడు చీకటిపడి చినుకు లొస్తున్నందున - ఎక్కడికీ తీసికెళ్ళలేదు సౌదను.

ఎవరెవరో వచ్చి మాట్లాడి పోతున్నారు. పాలు, పండ్లు పంపేరు. ఎవరింట్లోనో వంట చేయించి క్యారియర్ పంపేరు.

సౌద స్నానం చేసి, తెల్లని పెద్ద రోజా పూల నైలెక్సు చీర కట్టుకుని మల్లెలు జడలో జారుగా తురుముకుంది.

అక్కడికో ముప్పై ఏళ్ళ వాడొకడొచ్చి కన్నార్పకుండా విచిత్రంగా చూడసాగాడు.

అతడి గమ్మత్తయిన వాలకం చూచి పలకరించింది.

"ఎవరు నువ్వు? ఏమిటలా చూస్తున్నావ్?" అన్నది చిన్నగా నవ్వుతూ.

"అయ్యగారేరి? మిమ్మల్ని వూరికాణ్ణుంచి తోడుకొచ్చింద్రా!" వెకిలిగా నవ్వుతూ అడిగాడు.

"వూర్నుంచంటే...." అన్నది ప్రశ్నార్థకంగా.

"ఈడనే మాట్లాడమనే వోర్లే! నా పని తప్పిపోనాది. ఇహిహి...." అన్నాడు వాడు.

సౌదకు అయోమయంగా తోచాయా మాటలు.

ఇంతలో బాత్ రూములో నుంచి నిరంజనరావు వచ్చేడు.

వాడు చేతులు నలుపుకుంటూ నిలుచున్నాడు.

"నీవు భోజనానికన్నీ సర్దు టేబుల్ మీద" అని ఆదేశించి వరండాలోకి నడిచాడు.

సౌదకు అనుమానం తోచి, వెళ్ళినట్లు నటించి కిటికీ రెక్కమాటున నిలబడి వినసాగింది.

"బాబయ్యా! అన్నీ వుండాయిగా. ఈసారి సరుకంతా బస్తీదే తెచ్చింద్రే!....ఏడకెళ్లి ఎతక్కరానాని ఇచారం బట్టుకుంది....మీకేమో మంచి సరుకు కావాలాయా! పొద్దుగూకి ఏడకెల్లాల్నో అనుకుండా. సారాయయితే.... పట్టిచ్చకొత్తాగాని...ఆడపిల్ల దొరకదే....అని మకా....యిదై పోతుండా!"

"చిన్నగా మాట్లాడ్రా! సారా వద్దు....పిల్ల వద్దు...అన్నీ వున్నాయి....అహహా....హా.... ఆమె....అమ్మగార్రా....పెళ్లైంది తెలీదా? నువ్వు లేవుగా యిటీవల" అన్నాడు నిరంజనరావు.

అప్పటికి సర్వం అర్థమైపోయింది....పెద్దవాళ్ళకుండవలసినవన్నీ వున్నాయన్న మాట.... ఛీ....ఛీ....ఏం మనిషి! ఏవగింపుకలిగిందాతడిపైన. మనసంతా వికలమైపోయింది. అసహ్యం గూడు కట్టుకుంది ఆమెలో.

భోజనాల దగ్గరేం మాట్లాడలేకపోయింది సౌద.

ఆమె మోమున శ్రావణ మేఘాలు చోటు చేసుకున్నాయి. కళ్లు వర్షించేలా వున్నాయి.... ఏలాగో నిగ్రహంగా భోంచెయ్యసాగింది.

"సరదాగా గడుపుదామని వెంటబెట్టుకొస్తే.... చిరాగ్గా ముఖం చిట్లించుకుని వుండడానికా? అలంకరణంతా వూళ్ళోవాళ్లు చూచి మెచ్చుకోడానికా?....ఇంతకంటే ఏ 'మోడల్' అమ్మాయిగానో....ఎగ్జిబిషన్‌లో 'డాన్సర్' గానో చేరితే బావుండేట్టుంది నీకు....ఎప్పుడో నీకా రాతే వుంది....మీ అక్కవుందిగా...మొగుణ్ణొదిలి..."

"ఏవండీ!" పెద్దగా అరిచింది ఆక్రోశంగా సౌద.

"ఏం? వున్నమాటంటే వులుకెందుకూ? దాని చెల్లెలివి గాదూ?....".

"మీరేం చూచి అమెనంటువ్వారు? ఆమెనంటే కళ్లు పోతాయి...."

"అవునవును....భర్త దగ్గరుంటే....ఒక్కడితోనే వుండాలి....లేకపోతే ఎందరితోనైనా తిరగచ్చు....నిజం చెప్పు....ఆ మాధవ్‌తో.... మీ అక్కకు".

ఎగతాళిగా నవ్వేడు నిరంజనరావు.

చెవులు మూసుకుంది సౌద.

కొన్ని క్షణాలు మౌనం రాజ్యం చేసింది వారిద్దరి మధ్య.

"ఏవండీ! మిమ్మల్ని ఒకమాటడుగుతాను.... నన్నెందుకు....ఇలా చిత్రవధ చేస్తున్నారో చెప్పండి....ఇంతకంటే ఇంత విషం తెచ్చియ్యండి....హాయిగా ఒక్కసారి చచ్చిపోతాను.... క్షణ క్షణం చావలేను...." బాధాతప్త హృదయాన్ని బయటపెట్టింది.

"నీవు....చ్చావడమా? నా కోర్కె తీరందే! నీలాంటి అందమైన బాబు పుట్టాలి....అప్పుడు...." అర్ధాంతరంగా మాట నిలిపాడు.

తను అవతలేమయినా ఫరవాలేదన్నమాట!.... ఛీ....ఛీ....తననెంత నీచంగా చూస్తున్నాడో!

"మీరు చేస్తున్న ప్రతిపనికంటె ఆడపిల్లల్ని తెమ్మనడమంత నీచం మరొకటి లేదు. అమాయకపు ఆడపిల్లల్ని మీ కామానికి.... ఛీ....ఛీ...."

"వూహూ!....అంతా విన్నావన్నమాట.... ఇంక దాచాల్సినవి లేవు .... అవసరమైతే సరుకుల్ని నిర్భయంగా ఇంటికే తెచ్చుకోవచ్చు..." వెటకారంగా అన్నాడు.

సరుకులు అనే దగ్గర వత్తి పలకడంతో వళ్ళు మండింది సౌదకు. "చదువూ సంస్కారం వుండి పెద్ద మనుష్యుల్లా తిరిగే మీకు ఈ బుద్ధులేమిటి? 'సారా' త్రాగడం....బజారు ఆడవాళ్ళతో సరదా తీర్చుకోవడం .... ఛీ .... ఛీ...." జుగుప్స నిండిన స్వరంతో అంది.

"యాపిల్ తింటున్నావని, నేరేడుపండు రుచి బావుండదన్నట్టు, పాయసం తింటున్నావని 'నీరు' రుచి మంచిది కాదన్నట్టు వుంది నీ ధోరణి. అనుభవించే అవకాశమున్నప్పుడు వుపయోగించుకోవడమే పురుష లక్షణం".

అతడి కుత్సితపు మనస్తత్వానికి అసహ్యమేసి చటుక్కున లేచి వెళ్ళి పడకమీద వాలింది సౌద.

శరీరం కుతకుతలాడిపోయింది.

చిన్నగా....వెళ్ళి బ్రాంది సీసా తీసి రెండు పెగ్గులు వేసుకుని సౌద మంచం మీదికి వచ్చాడు.

తన మనసేం బాగాలేదని, తన జోలికి రావద్దని అనునయంగా చెప్పి చూచింది దావానలం మనసులో దాచుకుంటూ.

"మనసుతో నేనేం చేసుకుంటాను! శరీరం గదా నాకు కావలసింది...." అంటూ మొరటుగా దగ్గరకు లాక్కుని కబంధ హస్తాల్లో బిగించాడు.

అప్పటికే త్రాగిన నిషా ఎక్కుతూ వుంది. తను పెడద్రం చేస్తే తంతాడనుకుని లొంగిపోయింది బోయవాడి చేతి పిట్టలా గిలగిల్లాడిపోతూ.

22

రఘునాస్సి-పి. యు. సి. పాసైంది. శారదమ్మ పెండ్లి చెయ్యాలని చదువు చాలించమంది. రమణరావు బి. యస్ సి. లో చేర్చాలని పట్టు పట్టాడు. ఝూన్సీ వుద్దేశం చదవాలనే గనుక కాలేజీలో చేర్పించాడు.

రమణరావు ఫ్రెండ్ గోపాల్రావును గుంటూరు ట్రాన్స్ఫర్ చెయ్యగా రమణరావు యింటి ఎదురింట్లోనే అద్దెకు చేరాడు. గోపాల్రావు భార్య కామాక్షమ్మతో శారదమ్మకు దోస్తీ

కుదిరింది. ఆ సన్నిహితం పురస్కరించుకొని కూతుర్ని కూడా వారింటికి పంపేది.

గోపాల్రావుగారి అబ్బాయి మనోహర్ ఎం. బి. బి. యస్. పాసై యింట్లో వున్నాడు.

ఝాన్సీ వాళ్ళింటికెళ్ళినప్పుడు ఆప్యాయంగా పలకరించేవాడు.

అతడి పిలుపుకు సిగ్గుల మొగ్గై అతి నెమ్మదిగా సమాధానమిచ్చేది ఝాన్సీ.

తన ప్రేమను పలకరింపుతో వ్యక్తం చేసే వాడు మనోహర్. తన అంగీగారాన్ని చిరుమంద హాసంతో స్పష్టం చేసేది ఝాన్సీ.

ఇరువురి మూగప్రేమను గ్రహించారు పెద్దలు. మాటల ప్రస్తావనలో తన కూతుర్ని మనోహర్ కివ్వదలచినట్టు బయట పెట్టాడు రమణరావు.

గోపాలరావు ఆశ్చర్యపోయాడు.

"నీ అంతస్తెక్కడ, నా పరిస్థితెక్కడ? నేను దురాశాపరుణ్ణని పరీక్ష చెయ్యడానికి అడుగుతున్నావా? — వివాహ విషయాల్లో వేళాకోళం పనికిరాదురా?" అన్నాడు గోపాల్రావు కించపడిపోతూ.

"ఇదేం మామూలు విషయమట్రా! పరాచిక మాడ్డానికి?" తమాషా కాదని, నిజమేనని నొక్కి చెప్పాడు.

"వాడికి ఎం. డి చదవాలని వుంది. నేనేం చెప్పించగలనూ? మెడిసన్ చెప్పించేసరికే నా పనైపోయింది."

"యం. డి. ఏమిట్రా, ఫారెన్ పంపించి చదివిస్తాను" భరోసా ఇచ్చాడు రమణరావు.

"నువ్వు మీ అమ్మాయి ఇష్టం కనుక్కో. నేను మా వాడి అభిప్రాయం అడుగుతాను. వాళ్ళిద్దరూ సమ్మతించిన మీదట తక్కిన సంగతులు మాట్లాడుకోవచ్చు" అన్నాడు గోపాల్రావు-పెద్ద ఆఫీసరు, మిత్రుడూ అయిన రమణరావు వియ్యంకుడు కాబోతున్నందుకు, లక్ష్మిలాంటి అమ్మాయి కోడలౌతున్నందుకు, కొడుకు విదేశాల కెళ్ళి చదవబోతున్నందుకు హర్షాతిరేకంతో పొంగిపోతూ.

"మనోహర్‌కు అన్ని ఇవ్వాలనుకుంటున్నాను. నీ కిష్టం లేకపోతే నిర్బంధం లేదు. నిర్మొహ మాటంగా చెప్పవచ్చు" అన్నాడు రమణరావ్ కూతురి వైపు సాదరణగా చూస్తూ.

పుస్తకాలు

చీకటి చెట్టున వెన్నెల పూలు

(నవల)

[రచన: మోచెర్ల జయశ్యామల; ప్రచురణ: జయంతి పబ్లికేషన్స్, ఏలూరురోడ్, విజయవాడ-2; $\frac{1}{8}$ డెమీ సైజులో 228 పేజీలు; వెల రు 6–75; అట్టమీది మూడురంగుల బొమ్మ వి. యస్. ప్రకాష్]

ఈ మధ్య వస్తున్న తెలుగు సాహిత్యంతో ఏ కొంచెం పరిచయమున్నా నవలకు పెట్టిన పేరు చూసే కథను ఊహించవచ్చు. సామాన్య పాఠకురాలి ఊహలకు ఏ మాత్రం భిన్నం లేకుండా ఈ నవల నడుస్తుంది.

కలవారి బిడ్డ రాజా, బీదపిల్ల రాధను ప్రేమించి, చెల్లెలి సహాయంతో తల్లిదండ్రులను ఒప్పించి పెళ్ళి చేసుకుంటాడు. రాధకు నెలలు నిండిన సమయంలో రాజా వ్యాపారం నిమిత్తం బొంబాయి వెళ్ళాల్సి రావటం, అతను వచ్చే లోపలే బాబుని కని రాధ చనిపోవటం జరుగుతాయి. రాధ మరణంతో విరాగిలా మారిన రాజా, మేనత్త కొడుకు రవీంద్ర బలవంతం మీద బాబుని తీసుకొని తీర్థయాత్రలకు బయల్దేరతాడు. ఉత్తర భారతదేశం అంతా చూసి, విశాఖపట్నం వచ్చి అక్కడ రవీంద్ర స్నేహితుడు శేఖర్, అతని భార్య కళ్యాణి, ఆమె చెల్లెలు గీతని కలుసుకొని వారి ఆతిధ్యం స్వీకరించి తిరుపతి వెళ్తాడు. అక్కడ రాజాకు ఎమ్. ఎ.లో క్లాస్‌మేట్ అయిన లెక్చరర్ జానకి కన్పిస్తుంది. (ఆ పాత్ర రాజా కోసమే సృష్టించబడిందని ముందుగానే పసిగట్టేలా రూపొందించబడింది) అతన్ని చూడగానే ఆమె గుండె తరుక్కుపోయి, గాద్గదికమైన కంఠంతో రాజా బాధను అడిగి తెల్సుకొని బాబుకు తల్లిగా, అతని సహచరిగా మారాలన్న తన కోరికను బయట పెడ్తుంది. ఇంకో వంద పేజీల కథ నడవాలి కాబట్టి—రాజా ఆమెను కొంత వ్యవధి కావాలని అడుగుతాడు. తరువాత బాబు పోవటంతో రాజాకు మతిస్థిరం తప్పి ఎవరితోనూ చెప్పకుండా తిరుపతి నుంచి వెళ్ళిపోయి చివరికి శేఖర్‌కు దొరికి అతనింట్లో వుంటాడు. రవీంద్ర, జానకి అక్కడికి వెళ్ళి రాజాను మామూలు మనిషిని చేసి, ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోతారు. కొంత కాలం తర్వాత రాజా జానకిని, రవీంద్ర గీతనీ పెళ్ళి చేసుకుంటారు.

'జీవితమే కొందరికి చీకటయితే ఆ చీకటి చీల్చుకుంటూ వెన్నెల పూలు విరగబూస్తాయ'ని చివరన జానకి పాత్ర చేత రచయిత్రి చెప్పించడంతో—ఈ నవలకు ఆ పేరు ఎందుకొచ్చిందో తెలుస్తుంది. చలన చిత్రాల 'దుష్ప్రభావం' మన నవలల మీద ఎంత వుందో – ఈ పుస్తకం కూడా చెబుతుంది. అయితే ఒక్క వూపులో చివరి దాకా చదివించే నేర్పుగల ఈ రచయిత్రి, భిన్నమైన ఇతివృత్తాన్ని, విభిన్నమైన పాత్రల్నీ సన్నివేశాల్నీ ఎన్నుకుని, రచనలు చేస్తే, ఉత్తమ రచనలు ఇవ్వగలరన్న ఆశ కలుగుతుంది.

పునర్జన్మ

(నవల)

[రచన: సి. కె. లక్ష్మి; ప్రచురణ: జయంతి పబ్లికేషన్స్, ఏలూరురోడ్, విజయవాడ–2; డెమీ సైజులో 112 పేజీలు; వెల: రూ. 4; అట్టమీది మూడు రంగుల బొమ్మ: వి. యస్. ప్రకాష్]

అసలు–ఒక నవల బాగుండాలంటే, అందులో వుండవలసినవి ఏమిటి?–బలమైన కథ, సన్నివేశాలైనా వుండాలి; రచనా శిల్పమైనా వుండాలి. కథలో బలం తక్కువైనా, రచనా విధానంలో సొగసుంటే–ఆ విధానమైనా పుస్తకాన్ని చదివించేస్తుంది. రెండూ లేకపోతే?—

"పునర్జన్మ" ఎటో పయనిస్తుంది; ఎలా వీలైతే అలా తిరుగుతుంది. సినిమాల్లోని సన్నివేశాల్లా—ఎవరి కారు కింద పడాలో వారి కారు కిందే పడడం, చచ్చిపోయారనుకున్నవారు–బతికి రావడం వంటివి వున్నాయి. అలా-అవి జరగడానికి వీలు వున్నదా? వాటికి 'బలం' వున్నదా?–అన్న ఆలోచన రచయిత్రి అసలు పెట్టుకున్నట్టేలేదు. తనకు ఎలా కావాలో, అలా–పాత్రల్నీ, సన్నివేశాల్నీ తిప్పుకున్నట్టుగా వుంది. 'నవలలు ఇలా కూడా రాయొచ్చు–అందులో తప్పేమీ లేదు' అని రచయిత్రి తరపున ఎవరైనా వాదిస్తే– అందుకు చెయ్యదగ్గది ఏమీలేదు; మౌనం వహించి మనకెందుకన్నట్టు–కూచోవడమే!

"మీ యిష్టం నాన్నా. నా భవిష్యత్తు తీర్చి దిద్దేది మీరు...."

'అలా కాదమ్మా! మనస్ఫూర్తిగా యిష్టమైతేనే చెప్పు" రెట్టించాడు.

"సరే...నాన్నా!" లజ్జా భారంతో తల వంచుకుంది.

"ఏం శారదా, మనోహర్‌ని గురించి నీ అభిప్రాయం?" ఆమె కోరిన వాడికివ్వనందుకు భార్యకు బాధగానే వుంటుందని అతడికి తెలుసు. అందుకే ముఖం వంక చూడలేక పోయాడు.

"వాడికి కానప్పుడు యింకెవరైనా ఒక్కటే" చిరుకోపం ధ్వనించిందా స్వరాన.

అర్ధాంగీకారంగా భావించాడు రమణరావు.

కొడుకు ఆమోదం తెలిపినట్టు చెప్పాడు గోపాల్రావు మొహాన ఆనందం చిందగా.

తన వాళ్ళు అంగీకరించినందుకు తృప్తిగా వుందన్నాడు రమణరావు.

"మన స్నేహం బంధుత్వంతో మరింత బలపడుతున్నందుకు సంతోషంగా వుందిరా! మా అదృష్టం!!"

"ఇద్దరిదీ!!" ముక్త కంఠంతో అనుకుంటూ ఆనందంగా నవ్వుకున్నారు స్నేహితులిద్దరూ.

"ఇంక మనోహర్ అమెరికా వెళ్ళటానికి ఏర్పాట్లు ట్రై చేస్తాను."

"మేరేజ్ ముందే చేద్దామా! తిరిగొచ్చిన తరువాత చేద్దామా?" ప్రశ్నార్థకంగా చూచాడు రమణరావు.

"నాకెలాగైనా అభ్యంతరం లేదు. అది వివాహం చేసుకునే వారికే వదిలేద్దాం!" సమాధాన మిచ్చాడు గోపాల్రావు.

మధురమైన ఊహలతో తేలిపోతూ...చల్లగాలికి మేడ వరండాలో పచార్లు చేస్తోంది ఝాన్సీ.....

మెట్లమీద బూట్ల శబ్దమైతే తిరిగి చూచింది. మనోహర్....ఝాన్సీ గుండె వేగంగా కొట్టుకలాడసాగింది. పైకి రాబోతూ ఒక్క క్షణం నిలబడిపోయాడు మనోహర్....అమె అలంకరణని తిలకిస్తూ ... బ్రౌన్ కలర్ పరికిణీ, గ్రీన్ కలర్ పొడవు చేతుల జాకెట్టు, ఆదే రంగు దుద్దులూ, లాకెట్ వేసుకుని రెండు జడలతో ఒక జడ ముందుకూ, రెండో జడ వెనక్కూ పడి పాలరాతి శిల్పంలా మెరిసిపోతూంది ఝాన్సీ. ఈ సౌందర్యమంతా తనదే అనుకుంటుంటేనే

ఎనిమిది సంవత్సరాల యు. వి. లలితాసాగరి విజయవాడ చిల్డ్రన్స్ మాంటిస్సోరి హైస్కూలు విద్యార్థిని. ఈ బాలిక లలిత సంగీతపు పోటీలలో చాలాసార్లు పాల్గొని బహుమతులు గెల్చుకున్నది. ఈ మధ్యనే హైద్రాబాదులో జరిపిన రాష్ట్ర స్థాయి పాటల పోటీలలో పాల్గొని, ఆంధ్రప్రదేశ్ సినీ గాయనీ గాయకుల సంఘం వారిచేత ప్రత్యేక బహుమతిగా బంగారు పతకం గెల్చుకున్నది! ఈ అమ్మాయి లలిత సంగీత కచేరీలలో కూడా పాల్గొంటూ, అన్ని రకాల పాటలూ పాడుతున్నది.

గర్వం పొంగులు వారింది మనోహర్‌కి.... అక్కడే నిలబడి మనోహర్‌ని రమ్మని కనులతోనే స్వాగతం పలికింది ఝాన్సీ.

"నాకై నేను తమ దర్శనానికొచ్చి నప్పుడైనా కాస్త పలకరించ కూడదూ? ముత్యాలేరుకోంలే!"

చిరునవ్వు ఆమె పెదాలపై నర్తించింది.

మల్లె దొంతర్లాంటి పలువరస తళుక్కుమనగా మనోహరంగా నవ్వింది. సాయం సంధ్య అధరాలపై ప్రసరింపగా మరింత ఎరుపెక్కాయవి.

గులాబి రెక్కల్లా విచ్చుకున్న పెదాలపై ఓ ముద్దు పెట్టుకుంటేనో అనుకున్నాడు మనసులో.

"చూడండి ఝాన్సీ! అసలు విషయాని కొద్దాం. మన పెద్దల నిర్ణయం విన్నావనుకుంటాను....నేరుగా నీ అభిప్రాయం తెలుసుకుందామని వచ్చాను" అన్నాడు మనోహర్.

"కూర్చొని మాట్లాడండి....!" కుర్చీ చూపింది.

"మీరు కూర్చోండి....!!" తమాషాగా ఆమె స్టైలు ననుసరించి అన్నాడు.

"మీరు బాగా ఇమిటేట్ చెయ్యగలరే" పరిహాసంలో మెచ్చుకోలు మేళవించింది.

చెక్కిట చెయ్యిచేర్చి విప్పారిన నేత్రాలతో తనని అవలోకిస్తున్న ఝాన్సీ కన్నులలోని నీలి కాంతులు మనోహర్ మనసును అయస్కాంతం చేసాయి. అంత దగ్గరగా మును పెన్నడూ చూడలేదతడు. ఏదో గుర్తుకొచ్చినట్టుగా సంభాషణ మొదలుపెట్టాడు. "సారీ...ఏదో చెప్పబోతున్నాను కదూ? — మీకు నన్ను మేరేజ్ చేసుకోవటం ఇష్టమో కాదో, చెప్పాలి. మొదట్నుంచీ మీ బావ మాధవ్‌గారి కివ్వాలనుకున్నారని విన్నాను. మీకేమాత్రం అతణ్ణి చేసుకోవాలని వున్నా మీ మనసును మభ్యపెట్టుకోవద్దు. అందుకే మీ నోటివెంట మీ మనసులోని విషయాన్ని వినాలని....మీకు నన్ను చేసుకోవాలని లేకపోతే నా దౌర్భాగ్యమనుకుంటాను."

".....వుంటే.....?" కాస్త కొంటెతనం గోచరించిందామె స్వరాన.

"నా అంత అదృష్టవంతుడు లేడనుకుంటాను. మీ ఇష్టం. నా ప్రాప్తం."

"మొత్తానికి వాక్చాతుర్యం వుంది మీలో."

"మీ ముగ్ధమోహన స్వరూపం నన్ను ఆకట్టుకొంటే...."

"కొంటే....?"

'అ హ్హ హ్హ హ్హ' ఇరువురి నవ్వులు కలిశాయి.

నాలుగు కళ్ళు ఒకే చూపుగా నిలిచాయి.

"చూడండి మిష్టర్ మనోహర్....మా బావను నేనెప్పుడూ పెళ్ళి చేసుకోవాలనే దృష్టితో చూళ్ళేదు...."

"అయితే నన్ను?....." చిలిపిగా కళ్ళు చికిలించాడు.

గుండ్రని చిన్న కళ్ళైనా చురుగ్గా వున్నాయి. షేవ్ చేసిన చిరుగడ్డం, కొనదేలిన సన్నని నాసిక, నాజూకైన ముఖం అనుకుంది. నిశ్శబ్దంగా కొన్ని సెకండ్లు గడిచాయి.

మౌనభంగం చేస్తూ మనోహర్ సంభాషణ ప్రారంభించాడు.

"అమెరికా వెళ్ళేముందు మేరేజ్ చేసుకొని తమర్ని కూడా వెంట తీసికెళ్ళాలా? లేక వచ్చిన తరువాత సరాసరి పెండ్లి చేసుకొని...."

"వచ్చిన తరువాత చేసుకోవచ్చు. నేను ఈలోపల బి. యస్ సి. పూర్తిచేస్తాను."

"నీ బాల్యచాపల్యం వదలి వ్యక్తిత్వం పెరుగుతూంది. అందుకే నిన్ను కన్సల్ట్ చేసిగాని నాన్నకు చెప్పదలచుకోలేదు.....వెరీగుడ్.....నీది గుడ్ ఐడియా—ఝాన్సీ! ఈ శుభ సమయంలో కళ్ళెత్తి విందుగా చూడవూ?... మై స్వీట్ గర్ల్" ప్రాధేయతగా ఆమె నయనాలకేసి చూస్తూ.... ఝాన్సీ గడ్డం పట్టుకొని పైకెత్తాడు.

[సశేషం]

చలి కాలంలో తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు

నవంబరు మాసం నుంచి ఫిబ్రవరి మాసం దాకా చలికాలం. పగటిపూట ఎండ కాస్త వేడినిచ్చినా సాయంత్రం ఆరుగంటలయ్యేసరికి చలి ప్రారంభమవుతుంది. చల్లని నీళ్ళు తగిలితే శరీరం జలదరిస్తుంది. పని చేస్తున్నంతసేపూ అంతగా అనిపించదు కానీ తర్వాత కూర్చున్న చోటు నుంచి లేవాలంటే బుద్ధిపుట్టదు. వెచ్చగా దుప్పటి కప్పుకుని పడుకోవాలనిపిస్తుంది. సాధారణంగా చలి కొంత తక్కువగా వుండే మద్రాసు, ఇంకా దక్షిణ ప్రాంతాల్లో కూడా గత రెండేళ్ళు కోల్డ్ వేవ్ మూలాన చలి ఎక్కువగానే ఉన్నది. ఈసారి కూడా ఎక్కువగా వుండే సూచనలు కనిపిస్తున్నాయి.

చలికాలంలో శరీర ఉష్ణోగ్రతను కాపాడుకునేందుకు లోపల దాచి వుంచిన స్వెట్టర్లు, శాలువలు బయటకు తీస్తారు. స్వెట్టర్లు, శాలువలు ధరించినంత మాత్రాన సరిపోదు. చలికాలంలో శరీరం పట్ల, శరీర సౌందర్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ చూపాలి. చలి వలన చాలామందికి ఒళ్ళు పగలడం, చర్మం బిరుసెక్కడం జరుగుతుంది. కొందరికి ముఖం మీద, చేతులమీద తెల్లని పొడలు కూడా ఏర్పడతాయి. కొంతమందికి కాళ్ళు, చేతులు పగుళ్లవారి దురదలు, మంటలు పెడుతుంటాయి. వీటిని అశ్రద్ధ చేస్తే ఒక్కొక్కసారి కాళ్ళమీద, చేతులమీద చర్మం చిట్లి రక్తం కూడా వస్తుంది. కాబట్టి చలికాలంలో చర్మం చిట్లి పాడయిపోకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

సాధారణంగా జిడ్డు చర్మం కలవారికి చలికాలంలో ఏ బాధా ఉండదు. ఎటొచ్చీ పొడి చర్మం కలవారికే ఇబ్బంది ఎక్కువ. పొడి చర్మం కలవారు చలికాలంలో సబ్బు వాడకం పూర్తిగా మానివేయటం మంచిది. అసలే చలికి బిరుసెక్కిన శరీరానికి సబ్బు వాడితే చర్మం మరీ పాడవుతుంది. సబ్బుకు బదులు సున్నిపిండి, సీకాయ పొడి వాడటం శ్రేష్ఠం. ప్రతి రోజూ స్నానం చేయటానికి ముందు కొద్దిగా వెన్నగాని లేకపోతే కొబ్బరినూనెగాని శరీరానికి పట్టించుకుని ఓ పది నిమిషాలు అలాగే వుండి, తర్వాత సున్నిపిండి రుద్దుకుని గోరు వెచ్చని నీటిలో స్నానం చేస్తే చర్మం మృదువుగా తయారవటమేకాక కొత్త కాంతి కూడా వస్తుంది. పొడి చర్మం కలవారు ఈ విధంగా రోజూ చేస్తే చర్మం పగిలి మంటలు పుట్టడమంటూ ఉండదు. ఈ విధమైన చర్మం కలవారు మసిలే నీటితోకాని చల్లని నీటితోకాని స్నానం చేయకూడదు. ఎప్పుడూ గోరు వెచ్చని నీటితోనే స్నానం చెయ్యాలి. ఆ గోరువెచ్చని నీటిలో ఎనిమిది లేక పది చుక్కలు డెట్టాల్ కలుపుకుని స్నానం చేస్తే మరీ మంచిది.

చలికాలంలో ముఖం, చేతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఎందుకంటే ముఖం, చేతులు పైకి కనిపించడం వల్ల వాటికి చలిగాలి ఎక్కువగా తగిలే అవకాశం ఉండటం మూలాన పగిలి పొడలుగా తయారవుతాయి. బుగ్గలు, పెదవులు పగులుతాయి. కొంతమందికి నోటికిరువైపులా చర్మం పగిలి ముడతలు పడి అసహ్యంగా ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రెండు వేళలా కొద్దిగా వెన్న లేక నెయ్యి ముఖానికి, చేతులకి రాసి నెమ్మదిగా ఒత్తుతూ మర్దించి కొంతసేపయ్యాక సున్నిపిండితో కడుక్కోవాలి. రాత్రి పడుకునే ముందు నెయ్యి ముఖానికి పట్టించి పడుకుంటే ప్రొద్దున లేచేటప్పటికి మృదువుగా ఉంటుంది. పెదవులకి వెన్నగాని వాజలైన్‌గాని రాస్తే మెత్తబడతాయి.

ముఖం, చేతులు పొడిపొడిగా ఎండిపోయినట్లున్నవారికి మరో చిట్కా వుంది. కాచి చల్లార్చిన నీరు ఒక చిన్న కప్పు, అదే కప్పుడు నిమ్మరసం, అందులో సగం కొలతకు గ్లిసరిన్ తీసుకోవాలి. ఈ మూడింటిని బాగా కలిపి ఆ ద్రవాన్ని ఒక శుభ్రమైన సీసాలో పోసి ఉంచుకోవాలి. రాత్రి పడుకోబోయే ముందు ముఖానికి, చేతులకి చల్లని నీటితో కడిగిన తర్వాత ఈ ద్రవాన్ని కొద్దిగా రాసుకుని పడుకుంటే గుణం కనిపిస్తుంది. కొంతమందికి పాదాలు పగిలి దురదలు, మంటలుగా ఉంటాయి. రాత్రి పడుకునే ముందు కాళ్ళు కడుక్కుని, గోరు వెచ్చని నీటిలో నాలుగు డెట్టాల్ చుక్కలు కలిపి అందులో ఓ పదినిమిషాలుంచుకుని తర్వాత కాళ్ళు తుడుచుకుని, పల్చగా వాజలైను రాసుకుని పడుకుంటే పగుళ్ళు క్రమంగా తగ్గిపోతాయి.

చలికాలంలో చలిగాలులవల్లనైతేనేమి, అలర్జీ వల్లనైతేనేమి చాలామందికి జలుబు చేస్తుంది. అటువంటివారు చలిగాలి తగలకుండా చూసుకోవటం మంచిది. అలర్జీ వున్నవారు తమకు అలర్జీ చేసే పదార్థం ఏ కొంచెం తిన్నా చలికాలంలో వెంటనే జలుబు చేస్తుంది. కాబట్టి వారూ జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా కొందరు చలికాలంలో రాత్రిపూట భోజనానికి బదులు చపాతీలు తినడం అలవాటు చేసుకుంటారు. అది కూడా మంచి పద్ధతి. గోధుమలు శరీరానికి ఉష్ణం కలిగిస్తాయి. ఇంకో విషయం—రాత్రిపూట పెరుగు ఎక్కువగా వేసుకోవడం అంత మంచిది కాదు. చలికాలంలో ఆహార నియమాలు జాగ్రత్తగా పాటిస్తే జలుబును అరికట్టవచ్చు. తలంటి పోసుకున్నప్పుడు తలలో నీరు నిలవకుండా తువ్వాలుతో బాగా తుడుచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలి.

అంతేకాదు—చలికాలంలో మన వస్త్రధారణను కూడా మార్చాలి. పల్చటి రకాల చీరెలకు బదులు దళసరిగా ఉండే రకాలు కట్టుకోవాలి. ఒంటి నిండా బట్టలు కట్టుకోవడం అలవాటు చేసుకోవాలి. స్వెట్టర్లు, మఫ్లర్లు లేనివారు అవి కొనుక్కోవటమో లేక అల్లడమో ప్రారంభించాలి. తగు నియమాలు పాటించి జాగ్రత్తగా మసులుకుంటే చలికాలంలో కూడా ఆరోగ్యాన్నీ, శరీర సౌందర్యాన్నీ చెక్కుచెదరకుండా కాపాడుకోవచ్చును.

—జి. వసుంధర

ఈ రోజుల్లో తలనొప్పి అంటే మాటలా!
సాలోఫేన్ ను వాడండి.
అమోఘంగా నొప్పులను నివారించే విశిష్టమైన మాత్ర.
వెల అతిచౌక

మంచి నొప్పుల నివారిణి సాలోఫేన్ను గమనించండి. దీనిలో రెండు మందులు అమోఘంగా నొప్పులను పోగొట్టేవి చేరిపున్నాయి—ఆస్ప్రిన్, ఫెనాసిటిన్—అయినప్పటికీ వెల మాత్రము 7 పైసలే ఒకమాత్ర. సాలోఫేన్ అతిశీఘ్రంగా, తలనొప్పులకు జలుబులకు పండ్లనొప్పి. ఫ్లూ జ్వరాలకు కండలనొప్పులకు ఉపశమనం కలిగిస్తుంది. సాలోఫేన్ నొప్పుల నివారిణి మాత్రలు—ఏళ్లతరబడి ఇంటింటా ప్రసిద్ధిపొందిన అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారీ.



అమృతాంజన్ లిమిటెడ్‌వారి నమ్మకమైన తయారీ

సాలోఫేన్ – అమోఘమగు నిరపాయకరమైన నొప్పుల నివారిణి

SAA/AMS/2197 TEL

"లోధ్ర" టానిక్ వనితలకు మాత్రం!

ప్రకృతి సిద్ధమైన పద్ధతి ద్వారా ఆరోగ్యంగా ఉండడానికి నెలలో ప్రతిరోజూ బాధలేని రోజుగా గడపడానికి "లోధ్ర" టానిక్ తీసుకోండి! ఏ బాధా లేకుండా ఆరోగ్యమయమైన జీవితాన్ని గడపండి.

75 సంవత్సరాల నుంచీ స్త్రీల విశ్వాసానికి పాత్రమైన టానిక్.
"లోధ్ర" మందుల షాపులలో దొరుకుతుంది.

ఉచితమైన వైద్య సలహాలకు క్రింది చిరునామాకు ఈ కూపనును పూర్తిచేసి, మీ ఉత్తరంతోబాటు జతచేసి పంపండి.

పేరు : ______________________

చిరునామా : ______________________

____

______________ PIN ______________

కేసరి కుటీరం (ప్రై) లిమిటెడ్

15, వెస్ట్‌కాట్ రోడ్, రాయపేట, మద్రాసు-600 014

ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్, విజయవాడ, సికింద్రాబాదు, బెంగళూరు

Sistas

Edited & Published by B. Viswanatha Reddi for CHANDAMAMA CHILDREN'S TRUST FUND (Prop. of Chandamama Publications) & Printed by B. V. REDDI at Prasad Process Private Ltd., Madras-600 026.

చుట్టూరా చూడండి

ఇంకా వీటిని మీరు కేమెల్ క్రైలిన్ రంగులతో శాశ్వతంగా అందంతో నింపగలరు ?

దీపక్ టీ షర్ట్ పైన డోనాల్డ్ డక్...

పడకటింటి గోడపైన
ఓ పూల కుండీ...

మీ షాపింగ్ బ్యాగ్‌కు
మరో కొత్తదనం...



సోఫా కుషన్‌పై ప్రేమ పక్షులు...



చీరపై మురిపించే రీతిలో మీ
సొంత డిజైన్!...

కేమెల్
క్రైలిన్®

కలర్స్

అందం చిందించే క్రైలిన్ రంగులు. ఎన్నో రకరకాల రంగులు మామూలు పెయింట్ బ్రష్‌తో త్వరగా, సులభంగా వీటితో రంగులు వేయండి. కాటన్ లేక సింథెటిక్ బట్టలు కొయ్య, గోడలు, గాజు పలకలు, నార ఉత్పాదనలు, లెదర్ వస్తువులు— వేటిపైన అయినాసరే. ఒక్కసారి అరితే రంగులు వెలిసిపోకుండా శాశ్వతంగా వుంటాయి. మీ కుటుంబానికీ, మీయింటికీ మీరిచ్చే అందాల కానుక!

కేమ్లిన్ ప్రైవేట్ లిమిటెడ్
ఆర్ట్ మెటీరియల్ డివిజన్,
బొంబాయి 400 059 (ఇండియా)

వీటితో మీరు. లెఖ్ఖలేనన్ని
తీరుతెన్నులతో అందాన్ని
నింపవచ్చు!

Vision 769-Tel

'999' కుట్టు మిషన్లను ఆదరించిన...
మంచి మనసులకు మా సంక్రాంతి శుభాకాంక్షలు!

జయగజలక్ష్మి మెషినరీస్

2/156, బ్రాడ్వే [పై మేడమీద], మద్రాసు - 600001.

గురు ఓవర్‌లాక్ మిషన్లు



ఎరువుల మూటలు కుట్టు మిషన్లు



శివా కుట్టు మిషన్ల మోటార్లు



వివరాలకు
ఫోన్ { 22698 / 27876
సంప్రదించండి.

మా సంక్రాంతి పోటీలో గెలుపొందిన వారు:
శ్రీమతి జెహెరా సుల్తానా, క్రొవ్విడి (పోస్ట్) ప. గో. జిల్లా. PIN - 534198

HIGGINBOTHAMS BOOK STALL VIJAYAWADA.